PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 105 | విజయవాడ, ఆదివారం 17 నవంబర్ 2024 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 17 November 2024 | Rs

బియ్యం తరలిపోతోంది!

- అక్టోబర్‌లో 86 శాతం పెరిగిన ఎగుమతులు
- విలువ రూ.8870 కోట్లకు పైనే..

7

హాకీలో సెమీస్‌కు అమ్మాయిలు

- చైనాపై గెలుపుతో అగ్రస్థానం

8

ఇళ్లు ఇవ్వకుండానే ఇఎంఐలు

- 'టిడ్కో'పై సభలో చర్చ
- విచారణ జరిపిస్తాం : మంత్రి నారాయణ



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వకముందే ఇఎంఐల కోసం నోటీసులు అందుతున్నాయని శాసనసభలో పలువురు సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. టిడ్కో ఇళ్ల నిర్మాణాలు, కాంట్రాక్టర్ల ఇబ్బందులు తదితర అంశాలపై చర్చ జరిగింది. చర్చలో పాల్గొన్న పలువురు సభ్యులు ఈ అంశాన్ని ప్రస్తావించారు. బ్యాంకర్లు నోటీసులు ఇస్తుండటంతో లబ్ధిదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని చెప్పారు. బ్యాంకర్లతో ప్రభుత్వం సంప్రదింపులు జరిపి లబ్ధిదారులకు న్యాయం చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టిడ్కో ఇళ్లకు రహదారులు, విద్యుత్, మంచినీరు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రవాణా సౌకర్యం కల్పించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. చర్చకు జవాబుఇచ్చిన మంత్రి నారాయణ గత ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్ల నిర్మాణంలో చోటుచేసుకున్న అవినీతిపై విచారణ జరిపిస్తామని ప్రకటించారు. చర్చను తొలుత బిజెపి శాసనసభాపక్ష నేత విష్ణుకుమార్ రాజు ప్రారంభించారు. వైసిపి హయాంలో కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోగా, నానా రకాలుగా ఇబ్బందులు పెట్టారని విమర్శించారు. అప్పులు తీసుకొచ్చి గృహనిర్మాణాలు చేపట్టిన కాంట్రాక్టర్లు ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నారని చెప్పారు. ఈ కారణంగానే రాష్ట్రవ్యాప్తంగా 43 మంది ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. చీఫ్ విప్, వినుకొండ శాసనసభ్యులు జివి ఆంజనేయులు మాట్లాడుతూ బ్యాంకులు రుణ వసూళ్ల కోసం లబ్ధిదారులపై ఒత్తిడి చేస్తున్నాయని చెప్పారు. విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ మాట్లాడుతూ మాజీ సిఎం వైఎస్ జగన్ తన హయాంలో 1.20లక్షల ఇళ్లను రద్దు చేశారన్నారు. నిజమైన లబ్ధిదారులను గుర్తించి వారికి న్యాయం చేయాలని కోరారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం 6 నుంచి 10 శాతం లంచాలు తీసుకుని అప్పట్లో కాంట్రాక్టులు ఇచ్చిందన్నారు. అనకాపల్లి జనసేన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ టిడ్కో ఇళ్ల జియో ట్యాగింగ్ చేయాలని, రుణాలను రీషెడ్యూల్ చేసి లబ్ధిదారులను ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బ్యాంకర్లతో ప్రభుత్వం అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలన్నారు. భీమవరం ఎమ్మెల్యే రామాంజనేయులు, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, రాజమండ్రి రూరల్, కొవ్వూరు, ఆధోని, ఆముదాల వలస, తాడేపల్లి గూడెం, గుడివాడ ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ముప్పిడి వెంకటేశ్వరరావు, వి.పార్థసారధి, కూన రవికుమార్, బొలిశెట్టి శ్రీనివాస్, వెనిగండ్ల రాము చర్చలో పాల్గొన్నారు.

అక్రమార్కులను వదలం : మంత్రి పొంగూరు నారాయణ

టిడ్కో ఇళ్ల నిర్మాణంలో అక్రమాలకు కారణమైన వారిని ఎవరినీ వదిలేది లేదని రాష్ట్ర మునిసిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన లబ్ధిదారుల ఎంపిక, బ్యాంకులకు డిడిల చెల్లింపుల్లో జరిగిన అక్రమాలపై దర్యాప్తునకు ఆదేశిస్తున్నట్లు చెప్పారు. 2014-19లో కేంద్రం నుంచి 7లక్షల 1481 ఇళ్లకు అనుమతులు తీసుకున్నామని, ఇందులో 5లక్షల ఇళ్ల నిర్మించేందుకు పాలనాపరమైన అనుమతులు తీసుకున్నట్లు తెలిపారు. వైసిపి ప్రభుత్వం 2,62,216 ఇళ్ల మంజూరును రద్దు చేసిందన్నారు. కాంట్రాక్టర్లకు రూ.540 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. టిడ్కో ఇళ్లకు మౌలిక వసతుల కోసం రూ.5,200 కోట్లు అవసరమవుతాయని అంచనా వేసినట్లు మంత్రి తెలిపారు.

అబుజ్‌మడ్ అడవుల్లో ఎన్‌కౌంటర్

- ఐదుగురు మావోయిస్టుల మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఛత్తీస్‌గఢ్‌లోని అబుజ్‌మడ్ అడవుల్లో మళ్లీ తుపాకులు గర్జించాయి. శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఖిలేశ్వర్ గావ్డే, హిరామన్ యాదవ్ అనే ఇద్దరు జవాన్లకు తీవ్ర గాయాలైనట్లు కాంకేర్ జిల్లా ఎస్‌పి ఐకె ఎలిసెలా తెలిపారు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న కాంకేర్ జిల్లా, నారాయణపూర్ జిల్లా బోర్డర్ అబుజ్ మడ్ దండకారణ్యంలో మావోయిస్టుల కేంద్ర కమిటీ సభ్యుడు అభయ్, మావోయిస్టులు సంచరిస్తున్నట్లు పక్కా సమాచారం అందుకున్న పోలీసులు ఆ ప్రాంతంపై దాడి చేశారు. బిఎస్‌ఎఫ్, డిస్ట్రిక్ట్ రిజర్వు గార్డ్, స్పెషల్ టాస్క్ ఫోర్స్ కలిసి నారాయణపూర్ కాంకేర్ జిల్లాల్లో గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి. కాల్పుల్లో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు అభయ్ హతం అయ్యాడా? లేదా? అనే విషయాన్ని ఉన్నతాధికారులు ధ్రువీకరించాల్సి ఉంది. కాల్పులు జరిగిన స్థలంలో ఐదుగురు మావోయిస్టుల మృతదేహాలు లభ్యమయ్యాయి. అత్యంత అధునాతన ఆటోమేటిక్ రైఫిల్, ఎకె 47తో పాటు, సామగ్రి, మందు పాతరలు పెద్దఎత్తున లభ్యమయ్యాయని ఎస్‌పి తెలిపారు. తీవ్ర గాయాలైన జవాన్లను ఎంఐ 17 ప్రత్యేక హెలికాప్టర్‌లో రాయపూర్ ఆస్పత్రికి తరలించారు. నారాయణ్‌పూర్, కాంకేర్‌తో సహా ఏడు జిల్లాలతో కూడిన బస్తర్ ప్రాంతంలో తాజా ఘటనతో సహా ఈ ఏడాది ఇప్పటివరకు జరిగిన వివిధ ఎన్‌కౌంటర్లలో 197 మంది మావోయిస్టులు చనిపోయారు. అక్టోబరు4న ఇదే అబుజ్‌మడ్‌లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 30 మంది మావోయిస్టులు మృతి చెందిన సంగతి తెలిసిందే.

హాస్టళ్లలో దారుణాలా?

తక్షణమే కట్టడి చేయాలని ఆదేశం

- హైకోర్టు ఆందోళన
- మార్గదర్శకాలు జారీ

కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న విజయనగరం జిల్లా సంక్షేమ హాస్టల్ విద్యార్థినులు (ఫైల్)

ప్రజాశక్తి - అమరావతి

రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్ల దుస్థితిపైన, జరుగుతున్న ఘటనలపైన హైకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. దారుణాలను తక్షణమే కట్టడి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. హాస్టళ్లలో విద్యార్థుల భద్రతతో పాటు, నాణ్యమైన విద్య, వసతులు, భోజనం అందించాలని పేర్కొంది. ఈ మేరకు తీసుకోవాల్సిన చర్యల గురించి మార్గదర్శకాలు జారీ చేసింది. 2013లో హైకోర్టు ముందుకు వచ్చిన ఒక కేసుకు సంబంధించిన తీర్పు సందర్భంగా జస్టిస్ నూనెపల్లి హరినాథ్ ఈమేరకు కొద్దిరోజుల క్రితం ఇచ్చిన ఉత్తర్వులు శనివారం అధికారికంగా అందుబాటులోకి వచ్చాయి. అనంతపురం జిల్లా గుత్తిలోని ఒక సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ స్కూల్‌లో వాచ్‌మెన్‌గా పనిచేసే శంకరయ్య ఒక బాలిక పట్ల అభ్యంతరకరంగా ప్రవర్తించాడు. ఆ బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు విచారణ జరిపిన అధికారులు అభియోగాలు నిజమని తేలడంతో అతనిని సర్వీసు నుండి తొలగించారు. దీనిని సవాల్ చేస్తూ శంకరయ్య హైకోర్టులో వేసిన పిటిషన్‌పై 13 ఏళ్ల తరువాత ఆయన పిటిషన్‌ను కొట్టివేస్తూ ధర్మాసనం తీర్పు వెలువరించింది. ఈ సందర్భంగా అప్పటి నుండి ఇప్పటి వరకు హాస్టళ్లలో ఎటువంటి మార్పులు లేవని వ్యాఖ్యానించిన ధర్మాసనం, తీసుకోవాల్సిన చర్యలు వివరిస్తూ మార్గదర్శకాలను జారీ చేసింది. గ్రామీణ ప్రాంతాల్లోని హాస్టళ్లలో కూడా విద్యార్థులకు భద్రత కల్పించాలని, నాణ్యమైన విద్య, వసతులు, భోజనం వంటివి అందేలా చూడాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. విద్యార్థులతో స్టాఫ్, టీచర్లు, ఇతరులు ఎవరైనా అనుచితంగా ప్రవరిస్తే చర్యలు కఠినంగా ఉండాలని పేర్కొంది. అటువంటి చర్యలు ఉంటేనే పిల్లల్ని చేర్చేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతారని అభిప్రాయపడింది. తీర్పు కాపీని మహిళ, శిశు సంక్షేమ శాఖకు పంపాలని రిజిస్ట్రీని ఆదేశించింది.

ఈ చర్యలు తీసుకోండి

- హాస్టల్ బిల్డింగ్ చుట్టూ సోలార్ ఎలక్ట్రిక్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి.
- హాస్టల్‌కు తప్పనిసరిగా గేటు ఉండాలి. రాకపోకలు రికార్డు చేయాలి.
- ఎంట్రన్స్ వద్ద కారిడార్లు, కామన్ ఏరియాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలి.
- అదే సమయంలో సిసి కెమెరాలతో విద్యార్థుల వ్యక్తిగత గోప్యత దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- నీటి సదుపాయం తప్పనిసరిగా కల్పించాలి.
- మరుగుదొడ్లను శుభ్రంగా ఉండేలా చూడాలి

బాలికల పట్ల మరింత బాధ్యతగా....

- సంక్షోభ సమయాలను ఎదుర్కొనేందుకు బాలికలకు అవగాహన కల్పించాలి. శిక్షణ ఇవ్వాలి.
- వ్యక్తిగత సమస్యల పరిష్కారం కోసం మానసిక వైద్యులను అందుబాటులో ఉంచాలి
- ఆడ పిల్లలతో సన్నిహితంగా మెలిగే వారికి లింగ సమానత్వం గురించి అర్ధమయ్యేలా చెప్పాలి
- స్టాఫ్‌కు ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా అమలు చేయాలి.
- దుష్ప్రవర్తన, అసభ్య ప్రవర్తన, వేధింపులకు పాల్పడకుండా చూడాలి
- అలా ఎవరైనా ప్రవర్తిస్తే తప్పనిసరిగా పోక్సో చట్టం అమలు చేయాలి
- పోక్సో చట్టం కింద విధించే శిక్షల గురించి బోర్డులు ఏర్పాటు చేయాలి.
- సమ వయసున్న విద్యార్థులతో టీమ్స్ ఏర్పాటు చేయాలి.
- ఉన్నతాధికారులు తరచు తనిఖీలు నిర్వహించాలి.

పది సూత్రాలతో అగ్రగామిగా ఆంధ్ర

- సోషల్ మీడియా నియంత్రణకు చర్చ జరగాలి
- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు



హిందుస్థాన్ టైమ్స్ లీడర్షిప్ సమ్మిట్‌లో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామి రాష్ట్రంగా నిలిపేందుకు తాము పది సూత్రాలతో ముందుకు వెళ్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. శనివారం నాడిక్కడ వందేళ్ల హిందుస్థాన్ టైమ్స్ లీడర్షిప్ సమ్మిట్ (హెచ్‌టిఎల్‌ఎస్) 22వ ఎడిషన్లో ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వ హయాంలో తన అరెస్టు, సోషల్ మీడియా, ఎన్‌డిఎ పాలన, అభివృద్ధి తదితర అంశాలపై ప్రధానంగా ప్రస్తావించారు. పేదరిక నిర్మూలనకు, దేశాభివృద్ధికి కూడా ఈ పది సూత్రాలు ఉపయోగపడతాయన్నారు. పిపిపి విధానాలు, ఉపాధి, ఉద్యోగాలు, స్కిల్ డెవలప్‌మెంట్, నదుల అనుసంధానం, అగ్రికల్చర్, లాజిస్టిక్స్ , గ్రీన్ ఎనర్జీ, స్వచ్ఛ భారత్, డీప్ టెక్నాలజీ దేశాభివృద్ధిలో భాగం కావాలన్నారు. దేశ జనాభా నియంత్రణపై ఇప్పుడు చర్చ అవసరమని, ఎక్కువ మంది పిల్లలు ఇప్పుడు అవసరమని చెప్పారు. జనాభా నిర్వహణతో మన దేశం ముందుకు వెళ్లాలన్నారు. కూటమి ప్రభుత్వానికి ప్రజాభివృద్ధి ధ్యేయమని చెప్పుకొచ్చారు. కాగా కేంద్రం, రాష్ట్రంలో ఒకే ప్రభుత్వం కొనసాగుతూ ఉంటే అభివృద్ధి మరింత వేగంగా చేసే వీలుంటుందని అన్నారు. అభివృద్ధి, సంక్షేమంతో పాటు ప్రజల భాగస్వామ్యంతో కూటమి పాలన ఉంటుందన్నారు.

సోషల్ మీడియాను నియంత్రించాలి..

దేశంలోసోషల్ మీడియాను నియంత్రించేందుకు చర్చ జరగాలని సిఎం చంద్రబాబు అన్నారు. "ప్రజా స్వామ్యంలో సోషల్ మీడియా పాత్ర దుర్బలంగా మారింది. మహిళలు, రాజకీయ నేతలను అగౌరవ పరిచేందుకు కొందరు క్రిమినల్స్ సామాజిక మాధ్యమాలను వాడుకోవడం ఇప్పుడు అతిపెద్ద సవాలు. సోషల్ మీడియాలో మమ్మల్ని మాత్రమే కాదు, సొంత తల్లిని, చెల్లిని కూడా బూతులు తిట్టిస్తుంటే, వాళ్లని ఏమనాలి? ఇలాంటి వారిపై చర్యలు తీసుకోకూడదా? సోషల్ మీడియాలో మహిళలని వేధించే వారిని ఎలా కంట్రోల్ చేయాలి? సోషల్ మీడియాని నియంత్రించేందుకు చర్చ జరగాలి" అని అన్నారు.

మోడీ సర్కార్‌కు సంపూర్ణ మద్దతు

ఎన్‌డిఎ ప్రభుత్వానికి, ప్రధాని మోడీకి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని చంద్రబాబు అన్నారు. 1989 నుంచి టిడిపి దేశ రాజకీయాల్లో ముఖ్యమైన పాత్ర పోషించిందన్నారు. అక్రమ కేసులు పెట్టి 53 రోజులు పాటు వైసిపి ప్రభుత్వం తనను వేధించిందని అన్నారు. చేయని తప్పునకు శిక్ష అనుభవించానన్నారు. తాను 45 ఏళ్ల పాటు ఎన్నో ప్రజా ప్రయోజన విధానాలు తీసుకొచ్చి, ఎన్నో సంక్షేమ కార్యక్రమాలతో ప్రజల కోసమే పని చేశానన్నారు. జైళ్లో ఉన్న 53 రోజులు ఎక్కడా తాను నిరుత్సాహపడలేదని, మరింత పట్టుదల పెరిగిందని అన్నారు. ఆ పట్టుదల ప్రజలకు సేవ చేయటానికి ఉపయోగిస్తున్నానని పేర్కొన్నారు.

తూత్తుకుడి ప్లాంట్‌కు సుప్రీం 'నో'

- వేదాంత రివ్యూ పిటిషన్ తిరస్కరణ

న్యూఢిల్లీ : వేదాంత కంపెనీకి చెందిన తూత్తుకుడి రాగి ప్లాంట్‌ను తిరిగి తెరిచేందుకు సుప్రీం కోర్టు నో చెప్పింది. కంపెనీని తిరిగి ప్రారంభించేందుకు ఆదేశాలు జారీ చేయడానికి తిరస్కరించింది. ఫిబ్రవరిలో ఇచ్చిన తీర్పును పున:పరిశీలించాల్సిందిగా కోరుతూ వేదాంత స్టెరిలైట్ పెట్టుకున్న రివ్యూ పిటిషన్‌ను సుప్రీం కోర్టు తోసిపుచ్చింది. ఈ ప్లాంట్ వల్ల కాలుష్యం ఎక్కువవుతోందంటూ స్థానికులు సాగించిన సుదీర్ఘ పోరాటం ఫలితంగా ఆరేళ్ళ క్రితం ఈ ప్లాంట్ మూత పడింది. కేవలం పారిశ్రామిక ప్రయోజనాల కన్నా ఆరోగ్యం ముఖ్యమైన ప్రజా హక్కు అని సుప్రీం కోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది. బహిరంగ కోర్టులో రివ్యూ పిటిషన్ కోసం పెట్టుకున్న దరఖాస్తును తిరస్కరించినట్లు త్రిసభ్య ధర్మాసనం అక్టోబరు 22న జారీ చేసిన ఆదేశాలను శనివారం ప్రచురించారు. ఈ నెల 10న పదవీ విరమణ చేసిన భారత ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ నేతృత్వంలోని బెంచ్ ఈ రివ్యూ పిటిషన్‌ను తోసిపుచ్చింది. తూత్తుకుడి ప్లాంట్‌ను మిగతా 2లో

రుషికొండ భవనాల్లో సైన్స్ అండ్ టెక్నాలజీ మ్యూజియం

ముఖ్యమంత్రికి వి.శ్రీనివాసరావు లేఖ

రుషికొండ భవనం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖపట్నం నగరంలోని రుషికొండపై గత ప్రభుత్వం నూతనంగా నిర్మించిన అతిథిగృహాలను సైన్స్ అండ్ టెక్నాలజీ మ్యూజియంగా మార్చాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి ఆయన శనివారం లేఖను రాశారు. భవనాల నిర్వహణపై ఈనెల 18వ తేదీన శాసనసభలో చర్చ జరగబోతున్నట్లుగా మీడియాలో చూశానని, గత ప్రభుత్వం విలాసవంతమైన ఈ భవనాన్ని నిర్మించడానికి సుమారు రూ.500 కోట్ల ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసిందని తెలిపారు. దాన్ని తిరిగి అతిథిగృహంగానో, ప్రభుత్వ క్యాంపు ఆఫీసుగానో ఉపయోగించడం సరైంది కాదని పేర్కొన్నారు. ప్రజాధనంతో నిర్మించిన ఈ భవనం ప్రజలకే ఉపయోగపడాలని, ఆరేళ్ళ పిల్లలు మొదలుకొని పెద్దల వరకు స్వేచ్ఛగా భవనంలోకి అడుగుపెట్టి చూడడానికి అవకాశం కల్పించాలని కోరారు. రాష్ట్ర విభజన తరువాత హైదరాబాదు, బెంగళూరు తరహాలో విజ్ఞానవంతమైన సైన్సు మ్యూజియం ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడా లేదని, ఆధునిక ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా సైన్సు అండ్ టెక్నాలజీ మ్యూజియంను ఈ భవనంలో ఏర్పాటు చేస్తే విద్యార్థులకు, యువతకు స్ఫూర్తివంతంగా ఉంటుందని తెలిపారు. దానికి అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం సమకూర్చవచ్చుని, పై సూచనను గమనంలో ఉంచుకొని గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన అత్యంత వివాదాస్పదమైన ఈ భవనాన్ని టిడిపి ప్రభుత్వ హయాంలో అర్థవంతంగా మార్చాలని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయులకు పిఎఫ్ అకౌంట్లు

కమిషనర్లకు అనుమతి ఇచ్చిన ఆర్థిక శాఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రప్రభుత్వం మున్సిపల్ ఉపాధ్యాయులకు పిఎఫ్ ఖాతాలు ప్రారంభించేందుకు అనుమతి ఇచ్చింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ఆర్థిక శాఖ ఇటీవల విడుదల చేసింది. పిడి ఖాతాలు ప్రారంభించాలని మున్సిపల్ కమిషనర్లకు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ ఖాతాలకు వడ్డీ చెల్లిస్తుందా? లేదా? అనే స్పష్టత ఇవ్వలేదు. ఈ అంశంపై స్పష్టత ఇవ్వాల్సి ఉంది. మున్సిపల్ ఉపాధ్యాయులకు ఇప్పటి వరకు పిఎఫ్ ఖాతాలు లేవు. వీటిని ప్రారంభించాలని ఏళ్లతరబడి కోరుతున్నారు. మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీస్‌ను విద్యాశాఖలో కలుపుతూ 2022 జూన్‌లో ప్రభుత్వం 84వ నెంబర్ జిఓను విడుదల చేసింది. ఆ సమయంలో ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉపాధ్యాయులకు ఉండే సౌకర్యాలు కల్పిస్తామని విద్యాశాఖ హామీ ఇచ్చింది. దీంతో ఏళ్ల తరబడి ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్నారు. మున్సిపల్ ఉపాధ్యాయుల పిఎఫ్‌పై కదలిక రావడం పట్ల యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్‌ఎస్ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఉపాధ్యాయులను విద్యాశాఖలో విలీనం చేసే సమయంలో పిఎఫ్, బదిలీలు, ప్రమోషన్లు, అప్‌గ్రేడేషన్ చేస్తామని విద్యాశాఖ హామీ ఇచ్చిందని తెలిపారు. వీటికోసం దశల వారీగా పిడిఎఫ్, యుటిఎఫ్ పోరాటం చేశాయని, ఫలితంగా ఉపాధ్యాయుల ప్రమోషన్ షెడ్యూల్ ఇప్పటికే వచ్చిందని తెలిపారు. భవిష్యత్తులో ఉపాధ్యాయుల వ్యక్తిగత ఖాతాలు తెరిచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికైనా పిఎఫ్‌పై కదలిక తీసుకొచ్చిన విద్య, ఆర్థిక, మున్సిపల్ శాఖల ఉన్నతాధికారులకు అభినందనలు తెలిపారు. మున్సిపల్ ఉపాధ్యాయుల పిఎఫ్ ఖాతాల అనుమతిపై ఎపిటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సివి ప్రసాద్, రాధాకృష్ణ హర్షం వ్యక్తం చేశారు.

అయ్యో.. అన్నమయ్యా..!

- నాలుగేళ్లుగా డిజైన్ల దశలోనే
- ఎనిమిది లక్షల క్యూసెక్కుల డిశ్చార్జిపై విస్మయం
- త్వరలో ప్రభుత్వానికి నివేదిక!

3

దిగొస్తున్న అపరంజి

- ఈ నెలలో 6 శాతం తగ్గిన బంగారం ధర

యుద్ధోన్మాదంతో పెట్రేగిపోతున్న ఇజ్రాయిల్

- దక్షిణ బీరుట్‌లో వరుస దాడుల్లో 59 మంది మృతి
- గాజాలో మరో 28 మంది బలి

7

కదంతొక్కిన అంగన్‌వాడీలు

- మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలి
- సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలి
- ర్యాలీలు, కలెక్టరేట్ల వద్ద ధర్నా
- పోరాడితేనే సమస్యలు పరిష్కారం : పుణ్యవతి

విశాఖలో నిర్వహించిన అంగన్‌వాడీల ధర్నాలో మాట్లాడుతున్న పుణ్యవతి

ప్రజాశక్తి- యంత్రాంగం

మినీ అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని, ధరలకనుగుణంగా వేతనాలు పెంచాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలు శనివారం కదంతొక్కారు. ర్యాలీలు, కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీ వర్కర్లకు, హెల్పర్లకు, మినీ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా గుర్తించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. కలెక్టర్లకు, అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన ఈ కార్యక్రమం చేపట్టారు. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో ధర్నాకు వస్తున్న అంగన్‌వాడీలను అడ్డుకోవడానికి పోలీసులు ప్రయత్నించారు. విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద అంగన్‌వాడీల ధర్నాకు ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి మద్దతు తెలిపి మాట్లాడారు. గత ప్రభుత్వం అంగన్‌వాడీ యూనియన్‌తో చేసుకున్న ఒప్పందం ప్రకారం అంగన్‌వాడీ కార్యకర్తలకు జీతాలు, ఇతర అలవెన్సులను ప్రస్తుతం అధికారంలో ఉన్న టిడిపి కూటమి ప్రభుత్వం తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పాలకులు మారినా గత ప్రభుత్వాల ఒప్పందాలు మారబోవని, వీటిని అమలు చేయాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. పాలకుల జీతాలతో పోలిస్తే అంగన్‌వాడీల ఇచ్చే జీతాలు అతి స్వల్పమన్నారు. బిడ్డ పుట్టినప్పటి నుంచి పెరిగే వరకు అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, మిడ్ డే మీల్స్ కార్మికులు చేస్తున్న శ్రమ ఎంతో ఉంటుందని వివరించారు. అటువంటి వారి పట్ల పాలకులు సానుభూతితో వ్యవహరించాల్సి ఉందన్నారు. పోరాడితే తప్ప సమస్యలు పరిష్కారం మిగతా 2లో

జీరో అవర్‌పై సభ్యుల అసంతృప్తి

- 'డ్రైవర్ లేని కారు' అన్న కూన రవికుమార్
- సభాపతి సూచన పట్టని మంత్రులు

అసెంబ్లీలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు , కూన రవికుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శాసన సభలో జీరో అవర్ కొనసాగుతున్న తీరుపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. సభ శనివారం ప్రారంభమైన అనంతరం తొలుత సభాపతి మాజీ శాసన సభ్యులకు సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అనంతరం జీరో అవర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా టిడిపి సభ్యులు కూన రవికుమార్‌కు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వగా ఆయన సభలో 'జీరో అవర్' డ్రైవర్ లేని కారులా నడుస్తోందని ఉందని వ్యాఖ్యానించారు. సభ్యులు లేవనెత్తిన అంశాలకు సంబంధిత శాఖా మంత్రులు స్పందించి నోట్ చేసుకున్నట్లు ప్రకటించడం సాంప్రదాయంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు సమాధానమిస్తూ సభ్యులు లేవనెత్తిన అంశాలు సభలో రికార్డు అవుతున్నాయని, వాటిని సంబంధిత మంత్రులకు అందజేయడం జరుగుతుందని, వారు తదుపరి చర్యలు తీసుకుంటారని, సమస్య పరిష్కరించి సభ్యులకు తెలియజేస్తారని చెప్పారు. సభలో మంత్రులు నోట్ చేసుకున్నామని ప్రకటిస్తే సభ్యులకు సమస్య పరిష్కారమవుతుందనే భావన కలుగుతుందని కూన తెలిపారు.

సభాపతి అయ్యన్నపాత్రుడు స్పందిస్తూ రవి చివరి వరుసలో కూర్చోవడం వల్ల ముందు జరిగేది తెలియడం లేదంటూ వ్యాఖ్యానించారు. తొలుత జీరో అవర్ ప్రారంభించిన సమయంలో సభాపతి సభ్యులు లేవనెత్తిన అంశాలను సంబంధిత శాఖల మంత్రులు నోట్ చేసుకోవాలని ఆయన మంత్రుల దృష్టికి తీసుకువచ్చారు. సభ్యులు లేవనెత్తిన అంశాలపై సంబంధిత మంత్రులు 'నోట్ చేసుకున్నామని, తగిన చర్యలు తీసుకుంటామని' సమాధానం ఇవ్వకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. అదేవిధంగా జీరో అవర్‌లో సభ్యులు ప్రస్తావించే అంశాలు నేరుగా తనకు అందజేయవద్దని, విప్‌ల నుంచి మాత్రమే రావాలని సూచించారు.

భీమవరం శాసన సభ్యులు పాలపర్తి రామాంజనేయులు, నియోజవర్గంలోని యనమదురు డ్రైన్‌పై ఏర్పాటు చేసిన 3 వంతెనలు అప్రోచ్ రోడ్లు లేక నిరుపయోగంగా ఉన్నాయని, అప్రోచ్ రోడ్డు పనులు వెంటనే చేపట్టాలని కోరారు. రాజానగరం ఎమ్మెల్యే బాతుల బలరామకృష్ణ, ఇండస్ట్రియల్ పార్కులో ప్లాట్లు పొందిన వారు పరిశ్రమలు ఏర్పాటు చేయకపోవడంతో నిరుద్యోగులకు ఉద్యోగాలు లేక వలస పోతున్నారని చెప్పారు. కావలి ఎమ్మెల్యే డి.వెంకటకృష్ణారెడ్డి తన నియోజకవర్గంలో చెరువుల్లో పుష్కలంగా నీళ్లున్నా, కాల్వలు సక్రమంగా లేకపోవడంతో సాగునీరు అందడం లేదని, కాల్వల నిర్వహణ పనులు చేపట్టాలనే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. పాలకొండ ఎమ్మెల్యే ఎన్.జయకృష్ణ, తోటపల్లి ప్రాజెక్టు కాల్వల ఆధునీకరణ పనులు చేపట్టాలని కోరారు. చిలకలూరిపేట ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు, 22ఎ జాబితాలో భూములున్న 5 లక్షల మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గత టిడిపి ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారానికి చట్టం తెచ్చిందని, దీనిని అమలు చేయాలనే అంశాన్ని ప్రస్తావించారు. తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్, పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, కాకినాడ ఎమ్మెల్యే వి.వెంకటేశ్వరరావు నియోజకవర్గాలలో వంతెనల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మండపేట నియోజకవర్గాన్ని అమలాపురం జిల్లా నుంచి తొలగించి తూర్పుగోదావరి జిల్లాలో కలపాలనే ప్రతిపాదనను ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, గౌతు శిరీషలు వైసిపి సోషల్ మీడియా యాక్టివిస్టులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కేవలం 41ఎ కింద నోటీసులు ఇచ్చి వదిలేయడంతో వారు మరింత రెచ్చిపోతున్నారని, వీరిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. జగ్గయ్యపేట ఎమ్మెల్యే రాజగోపాల్, ఇటీవల మునేరుకు వచ్చిన వరద కారణంగా రైతుల పంట పొలాల్లో ఇసుక మేటలు వేసిందని, దీనిని తొలగించే పనులను ఉపాధి హామీ పథకం కింద చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్‌ఎస్ సహా పలువురు మాజీ ఎమ్మెల్యేల మృతికి సంతాపం

- శాసనసభలో తీర్మానం ప్రవేశపెట్టిన సభాపతి

మాజీ శాసన సభ్యులు రుద్రరాజు సత్యనారాయణరాజు, మరికొందరు మాజీ శాసన సభ్యుల మృతికి సభ సంతాపం తెలిపింది. శాసన సభ శనివారం ప్రారంభమైన అనంతరం స్పీకర్ సిహెచ్ అయ్యన్నపాత్రుడు, ఇటీవల మృతి చెందిన మాజీ శాసన సభ్యులకు సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.

ఈ సందర్భంగా సభాపతి మాట్లాడుతూ రుద్రరాజు సత్యనారాయణరాజు చించివాడ సర్పంచిగా ప్రజా జీవితాన్ని ప్రారంభించారని, సిపిఎం రాష్ట్ర నాయకులుగా పని చేశారని చెప్పారు. 1967-72 మధ్య కాలంలో నరసాపురం శాసన సభ్యులుగా ప్రజా సమస్యలపై పోరాటం చేశారని తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి కృషి చేశారని, రైతు, కార్మిక ఉద్యమాలను ముందుండి నడిపించారని చెప్పారు. భూస్వామ్య వ్యతిరేక పోరాటంలో జైలు జీవితాన్ని అనుభవించారని పేర్కొన్నారు. ఈ ఏడాది సెప్టెంబరు 5వ తేదీన కన్నుమూశారని తెలిపారు. అదేవిధంగా ఇటీవల మరణించిన మాజీ శాసన సభ్యులు కెంబూరి రామ్మోహన్‌రావు, పాలపర్తి డేవిడ్ రాజు, అడుసుమిల్లి జయప్రకాష్, మాగుంట పార్వతమ్మ, రెడ్డి సత్యనారాయణలకు శాసన సభ సంతాపం తెలిపింది. ఈ సందర్భంగా సభ్యులు రెండు నిముషాలు మౌనం పాటించారు.

వివిధ శాఖల పద్దులకు సభ ఆమోదం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వార్షిక బడ్జెట్‌లో భాగంగా వివిధ శాఖలు గ్రాంట్ల కోసం సభ ముందుంచిన డిమాండ్లను శాసన సభ ఆమోదించింది. స్పీకర్ అయ్యన్నపాత్రుడు డిమాండ్లపై ఓటింగ్ నిర్వహించగా, సభ్యులందరూ వారి ఆమోదాన్ని తెలిపారు. అంతకుముందు స్పీకర్ అనుమతితో మంత్రులు డిమాండ్లను సభలో ప్రవేశపెట్టారు. రోడ్లు, భవనాల శాఖ కోసం రూ.8,700.35 కోట్లను కోరుతూ ఆ శాఖ మంత్రి బిసి జనార్ధనరెడ్డి డిమాండ్‌ను సభ ముందుంచారు. పరిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్ ఆ శాఖ కోసం రూ.4,371.41 కోట్లు డిమాండ్ సమర్పించారు. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మేజర్ అండ్ మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టుల కోసం రూ.15,513.65 కోట్లు, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల కోసం రూ.1,221.97 కోట్లు, ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆ శాఖ కోసం రూ.8,217.07 కోట్లు డిమాండ్లను సభ ముందుంచారు.

వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఆ శాఖ కోసం రూ.9,713.97 కోట్లు, పశుసంవర్ధక, మత్స్యశాఖ కోసం రూ.1,832.93 సహకార శాఖ కోసం రూ.308.26 కోట్లు డిమాండ్లు సమర్పించారు. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆ శాఖ కోసం రూ.3,739.79 డిమాండ్‌ను సభ ముందుంచారు. గృహనిర్మాణ శాఖ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి గృహనిర్మాణ శాఖ కోసం రూ. 4,012.53 కోట్లు, సమాచార శాఖ కోసం రూ.293.08 కోట్ల డిమాండ్లను సమర్పించారు. రవాణా, క్రీడా శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డి రవాణా శాఖ కోసం రూ.372.15 కోట్లు, క్రీడలు, యువజన సర్వీసుల కోసం రూ.185.50 కోట్లు డిమాండ్లను సభ ముందుంచారు. ఈ సందర్భంగా డిమాండ్లపై జరిగిన చర్చలో శాసన సభ్యులు కాలువ శ్రీనివాసులు, లోకం నాగ మాధవి, ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, కె.మురళీమోహన్, వర్ల కుమార్‌రాజా, వి.వెంకటేశ్వరరావు, బగ్గు రమణమూర్తి, యార్లగడ్డ వెంకట్రావు, కాకరాల సురేష్ ప్రసంగించారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ

'రాజీవ్ రంజన్ మిశ్రా' కమిటీని స్వాగతిస్తున్నాం

- ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

ఎస్‌సి వర్గీకరణ విషయంలో రాజీవ్ రంజన్ మిశ్రా ఆధ్వర్యంలోని ఏకసభ్య కమిటీని స్వాగతిస్తున్నామని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ అన్నారు. అనంతపురంలోని లలిత కళాపరిషత్‌లో శనివారం ఏర్పాటు చేసిన మాదిగల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మాదిగలకు చంద్రబాబు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నందుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. రెండు నెలల గడువులోపే వర్గీకరణ అంశంపై నివేదిక ఇవ్వాలని కమిషన్‌ను కోరిన అంశాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. ఎస్‌సి వర్గీకరణ కోసం మూడు దశాబ్దాలుగా ఎంఆర్‌పిఎస్ చేస్తోన్న ఉద్యమానికి సుప్రీం కోర్టు ద్వారా సామాజిక న్యాయం జరగడం హర్షనీయమన్నారు. ఎస్‌సి వర్గీకరణ అంశంలో ఎన్ని అడ్డంకులు, అవరోధాలు ఎదురైనా విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

ఈ విజయం ఎంఆర్‌పిఎస్ ఉద్యమంలో అమరులకు, శ్రమ జీవులకు, మీడియాకు దక్కుతుందన్నారు. ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు హరిగోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వైకె విశ్వనాథ్, ఎంఇఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్లప్పగారి గంగాధర్, జాతీయ కార్యవర్గ సభ్యులు సాకె అమర్నాథ్, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కమిటీ చైర్మన్ బిసిఆర్ దాస్, మాదిగ మహిళ సమాఖ్య నాయకులు స్వతంత్ర కుమారి, కొమ్మూరి సునీత తదితరులు పాల్గొన్నారు.

తూత్తుకుడి ప్లాంట్‌కు సుప్రీం 'నో'

మొదటి పేజీ తరువాయి

శాశ్వతంగా మూసివేయాలని 2018లో తమిళనాడు ప్రభుత్వం, రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు తీసుకున్న నిర్ణయాలను 2020 ఆగస్టులో మద్రాసు హైకోర్టు ధ్రువీకరించింది. ఆ నిర్ణయాన్ని సుప్రీం కోర్టు ఫిబ్రవరిలో సమర్ధించింది. పరిశ్రమను మూసివేయాలన్నది ఎన్నడూ మొదటి ఎంపికగా వుండదని కోర్టు పేర్కొంది. అయితే దీర్ఘకాలంగా, పైగా పదే పదే తీవ్రమైన ఉల్లంఘనలకు వేదాంత పాల్పడినందున కంపెనీని మూసివేయాలని నిర్ణయించడం తప్ప హైకోర్టుకు మరో మార్గం లేకపోయిందని పేర్కొంది. మరే విధంగా చర్యలు తీసుకున్నా ప్రజల పట్ల అధికారులకు గల బాధ్యత, విధులను నిర్లక్ష్యం చేయడమే కాగలదని వ్యాఖ్యానించింది. ఈ ప్లాంట్ వల్ల ఆ ప్రాంతానికి ఆదాయం సమకూరిందని, పైగా ప్రజలకు ఉపాధి దొరికిందని, దేశానికి ఉత్పాదక ఆస్తులు ఒనగూడాయని ఈ వాస్తవాన్ని తాము గుర్తించామని కోర్టు పేర్కొంది. అయితే అదే సమయంలో సుస్థిర అభివృద్ధి, ప్రజా విశ్వాసం వంటి సూత్రాలను కూడా గమనంలోకి తీసుకోవాల్సి వుందని, చిట్టచివరగా కాలుష్య కారక సంస్థ మూల్యం చెల్లించక తప్పదని పేర్కొంది. ఆ ప్రాంత వాసుల ఆరోగ్యం, సంక్షేమం అన్నింటికంటే ముఖ్యంగా ఆందోళన కలిగించే అంశంగా వుందని పేర్కొంది. ప్రజల ఆందోళనలను పరిష్కరించే, వారి సంక్షేమాన్ని కాపాడే బాధ్యత అంతిమంగా ప్రభుత్వానిదేనని కోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది. ప్లాంట్‌ను తిరిగి ప్రారంభించడానికి రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ ప్లాంట్‌ను అమ్మేసుకుని, మరెక్కడైనా వెళ్ళిపోవడమే వేదాంతకు గల అవకాశమని చెప్పింది. దాదాపు 30ఏళ్ళ పాటు స్థానికులు నిరసనలు, ఆందోళనలు కొనసాగించిన ఫలితమే 2018లో ప్లాంట్ మూతపడింది. ప్రజా నిరసనలపై పోలీసు కాల్పులు కూడా జరిగాయి.

నిరసన కార్యక్రమాలు వాయిదా

- ఎపిపిటిడి ఎంప్లాయిస్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిపిటిడి (ఆర్‌టిసి) ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి ఈ నెల 19, 20 తేదీల్లో చేపట్టిన నిరసన కార్యక్రమాలను వాయిదా వేస్తున్నట్లు ఎపిఎస్‌ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ తెలిపింది. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని రవాణాశాఖ మంత్రి ఎం రాంప్రసాద్ రెడ్డి హామీ ఇచ్చినట్లు యూనియన్ అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు.. ఈ నేపథ్యంలో నిరసన కార్యక్రమాలను వాయిదా వేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

గ్రూప్ 1 అభ్యర్థుల డిమాండ్లపై తగిన చర్యలు

- షర్మిల డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రూప్ 1 అభ్యర్థుల డిమాండ్లను పరిగణలోకి తీసుకుని ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రభుత్వాన్ని కోరారు. గ్రూప్ 2 డిప్యూటీ ఈవో పోస్టుల ఎంపికలో అనుసరించిన 1:100 నిష్పత్తి విధానాన్నే గ్రూప్ 1లో కూడా అనుసరించాలని 'ఎక్స్'లో శనివారం పోస్ట్ చేశారు. 89 పోస్టులకు 1:50 నిష్పత్తి అనుసరిస్తే 4,450 మందికి అవకాశం లభించిందని, 1:100 నిష్పత్తి అనుసరిస్తే 8,900 మందికి అవకాశం దక్కుతుందని చెప్పారు. గ్రూప్-2, గ్రూప్-1 పరీక్షల మధ్య సమయం తక్కువగా ఉండటం, సిలబస్ మధ్య వ్యత్యాసం, కొత్త సిలబస్ అని చెప్పినప్పటికీ పాత సిలబస్‌లోనే పరీక్షలు నిర్వహించడం వంటి కారణాలతో నష్టపోయామని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

21 ప్రాపర్టీల వేలం : సెంట్రల్ బ్యాంక్

ప్రజాశక్తి - గుంటూరు

ప్రభుత్వ రంగంలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన రీజినల్ ఆఫీసు గుంటూరులో ప్రాపర్టీ ఎక్స్‌పోను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం రీజియన్స్‌కు చెందిన ఇక్కడి రీజినల్ ఆఫీసులో 21 ప్రాపర్టీలను వేలం కోసం ప్రదర్శనకు ఉంచినట్లు ఆ బ్యాంక్ శనివారం ఓ ప్రకటనలో వెల్లడించింది. ఇందులో కొన్ని ఆస్తులను కొనుగోలు చేయడానికి సందర్శకులు ఆసక్తి చూపారని తెలిపింది. ఈ ఎక్స్‌పోలో తమ బ్యాంక్ చీఫ్ మేనేజర్ బికె ప్రసాద్, ఇతర సిబ్బంది పాల్గొని విజయవంతం చేశారని సెంట్రల్ బ్యాంక్ పేర్కొంది.

పెన్షన్ హక్కు కోసం ఉద్యమించాలి

- మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

పెన్షనర్ల ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ శర్మ

పెన్షన్ తమ హక్కని పెన్షన్‌దారులంతా భావించి ఉద్యమించినప్పుడే ప్రభుత్వం దిగి వస్తుందని మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ అన్నారు. పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలంటూ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన రిటైర్డ్ ఉద్యోగులు శనివారం విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ముఖ్య అతిథిగా శర్మ హాజరై మాట్లాడుతూ ఎవరి దయాదాక్షిణ్యాల మీద పిఎఫ్ డబ్బులు ఇవ్వడం లేదని, ఉద్యోగులు దాచుకున్న డబ్బులే ఇస్తున్నారని తెలిపారు. ఆ డబ్బులను కూడా కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతూ పెన్షనర్లకు మొండి చెయ్యి చూపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ రంగాల్లో పనిచేసే ఉద్యోగులకు పిఎఫ్, మేనేజ్‌మెంట్ వాటా ఇవ్వాలని, ఇపిఎఫ్ తీసుకొచ్చి మేనేజ్‌మెంట్ వాటా ఎగ్గొట్టారని తెలిపారు. చంద్రబాబు నాయుడు మీద కోపంతో గతంలో జగన్‌ను, జగన్ మీద కోపంతో కొద్ది నెలల క్రితం చంద్రబాబును, పవన్‌ను గెలిపించారని.. వారందరికీ అదానీ, అంబానీలు తప్ప పెన్షనర్లు, ఉద్యోగులు, కార్మికులు కనిపించడంలేదని తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగులకు ఇచ్చే పెన్షన్ కూడా రానురాను రాజకీయ చర్చనీయాంశంగా మారుతోందన్నారు. కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలని, డిఎ అనుసంధానం చేయాలని, భార్యాభర్తలకు మెడికల్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కె.సుధాకర్ మాట్లాడుతూ కార్మికులందరూ వ్యతిరేకించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం 1995 నవంబర్ 16న ఇపిఎస్ పెన్షన్ స్కీమ్‌ను ప్రవేశపెట్టిందన్నారు. అది కార్మికులకు నష్టదాయకంగా ఉందని తెలిపారు. ఈ స్కీమ్‌లో చేరాలా? వద్దా? అన్న అంశంపై ఆప్షన్ ఇవ్వాలని కోరినా దానిని ప్రభుత్వం తిరస్కరించిందన్నారు. కార్మికులు కోర్టును ఆశ్రయించడంతో.. ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి రివ్యూ చేసి మెరుగులు దిద్దుతామని ప్రభుత్వాలు హామీ ఇచ్చాయని తెలిపారు. ఆ తరువాత అన్యాయమే జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.హుస్సేన్, నాయకులు యువిఎస్ఎన్.వర్మ, రామారావు, కె.దీనబంధు, ఆర్.బాబూరావు, ఎస్.అప్పారావు, విశాఖ, అనకాపల్లి జిల్లాల నుంచి పెన్షనర్లు, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు. ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి వారి పోరాటానికి మద్దతు తెలిపారు. పెన్షనర్ల బాధలు ప్రధాని మోడీకి పట్టటం లేదని విమర్శించారు.

హైదరాబాద్‌లో సినీ నటి కస్తూరి అరెస్టు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలుగు ప్రజలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సినీనటి కస్తూరిని ఎట్టకేలకు పోలీసులు అరెస్టు చేశారు. హైదరాబాద్ గచ్చిబౌలిలో చెన్నై పోలీసులు శనివారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నారు. హిందూ మక్కల్ కట్చి ఆధ్వర్యంలో చెన్నైలో ఇటీవల నిర్వహించిన ఆందోళనలో పాల్గొన్న ఆమె తెలుగువారిపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. దీనిపై పలు తెలుగు సంఘాలు, ప్రముఖులు ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. అక్కడి పోలీసుస్టేషన్లలో ఫిర్యాదులు చేశారు. చెన్నై ఎగ్మోర్‌లో ఉన్న తెలుగు సంస్థ ఫిర్యాదు మేరకు పోలీసులు ఆమెపై నాలుగు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో సమన్లు ఇవ్వడానికి పోలీసులు ఇటీవల పోయెస్ గార్డెన్‌లోని కస్తూరి ఇంటికి వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండటంతో ఆమెకు ఫోన్ చేశారు. స్విచాఫ్ రావడంతో పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. గాలించేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ గచ్చిబౌలిలో ఉన్నట్టు తెలుసుకున్న చెన్నై పోలీసులు శనివారం సాయంత్రం ఇక్కడికి వచ్చి అరెస్టు చేశారు. చెన్నై కోర్టులో ప్రవేశపెట్టనున్నట్టు పోలీసులు తెలిపారు.

చంద్రబాబు సోదరుడు కన్నుమూత

- నేడు నారావారిపల్లెలో రామ్మూర్తి నాయుడు అంత్యక్రియలు
- నివాళులర్పించిన చంద్రబాబు, బాలకృష్ణ, మాజీ సిజెఐ జస్టిస్ ఎన్‌వి రమణ

భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న చంద్రబాబు, బాలకృష్ణ, ఎన్‌వి రమణ తదితరులు, ఇన్‌సెట్లో రామ్మూర్తి నాయుడు (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో, రామచంద్రాపురం

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తమ్ముడు, మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తి నాయుడు (72) శనివారం కన్నుమూశారు. గత గురువారం రాత్రి గుండెపోటు రావడంతో గచ్చిబౌలి ఎఐజి ఆస్పత్రిలో కుటుంబ సభ్యులు చేర్పించారు. అత్యవసర చికిత్స అందించినా ఆరోగ్యం మెరుగుపడలేదు. ఇంట్రా ఎరోటిక్ బెలూన్ పంప్ సపోర్ట్‌తో కూడా ప్రయోజనం లేకపోయింది. ఆరోగ్యం విషమించి శనివారం మధ్యాహ్నం 12.45 గంటలకు తుది శ్వాస విడిచారు. రామ్మూర్తి నాయుడుకు భార్య ఇందిర, కుమారులు సినీ హీరో నారా రోహిత్, గిరీశ్ ఉన్నారు. తమ్ముడి మరణ వార్త తెలిసిన వెంటనే మహారాష్ట్ర పర్యటన రద్దు చేసుకుని ప్రత్యేక విమానంలో శనివారం సాయంత్రం చంద్రబాబు హైదరాబాద్ చేరుకున్నారు. బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా గచ్చిబౌలిలోని ఎఐజి ఆస్పత్రికి చేరుకున్నారు. మంత్రి లోకేష్, బాలకృష్ణ, మాజీ సిజెఐ ఎన్‌వి రమణలతో కలిసి తమ్ముడికి చంద్రబాబు నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆదివారం ఉదయం ప్రత్యేక విమానంలో రామ్మూర్తి నాయుడి భౌతికకాయాన్ని నారావారిపల్లెకు తరలించనున్నారు. స్వగ్రామంలోనే అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రామ్మూర్తి నాయుడు మృతిపై తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. 1994లో టిడిపి తరపున చంద్రగిరి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. నారా రామ్మూర్తినాయుడు అంత్యక్రియలకు రాజకీయ, సినీ ప్రముఖులు తరలిరానున్న నేపథ్యంలో నారావారిపల్లెలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

పోసానిపై ఫిర్యాదు చేస్తున్న టిడిపి, జనసేన నాయకులు

సినీ నటుడు 'పోసాని'పై మరో కేసు

ప్రజాశక్తి-మార్కాపురం (ప్రకాశం జిల్లా)

ప్రకాశం జిల్లా మార్కాపురం పట్టణ పోలీస్ స్టేషన్‌లో సినీ నటుడు పోసాని కృష్ణ మురళిపై శనివారం మరో కేసు నమోదైంది. తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బిఆర్ నాయుడుపై, టివి 5 ఛానల్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ మార్కాపురం పట్టణ పోలీసు స్టేషన్‌లో టిడిపి-జనసేన నేతలు ఫిర్యాదు చేశారు. ప్రశ్నించే గొంతుకలను నొక్కి టిటిడి చైర్మన్‌గా బిఆర్ నాయుడు పదవి దక్కించుకున్నారని పోసాని విమర్శించారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని టిడిపి-జనసేన నేతలు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్ఐ ఎం.సైదుబాబు కేసు నమోదు చేశారు.

కళాశాల యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న విద్యార్థిని బంధువులు, విద్యార్థిని అనూష మృతదేహం

హాస్టల్ భవనం పైనుండి దూకి ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పెన్ను విషయంలో స్నేహితురాళ్ల మధ్య ఏర్పడిన స్వల్ప వివాదం నేపథ్యంలో ఓ విద్యార్థిని హాస్టల్ భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పల్నాడు జిల్లా నరసరావుపేటలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బొల్లాపల్లి మండలం వెల్లటూరు గ్రామానికి చెందిన జెట్టి అనూష (16) భావన వికాస్ జూనియర్ కళాశాల హాస్టల్‌లో ఉంటూ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం హాస్టల్‌లో ఉన్న సమయంలో పెన్ను విషయంలో స్నేహితులతో వివాదం జరిగింది. స్నేహితులంతా అనూషను దూషించడంతో తీవ్ర మనస్తాపం చెందింది. దీంతో, హాస్టల్ 4వ అంతస్తు నుండి దూకేసింది. కళాశాల యాజమాన్యం అనూషను ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

సమాచారం తెలుసుకున్న అనూష తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు హాస్టల్ వద్దకు చేరుకొని విద్యార్థి మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు. కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే తమ కుమార్తె మృతి చెందిందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ న్యాయం చేయాలని కళాశాల ఎదుట బైఠాయించారు. కళాశాల యాజమాన్యం ద్వారా విషయం తెలుసుకున్న ఆర్‌డిఐఓ ఎం.మధులత, ఇంటర్ బోర్డు జిల్లా అధికారిణి ఎం.నీలావతిదేవి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కళాశాల యాజమాన్యం అనూష మృతికి న్యాయం చేస్తామని హామీతో ఆందోళన విరమించారు. మృతురాలి తండ్రి హనుమంతరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కదంతొక్కిన అంగన్‌వాడీలు

మొదటి పేజీ తరువాయి

అనంతపురం కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

కావని తెలిపారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటిడిఎల ఎదుట అంగన్‌వాడీలు ధర్నా చేశారు. రంపచోడవరంలో సిఐటియు జిల్లా కార్యాలయం నుంచి ఐటిడిఎ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించి అక్కడ బైఠాయించారు. మూడు గంటలకుపైగా ధర్నా చేపట్టినా పిఒ స్పందించకపోవడంతో ఐటిడిఎ కార్యాలయం లోపలకు వెళ్లేందుకు అంగన్‌వాడీలు ప్రయత్నించారు. వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం బయటకు వచ్చి అంగన్‌వాడీల నుంచి వినతిపత్రం స్వీకరించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.బేబీరాణి మాట్లాడుతూ మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో వర్కరు పని, హెల్పరు పని ఒక్కరే చేయాల్సి వస్తోందని, దీంతో పని భారం అధికంగా ఉంటోందని తెలిపారు. చంద్రబాబు ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకపోగా అధిక పనిభారం మోపుతోందన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి కలెక్టరేట్‌కు వస్తున్న అంగన్‌వాడీలను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఆటోలు, బస్సుల్లో వస్తున్న వారిని మామిళ్లకుంట క్రాస్, కర్ణాటక నాగేపల్లి వద్ద ఎక్కడికక్కడే దించేశారు. పోలీసుల అడ్డంకులను ఎదుర్కొని అంగన్‌వాడీలు కలెక్టరేట్‌కు చేరుకొని ధర్నా చేశారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా అంగన్‌వాడీలు తిరుపతి, చిత్తూరు కలెక్టరేట్లకు తరలివచ్చారు. అనంతపురం, రాయచోటి, అమలాపురం, రాజమహేంద్రవరం, కాకినాడ, ఏలూరు, భీమవరం, నరసరావుపేట, నంద్యాల, మచిలీపట్నం, పార్వతీపురం, శ్రీకాకుళం , నెల్లూరు కలెక్టరేట్ల వద్ద ధర్నా చేశారు. అనకాపల్లిలో ర్యాలీ, ధర్నా నిర్వహించారు. కర్నూలులో ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

అప్రెంటీస్ పేరుతో రూ.లక్ష కోట్ల ధారాదత్తం

- నిరుద్యోగాన్ని కప్పిపుచ్చుకునేందుకు మోడీ మరో మోసం
- విజయనగరం జిల్లా సిపిఎం మహాసభ సందర్భంగా బహిరంగ సభలో వై వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

అధికారంలోకి రాగానే ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామంటూ పదిన్నరేళ్ల క్రితం ప్రధాని మోడీ ఇచ్చిన హామీని కప్పిపుచ్చుకోవడానికి అప్రెంటీస్ విధానం పేరిట మరో కొత్త నాటకం ఆడుతున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు అన్నారు. ఈ పేరుతో కార్పొరేట్ శక్తులకు రూ.లక్షల కోట్లను ధారాదత్తం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. సిపిఎం విజయనగరం జిల్లా మహాసభ శనివారం ఉత్సాహ పూరితంగా ప్రారంభమైంది. తొలుత విజయనగరంలోని ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచి నుంచి గంటస్తంభం మీదుగా ప్రదర్శన సాగింది. అనంతరం కోట వద్ద జరిగిన బహిరంగ సభలో వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధి అవకాశాల దొరక్క జనం అల్లాడిపోతుంటే, మానవ రహితంగా నడిచే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ని కేంద్రం ప్రోత్సహిస్తోందన్నారు. దీనివల్ల నిరుద్యోగం మరింతగా పెరుగుతుందని వివరించారు. ఉద్యోగ కల్పనపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఉత్పత్తి రంగ పరిశ్రమలు, విశాఖ స్టీల్‌ప్లాంట్ సహా ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసే కుట్రను ఆపాలని డిమాండ్ చేశారు. అప్రెంటీస్ విధానం పట్ల సిఎం చంద్రబాబు వైఖరి ప్రకటించాలని కోరారు. కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్ అజెండాతో రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తోందని విమర్శించారు. అందులో భాగంగానే ఒకే దేశం, ఒకే ఎన్నిక పేరిట జమిలీ ఎన్నికలను తెరమీదికి తెచ్చిందన్నారు. దేశ సంపదను, వనరులను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టాలని కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. నిత్యావసర సరకుల ధరలు, ఇతర భారాలు తగ్గించాల్సిన చంద్రబాబు... జిఎస్‌టి పెంపునకు అనుమతి కోరుతూ కేంద్ర ప్రభుత్వం వద్ద మోకరిల్లడం సిగ్గుచేటన్నారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల జోలికి మోడీ ప్రభుత్వం వస్తే సంగతి తేలుస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో ఉన్నది మా మంచి ప్రభుత్వం కాదని, మందు ప్రభుత్వమని ఎద్దేవా చేశారు. ప్రజలకు కావాల్సింది లిక్కర్ కాదని, తాగడానికి నీరు, రోడ్లు, మౌలిక వసతులు, స్కీమ్ వర్కర్లకు భద్రత, మహిళలకు రక్షణ, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు అని వివరించారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి మోడీకి భజన చేస్తున్నారన్నారు. విద్యుత్తు సంస్కరణల పేరుతో ప్రజలపై భారాలు వేస్తే వైఎస్ జగన్‌కి పట్టిన గతే టిడిపి కూటమి ప్రభుత్వానికీ పడుతుందని హెచ్చరించారు. ప్రభుత్వ భూముల జోలికొస్తే అరెస్టు చేస్తామని, జైల్లో పెడతామని, ఇందుకోసం కొత్త చట్టం తెస్తామని చెప్తున్న చంద్రబాబు... ముందు ప్రభుత్వ భూములు కబ్జా చేసిన వైసిపి, టిడిపి నాయకులను జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. పేదల జోలికి వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు మానుకోవాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.సూర్యారావు తదితరులు ప్రసంగించారు. అనంతరం శృంగవరపుకోట రోడ్డులోని వెంకట్ సత్య కల్యాణ మండపంలో ప్రతినిధుల సభ ప్రారంభమైంది. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టివి రమణ, జిల్లా కమిటీ సభ్యులు గాడు అప్పారావు, పి.రమణమ్మ అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. సిపిఎం జెండాను పార్టీ కార్యాలయ కార్యదర్శి సీపాన కృష్ణారావు ఆవిష్కరించారు. ప్రతినిధుల సభ జరుగుతున్న స్థలికి కీర్తిశేషులు సీతారాం ఏచూరి నగర్‌గా, బుద్ధదేవ్ బట్టాచార్య, రుద్రరాజు సత్యనారాయణ రాజు ప్రాంగణాలుగా నామకరణ చేశారు.

విజయనగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం శ్రేణులు, (ఇన్‌సెట్‌లో) బహిరంగ సభలో మాట్లాడుతున్న వై.వెంకటేశ్వరరావు

32 మంది విద్యార్థులకు అస్వస్థత

- ఆలస్యంగా వెలుగులోకి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

తిరుపతి నగరం బైరాగిపట్టెడ సమీపంలోని గిరిజన బాలికల గురుకుల వసతి సముదాయంలో కలుషిత ఆహారం తిని 32 మంది విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం రాత్రి జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అస్వస్థతకు గురైన 32 మంది విద్యార్థినుల్లో కొందరు వాంతులు, విరోచనాలు, కడుపునొప్పితో బాధపడ్డారు. 17 మందిని రుయా ఆస్పత్రికి తరలించారు. 15 మందికి వసతి గృహంలోనే చికిత్స అందించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ పరామర్శించారు. విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. శనివారం మధ్యాహ్నానికి విద్యార్థులు కోలుకోవడంతో వారిని డిశ్చార్జి చేశారు. ప్రస్తుతం అందరి ఆరోగ్యం స్థిరంగానే ఉన్నట్లు వైద్యులు ధ్రువీకరించారు. శుక్రవారం మధ్యాహ్నం వండిన మెంతిపప్పు కూర తిరిగి రాత్రి వడ్డించడం వల్ల ఫుడ్ పాయిజన్ అయ్యిందని అధికారులు భావిస్తున్నారు. తాగునీరు, ఆహార శ్యాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు తరలించారు.

విద్యార్థిసంఘాల పరామర్శ

చికిత్స పొందుతున్న విద్యార్థినులను విద్యార్థి సంఘాల నాయకులు పరామర్శించారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, రవి, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి చలపతి, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి జె.మల్లికార్జున, బిసి విద్యార్థి సంఘం నాయకులు నారాయణ గౌడ్, టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షులు కొట్టె హేమంత్ రాయల్ తదితరులు పరామర్శించారు. జిల్లావ్యాప్తంగా వరుస ఘటనలు చోటు చేసుకుంటున్నా అధికార యంత్రాంగం మొద్దు నిద్రలో ఉందని విమర్శించారు.

కడప ఎంపి పిఎపై సెర్చ్ వారెంట్

- మరికొంత మందికి 41(ఎ) నోటీసులు

రాఘవరెడ్డి (ఫైల్)

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

కడప జిల్లా పులివెందుల నియోజకవర్గంలోని సామాజిక మాధ్యమాలలో అసభ్యకర పోస్టుల కేసుపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్.అవినాష్‌రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి (పిఎ) బండి రాఘవరెడ్డిపై పోలీసులు సెర్చ్ వారెంట్ జారీ చేశారు. శుక్రవారం అర్ధరాత్రి లింగాల మండలం అంబకపల్లిలోని ఆయన ఇంటికి నోటీసులు అతికించారు. మరికొంత మందికి 41 (ఎ) నోటీసులు జారీ చేశారు. 16వ తేదీ పది గంటలకు పోలీసుస్టేషన్‌లో హాజరు కావాలని పులివెందులకు చెందిన వైసిపి సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ వివేకానందరెడ్డికి 41 (ఎ) నోటీసులను ఆయన ఇంటికి అతికిం చారు. వైసిపి సామాజిక మాధ్యమాల కార్యకర్త వర్రా రవీందర్‌రెడ్డికి రాఘవరెడ్డి కంటెంట్ అందించే వారని రిమాండ్ రిపోర్టులో వర్రా పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ కేసుల విషయంలో పులివెందుల డిఎస్‌పి మురళి నాయక్ పలువురికి నోటీసులు జారీ చేశారు.

వారం రోజులు గడువు ఇవ్వండి : శ్వేత

పని నిమిత్తం తన భర్త బయటికి వెళ్లారని, మొబైల్ ఫోన్ అందుబాటులో లేదని, వారం రోజులు గడువు ఇస్తే తానే స్వయంగా హాజరు పరుస్తానని డిఎస్‌పికి వివేకానంద రెడ్డి భార్య శ్వేత లేఖ రాశారు. ఈ కేసుకు సంబంధించి 41 (ఎ) నోటీసులు ఎవరెవరికి ఇస్తున్నారో వారి వివరాలను తెలపాల్సిందిగా డిఎస్‌పిని వైసిపి అడ్వకేట్ ఓబుల్‌రెడ్డి కోరారు. వారి వివరాలను అందజేస్తే పది రోజుల్లో డిఎస్‌పి ఎదుట హాజరు పరుస్తామని అడ్వకేట్ తెలిపారు.

స్టీల్‌ప్లాంట్‌ను ఆదుకోండి

- ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం): వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను అన్ని విధాలా కేంద్రంలోని మోడీ సర్కారు ఆదుకోవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, ఆర్థిక సహకారం అందించాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారానికి 1374వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ డిఎస్‌ఇయు, టిఎన్‌టియుసి కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ నాయకులు విళ్లా రామ్మోహన్ కుమార్ మాట్లాడుతూ.. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం సకాలంలో కార్మికులకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులను తొలగించేందుకు చేస్తోన్న కుట్రలను విరమించుకోవాలన్నారు.

కాలువలో పడి ఇద్దరు చిన్నారులు మృతి

ప్రజాశక్తి - చిల్లకూరు

కాలువలో పడి ఇద్దరు చిన్నారులు మృతి చెందిన ఘటన తిరుపతి జిల్లా చిల్లకూరు మండల పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఏరూరు గ్రామం అల్లిపురం గిరిజన కాలనీకి చెందిన దంపతులకు కుమారుడు చింతాలయ్య (10), కుమార్తె నాగేంద్రమ్మ(11) ఉన్నారు. బట్టలు ఉతికేందుకు సౌన కాల్వ వద్దకు వెళ్తున్న తల్లిదండ్రుల వెంట చిన్నారులు వెళ్లారు. కాలువ ఒడ్డున ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు ఇద్దరు చిన్నారులు కాలువలో పడిపోయారు.

గమనించిన తల్లిదండ్రులు వారిని ఒడ్డుకు చేర్చేలోపే మరణించారు. కాలువలో పడి ఊపిరాడక చిన్నారులు మరణించినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

18న మహాధర్నా వాయిదా

- సమస్యలపై సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 18వ తేదీన నిర్వహించాలనుకున్న మహాధర్నాను వాయిదా వేస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ రాష్ట్రకమిటీ వెల్లడించింది. మహాధర్నా నేపథ్యంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తమను చర్చలకు ఆహ్వానించారని ఎస్ఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు కె ప్రసన్నకుమార్, ఎ అశోక్, శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనివార్య కారణాల వల్ల మంత్రి అందుబాటులో లేరని, మంత్రి ఓఎస్‌డి ఆకుల వెంకట రమణ చర్చలు జరిపారని వెల్లడించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న 10 రకాల అంశాలను తాము వివరించామని, ఈ అంశాలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించారని వెల్లడించారు. 2018-19 విద్యాసంవత్సరం బకాయిలు చెల్లించేందుకు, ఫీజుల పెండింగ్ బకాయిలు చెల్లించేందుకు గడువు కోరారని తెలిపారు. విద్యార్థులపై ఒత్తిడి లేకుండా కళాశాల యాజమాన్యాలకు ఫీజులు వసూలు చేయొద్దని ఉత్తర్వులు జారీ చేసేందుకు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. జివో 77 రద్దు చేసి వచ్చే విద్యాసంవత్సరం నుంచి పిజి విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ చెల్లిస్తామని వెల్లడించారు. జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం, హాస్టళ్లకు మెస్ చార్జీల పెంపుపై సానుకూలంగా స్పందించారని తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి అకడమిక్ క్యాలెండర్ విడుదల చేస్తామని, హానర్స్ డిగ్రీ విధానంపై సమీక్ష నిర్వహించి అందరీ అభిప్రాయాలతో నిర్ణయం తీసుకుంటామని చెప్పారని పేర్కొన్నారు. ఈ అంశాలపై త్వరలో విద్యాశాఖ మంత్రి తమతో మాట్లాడతారని చెప్పినట్లు తెలిపారు. తాము విన్నవించిన అంశాలపై నెల రోజుల్లో స్పష్టత రాకపోతే పోరాటాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ స్పందనతో ఈ నెల 18న చేపట్టిన మహాధర్నాను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ చర్చల్లో ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షులు సిహెచ్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వేలేరుపాడు పిఎస్‌లో బోరుగడ్డ అనిల్ విచారణ

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్ (ఏలూరు జిల్లా)

సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌లపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆరోపణలపై బోరుగడ్డ అనిల్‌ను ఏలూరు జిల్లా వేలేరుపాడు పోలీసులు శుక్రవారం రాత్రి కస్టడీలోకి తీసుకుని విచారించారు. రెండు నెలల క్రితం టిడిపి కార్యకర్త ఉద్దగిరి రాణి ఫిర్యాదు మేరకు వేలేరుపాడులో అనిల్‌పై కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే అరెస్టయిన అనిల్‌ను కోర్టు అనుమతితో రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి వేలేరుపాడు తరలించారు. శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ పోలవరం డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావు, పోలవరం సిఐ వెంకటేశ్వరరావు, కుక్కునూరు సిఐ రమేష్‌బాబు అనిల్‌ను విచారించారు. ఈ సమయంలో పోలీసు స్టేషన్ వద్దకు మీడియాను అనుమతించలేదు. అనిల్‌ను వేలేరుపాడు స్టేషన్‌కు తీసుకొచ్చారని తెలిసిన టిడిపి, జనసేన నేతలు అక్కడకు చేరుకుని అనిల్‌ను కఠినంగా శిక్షించాలని, అనిల్‌ను తమకు అప్పగించాలని నినదిస్తూ స్టేషన్ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. డిఎస్‌పి వెంకటేశ్వరరావు వారికి సర్ధిచెప్పి పంపించేశారు. అనంతరం నాయకులు అనిల్ ఫొటోను దగ్ధం చేసి నిరసన తెలిపారు. జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆస్పత్రిలో అనిల్‌కు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం కోర్టులో హాజరుపర్చారు. న్యాయమూర్తి రిమాండ్ విధించడంతో రాజమండ్రికి తరలించారు.

అయ్యో.. అన్నమయ్యా..!

- నాలుగేళ్లుగా డిజైన్ల దశలోనే
- ఎనిమిది లక్షల క్యూసెక్కుల డిశ్చార్జిపై విస్మయం
- త్వరలో ప్రభుత్వానికి నివేదిక !

కొట్టుకుపోయిన అన్నమయ్య రిజర్వాయర్ (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

అన్నమయ్య రిజర్వాయర్ పునరుద్ధరణకు మోక్షమెప్పుడో తెలియడం లేదు. 2021 నుంచి సర్వేలు, డిజైన్ల రూపకల్పన, డిజైన్ల మార్పు టెండర్ల నిర్వహణ, సార్వత్రిక ఎన్నికల ముంగిట కాంట్రాక్టర్ చేతులెత్తేయడం వంటి ఘటనలతో కాలయాపన అవుతూ వచ్చింది. ఏడాది కిందట ఏడుగురు ఐఐటి నిపుణులు, ముగ్గురు ప్రొఫెసర్లు, ఢిల్లీ సిడబ్ల్యుసి హైడ్రాలజీ నిపుణులు వేర్వేరుగా రిజర్వాయర్‌ను పరిశీలించారు. 500 ఏళ్ల ప్రవాహాన్ని పరిగణలోకి తీసుకుని 12 మీటర్ల ఎత్తు, ఎనిమిది లక్షల క్యూసెక్కుల డిశ్చార్జి డిజైన్‌కు అంగీకరించారు. ఈ విధంగా రిజర్వాయర్ నిర్మిస్తే వ్యయం రెట్టింపు కావడంతోపాటు రాజంపేట, నందలూరు ప్రాంతాలు ముంపునకు గురయ్యే అవకాశాలు ఉన్నాయనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రెండు, మూడు రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నారు

2021 నవంబర్ నుంచి 2024 ఫిబ్రవరి వరకు ప్రభుత్వ, ప్రయివేటు సర్వే సంస్థలు పునరుద్ధరణ డిజైన్లకు రూపకల్పన చేశాయి. 2023 డిసెంబర్‌లో 2.5 టిఎంసిల సామర్థ్యం, పది గేట్లు, ఐదు లక్షల క్యూసెక్కుల డిశ్చార్జితో కూడిన డిజైన్ నిర్మాణానికి మొగ్గు చూపాయి. ప్రభుత్వ ఆమోదం లభించింది. రూ.787.77 కోట్లతో జిఓఆర్‌టి నెంబర్ 2076 విడుదల చేసింది. ఫిబ్రవరిలో జలవనరుల శాఖ టెండర్లు పిలిచింది. తెలంగాణకు చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్ కాంట్రాక్టును దక్కించుకుంది. సార్వత్రిక ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయి. రాష్ట్రంలో టిడిపి కూటమి అధికారంలోకి రావడంతో డిజైన్ వ్యవహారం మొదటికి వచ్చింది. తెలంగాణలోని మేడిగడ్డ బ్యారేజీ తరహా ప్రమాదం పొంచి ఉందనే భయంతో కాంక్రీట్ డ్యామ్ నిర్మాణ డిజైన్ కాదని, మరో డిజైన్‌కు జలవనరులశాఖ మొగ్గు చూపింది. కేంద్ర ప్రభుత్వ సంస్థలైన ఢిల్లీ, మహారాష్ట్రలోని సిఇసిడిసి, సిడబ్ల్యుడి పిఆర్ఎస్ నిపుణుల సహకారాన్ని తీసుకుంది. 2.5 టిఎంసిల నిల్వ సామర్థ్యం, 12 మీటర్ల ఎత్తు, 14 నుంచి 19 గేట్లు, 8.23 లక్షల క్యూసెక్కుల డిశ్చార్జి పరిమాణంతో డిజైన్‌కు కేంద్రంలోని సిడబ్ల్యుసి ఆమోదించింది. హైడ్రాలజీ విభాగంలోని పది మంది ఇంజనీరింగ్ నిపుణుల్లో ఐదుగురికిపైగా సంతకాలు చేసినట్లు తెలుస్తోంది. 12 మీటర్ల ఎత్తు, ఎనిమిది లక్షల క్యూసెక్కుల డిశ్చార్జితో రిజర్వాయర్‌ను నిర్మిస్తే బహుదా బేసిన్ పరిధిలోని 24 వేల ఎకరాల ఆయకట్టు ప్రాంతం సహా రాజంపేట, నందలూరు ప్రాంతాలకు ముంపు ప్రమాదం ఉందనే వాదన వినిపిస్తోంది. బహుదాకు ఇరువైపులా 20 కి.మీ ప్రొటెక్షన్ వాల్స్ నిర్మించాల్సి పరిస్థితి ఏర్పడనుంది.

కడప జిల్లాలోని ఐదు నదీ పరీవాహక బేసిన్లు ఉన్నాయి. బాహుదా బేసిన్ చిన్నది. దీనిపై అన్నమయ్య రిజర్వాయర్ నిర్మితమైంది. మొదటి డిజైన్ ప్రకారం ఐదు లక్షల క్యూసెక్కుల లెక్కన డిశ్చార్జి చేస్తే మిగిలిన నాలుగు పెద్దవైన పెన్నా బేసిన్ నుంచి సుమారు 10 లక్షలు, పాపాఘ్ని 10 లక్షలు, చిత్రావతి ఎనిమిది లక్షలు, కుందూ నాలుగు క్యూసెక్కుల అంచనా లెక్కన 32 లక్షల క్యూసెక్కులను విడుదల చేయాల్సి వస్తే సరిహద్దులోని చివరి సోమశిల పరిస్థితేమిటనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. సోమశిల ఏడు లక్షల క్యూసెక్కులకు మించి డిశ్చార్జి సామర్థ్యాన్ని తట్టుకునే అవకాశాలు లేవనేది ఇంజనీరింగ్ నిపుణుల అంచనా. కాంక్రీట్ డిజైన్ కాదని రెండవ డిజైన్ నిర్మాణానికి రెట్టింపు నిధులు కేటాయించాల్సి ఉందనే వాదన వినిపిస్తోంది. నిర్మాణ వ్యయం పెరుగుదల, ముంపు, సోమశిల పరిస్థితిపై ఎస్ఇని సంప్రదించగా జవాద్ తుపాన్‌లోని ఎనిమిది లక్షల క్యూసెక్కుల డిశ్చార్జిని దృష్టిలో ఉంచుకుని నిపుణులు డిజైన్ చేశారని పేర్కొనడం గమనార్హం.

దిగొస్తున్న అపరంజి

- ఈ నెలలో 6 శాతం తగ్గిన బంగారం ధర

న్యూఢిల్లీ : గడిచిన పండగ సీజన్‌లో సామాన్యుడు కొనలేని స్థాయికి ఎగిసిన బంగారం ధరలు క్రమంగా దిగివస్తోన్నాయి. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ గెలుపొందిన తర్వాత డాలర్‌కు డిమాండ్ పెరగడంతో పాటు అంతర్జాతీయంగా యుద్ధాలకు దూరంగా ఉంటామని ట్రంప్ ప్రకటించడంతో అపరంజీ ధర తగ్గుతోంది. మరోవైపు హెచ్చు ధరల నేపథ్యంలో దేశీయంగా పసిడికి డిమాండ్ పడిపోవడం కూడా ధరల తగ్గుదలకు ఓ ప్రధాన కారణం. ఈ క్రమంలోనే దీపావళి తర్వాత బంగారం ధరల్లో దాదాపు 6 శాతం తగ్గుదల చోటు చేసుకుంది. 2024 నవంబర్ 1న 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల పసిడి ధర రికార్డ్ స్థాయిలో రూ.80,710గా పలకగా.. క్రమంగా నవంబర్ 16 నాటికి ఈ ధర రూ.75,800కు దిగివచ్చింది.

బంగారం ధరల్లో తగ్గుదల కొనుగోళ్ల డిమాండ్‌ను పెంచొచ్చని మల్హోత్రా జ్యువెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ ధృవ్ మల్హోత్రా అన్నారు. ఈ నెలలో ఇప్పటి వరకు దాదాపు రూ.5000 మేర బంగారం ధర తగ్గింది. ఈ ఏడాది చివరి వరకూ బంగారం ధరల్లో తగ్గుదల కొనసాగవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు చేపట్టిన తర్వాత.. విధాన నిర్ణయాలు ప్రకటించే వరకు పసిడి ధరల్లో క్షీణత ఉండొచ్చని అంటున్నారు. జనవరిలో ట్రంప్ అధికారం చేపట్టనున్నారు. ఇటీవల ట్రంప్ ఎన్నిక తర్వాత డాలర్‌కు డిమాండ్ పెరుగుతోంది. మరోవైపు పెట్టుబడులన్నీ స్టాక్స్, బాండ్ల మార్కెట్ వైపు వెళ్తున్నాయి. దీంతో బంగారానికి డిమాండ్ తగ్గడంతో ఆ లోహం ధర దిగివస్తోంది.

క్రిప్టో కరెన్సీలకు అమెరికా మద్దతు ఉండబోతోందన్న అంచనాలతో బిట్ కాయిన్, ఇతర క్రిప్టోలకు డిమాండ్ పెరుగుతోంది. బిట్ కాయిన్ ఆల్‌టైం గరిష్ఠం 90వేల డాలర్లకు చేరింది. అదే విధంగా గ్లోబల్ స్టాక్ మార్కెట్లలో రిస్కు పెరుగుతున్నప్పటికీ ఈక్విటీల్లో పెట్టుబడులకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపుతున్నారు. గత కొద్ది రోజులుగా భారత ఈక్విటీ మార్కెట్ల నుంచి అమెరికా, చైనాలకు తరలిపోవడమే ఇందుకు నిదర్శనం. యూరప్‌తోపాటు పశ్చిమాసియా దేశాల్లో ఉద్రిక్తతలు తగ్గుముఖం పడుతాయన్న అంచనాలు కూడా పసిడి ధరల తగ్గుదల ప్రధాన కారణం.

మిల్లెట్స్ ఉత్పత్తుల్లోకి రామోజీ గ్రూప్

- సబల బ్రాండ్‌తో మార్కెట్లోకి

ప్రజాశక్తి - హైదరాబాద్

రామోజీ గ్రూపు కొత్తగా మిల్లెట్స్ (తృణధాన్యాల) ఉత్పత్తుల వ్యాపారంలోకి ప్రవేశించింది. రామోజీ గ్రూపు సంస్థల వ్యవస్థాపకులు రామోజీరావు 88వ జయంతి సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో 'సబల మిల్లెట్స్' కొత్త బ్రాండ్‌ను ఆ గ్రూప్ ఎండి కిరణ్ రావు ఆవిష్కరించారు. మార్గదర్శి చిట్ ఫండ్స్ ఎండి శైలజా కిరణ్ ప్రచార ఫిల్మ్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సబల మిల్లెట్స్ డైరెక్టర్ సహరి చెరుకూరి మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుతం తాము తొలి దశలో 45 ఉత్పత్తులను అందుబాటులోకి తెచ్చామన్నారు. ఇందులో వివిధ రాష్ట్రాలలో వినియోగించే కిచిడీ, మిల్లెట్ కుకీలు, హెల్త్ బార్స్, మంచ్, నూడుల్స్ ఉన్నాయన్నారు. వీటి ధరలు రూ.55 నుంచి ప్రారంభమవుతాయన్నారు. వచ్చే మూడు మాసాల్లో మరో 55 ఉత్పత్తులను విడుదల చేయనున్నామని తెలిపారు. తొలుత వీటిని తమ సబల వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తెస్తున్నామని చెప్పారు. త్వరలోనే ఇతర ఇ-కామర్స్ వేదికల్లో విక్రయానికి ఉంచుతామన్నారు. భవిష్యత్తులో ఆఫ్‌లైన్‌లోనూ అందుబాటులోకి తేనున్నామన్నారు. ఆరోగ్యకరమైన జీవనానికి తమ తృణ ధాన్యాల ఉత్పత్తులు దోహదం చేస్తాయని తెలిపారు.

వచ్చే వారమూ మార్కెట్లలో అనిశ్చితే..!

- కొనసాగనున్న ఎఫ్ఐఐ విక్రయాలు

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లలో వచ్చే వారమూ అనిశ్చిత్తి కొనసాగవచ్చని అంచనా. గడిచిన 20 సెషన్లలో సెన్సెక్స్, నిఫ్టీలు 10 శాతం నష్టపోయాయి. విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్‌పిఐ) తమ పెట్టుబడులను భారీగా తరలించుకుపోయారు. ఇదే పరిస్థితి నవంబర్ 18తో ప్రారంభమయ్యే వారంలోనూ కొనసాగవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. రిటైల్ ఇన్వెస్టర్లు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నవంబర్ 20న మార్కెట్లకు సెలవు. మిగితా నాలుగు రోజులు ట్రేడింగ్ కొనసాగనుంది. ఎన్ఎస్‌డిఎల్ గణంకాల ప్రకారం.. నవంబర్ ప్రథమార్ధంలో రూ.22,420 కోట్ల విలువ చేసే ఎఫ్‌పిఐలు వెనక్కి వెళ్లిపోయాయి.

ఉజ్జీవన్ ఎస్ఎంబిలో విజిలెన్స్ వారోత్సవాలు

హైదరాబాద్ : ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ తన ఉద్యోగులను అప్రమత్తంగా ఉంచడానికి, నైతిక బ్యాంకింగ్ పద్ధతును పెంపొందించడానికి విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్‌ను నిర్వహించినట్లు తెలిపింది. నవంబర్ 11 నుంచి 16 వరకు ఈ క్యాంపెయిన్ చేపట్టినట్లు పేర్కొంది. మోసాలను నిరోధించడానికి, ఖాతాదారుల్లో నమ్మకాన్ని పెంపొందించడానికి అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు వెల్లడించింది.

ఐస్‌మేక్‌కు రూ.103 కోట్ల రెవెన్యూ

హైదరాబాద్ : రిఫ్రిజిరేషన్ పరికరాలు, శీతలీకరణ పరిష్కారాలను అందించే ఐస్‌మేక్ రిఫ్రిజిరేషన్ లిమిటెడ్ 2024-25 సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో రూ.103.38 కోట్ల రెవెన్యూ సాధించినట్లు ప్రకటించింది. గతేడాది ఇదే త్రైమాసికంలోని రూ.76.89 కోట్ల రెవెన్యూతో పోల్చితే 33.87 శాతం పెరిగిందని పేర్కొంది. గడిచిన క్యూ2లో కంపెనీ నికర లాభాలు 4.63 శాతం పెరిగి రూ.4.79 కోట్లకు చేరినట్లు తెలిపింది. రిఫ్రిజరేషన్ పరిశ్రమ మార్కెట్ సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ తమ కంపెనీ మెరుగైన ఫలితాలను నమోదు చేసిందని ఐస్ మేక్ రిఫ్రిజరేషన్ సిఎండి చంద్రకాంత్ పటేల్ పేర్కొన్నారు.

జొమాటో నుంచి కొత్త 'డిస్ట్రిక్ట్' యాప్

- పలు టికెటింగ్ బుకింగ్స్ కోసం

న్యూఢిల్లీ : ప్రముఖ ఫుడ్ డెలివరీ సంస్థ జొమాటో కొత్తగా సినిమా టికెట్ బుకింగ్, స్పోర్ట్స్ టికెటింగ్‌తో పాటు పలు రకాల సేవలు అందించడానికి కొత్త యాప్‌ను రూపొందించింది. ఇందుకోసం శనివారం 'డిస్ట్రిక్ట్' యాప్‌ను ఆవిష్కరించింది. దీని ద్వారా సినిమా టికెట్లు బుకింగ్, స్పోర్ట్స్ టికెటింగ్, లైవ్ షోలు, షాపింగ్, డైనింగ్ సేవల బుకింగ్స్‌ను అందించనున్నట్లు వెల్లడించింది. పేటియం నుంచి టికెటింగ్ బిజినెస్‌ను రూ.2,048 కోట్లకు జొమాటో కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కొత్త యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది.

ఉపాధి కూలీలకు అండగా ప్రభుత్వం

- గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధి హామీ పథకం బిల్లులు చెల్లిస్తూ కూలీలకు కూటమి ప్రభుత్వం ఉండగా ఉంటోందని గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి అన్నారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2014-19లో ఉపాధి హామీ పథకం కింద చేసిన పనులకు కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించడం హర్షనీయమన్నారు. గతంలో టిడిపి ప్రభుత్వం ఈ పథకం ద్వారా అనేక అభివృద్ధి పనులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందిందని తెలిపారు. వైసిపి హయాంలో 350 అడ్డగోలు జిఓలు తెచ్చి పనులు చేసే వారి నోట్లో మట్టికొట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో ఐదేళ్లల్లో 50మంది ఆత్మహత్యకు పాల్పడ్డారని తెలిపారు. ఈ పథకం నిధులను సెంటు పట్టా పేరుతో వైసిపి మంత్రులు, ఎంపిలు దోచుకు తిన్నారని విమర్శించారు.

గ్రీవెన్స్ నిర్వహించిన ఎపిసివోజిఎఫ్ఎల్ చైర్మన్ బాబ్జీ

ఎపి ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ కోపరేటివ్ ఫెడరేషన్ (ఎపిసివోజిఎఫ్ఎల్) చైర్మన్ గండి బాబ్జీ టిడిపి కార్యాలయంలో శనివారం గ్రీవెన్స్ నిర్వహించారు. టిడిపి బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ బుచ్చి రాంప్రసాద్‌తో కలిసి ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు.

టిడిపి కార్యాలయంలో రామ్మూర్తికి నివాళి

సిఎం చంద్రబాబునాయుడు సోదరుడు, మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు సంతాప కార్యక్రమం టిడిపి కార్యాలయంలో శనివారం జరిగింది. ఆయన చిత్రపటానికి టిడిపి రాష్ట్ర పల్లా శ్రీనివాసరావు, పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పీలా గోవింద్ సత్యనారాయణ, గురుమూర్తి, ఆగ్రానికి ప్రొడక్ట్స్ సర్టిఫికెట్ అథారిటీ చైర్మన్ శ్యావల దేవదత్, హ్యాండ్‌లూమ్ కోఆపరేటివ్ చైర్‌పర్సన్ సజ్జా హేమలత తదితరులు పాల్గొన్నారు.

కార్తీక స్నానానికి వెళ్లి భార్య మృతి

- భర్త గల్లంతు

ప్రజాశక్తి - రెంటచింతల (పల్నాడు జిల్లా)

మృతురాలు పద్మావతి (ఫైల్)

గల్లంతైన సత్యనారాయణ

పల్నాడు జిల్లా రెంటచింతల మండలంలో కార్తీక మాసం స్నానానికి వెళ్లిన దంపతులు కృష్ణా నదిలో మునిగిపోయారు. వీరిలో భార్య మృతి చెందగా.. భర్త గల్లంతయ్యారు. ఈ సంఘటన సత్రశాలలో శనివారం చోటుచేసుకుంది. రెంటచింతల ఎస్ఐ సిహెచ్ నాగార్జున తెలిపిన వివరాల ప్రకారం.. తుమ్మకోటకు చెందిన నీలా సత్యనారాయణ, పద్మావతి (56) దంపతులు 11 ఏళ్ల క్రితం రెంటచింతలకు వచ్చి మిర్చి వ్యాపారం చేస్తూ స్థిరపడ్డారు. శనివారం ఉదయం దంపతులిద్దరూ కార్తీక మాసం సందర్భంగా స్నానం చేసేందుకు సత్రశాలలోని కృష్ణా నది వద్దకు వెళ్లారు. అక్కడ ప్రమాదవశాత్తు కాలుజారి ఇద్దరూ నదిలో పడిపోయారు. గ్రామస్తుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. గల్లంతైన వారికోసం గాలింపు చర్యలు చేపట్టారు. కొంత దూరంలో పద్మావతి మృతదేహం కనిపించడంతో ఒడ్డుకు చేర్చి పంచనామా నిర్వహించారు. సత్యానారాయణ కోసం చీకటి పడే వరకూ గాలించినా ఫలితం లేకపోయింది. ఈ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు గోపి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సంపాదకీయం

హలో...!!

అవసరమైన భావ వ్యక్తీకరణ లేని ఇద్దరు అన్నదమ్ములను, సాటి మనిషిని చూసి చిరునవ్వుతో 'బావున్నారా' అని పలకరించే తండ్రిని... 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' సినిమాలో చూస్తాం. ఈ సినిమాలో చివరలో... 'మనుషులు మంచోళ్లురా, మనిషంటేనే మంచోడు. ...ఒక సామాన్యుడిగా ఏమివ్వగలంరా ఈ సమాజానికి, ప్రేమతో కూడుకున్న ఒక కుటుంబం తప్ప, ఈ జన్మకే నేను మీ తండ్రిని. జన్మలవరకెందుకురా... ఈరోజెళితే మళ్లీ వస్తామో లేదో తెలియదు. అందుకే ఎదురొచ్చే ప్రతివాడ్నీ చిరునవ్వుతో పలకరిస్తూ వెళ్ళిపోతే చాలు..' అంటాడు తండ్రి. ఒక విలువైన పరిచయానికి పునాది వంటి మాట... 'హలో' అనే రెండక్షరాల పదం. ప్రతిరోజూ ప్రపంచవ్యాప్తంగా అన్ని భాషల్లోనూ కోట్లాది మంది పలకరించుకొనే పిలుపు హలో. అపరిచితులను సైతం 'హలో' అంటూ చిరునవ్వుతో పలకరించడం చాలామందికి అలవాటు. ఫోన్లలో సంభాషణలు మొదలైన తర్వాత... ఆ ఇరువురు వ్యక్తుల పలకరింపు 'హలో'తోనే మొదలవుతుంది. 'హలో' అనే పదం...ఒక సార్వత్రిక భాష. ఇరువురు వ్యక్తుల మధ్య ఒక కనెక్షన్, ఒక రిలేషన్, ఒక ఎఫెక్షన్ హలో అనే పదంతోనే ప్రారంభమౌతుంది. 'నేనిక లేనని తెలిశాక/ విషాదాశ్రువులను వర్షిస్తాయి నీ కళ్ళు/ కానీ మిత్రమా.. అదంతా నా కంట పడదు/ ఆ విలాపమేదో ఇపుడే నా సమక్షంలోనే కానిస్తే పోలా' అంటూ పలకరింపులోని గొప్పతనాన్ని చెబుతాడు విశ్వకవి టాగూర్.

జాతి, మత, కుల వివక్షలు, విభేదాలు, విభజనలు, వైరుధ్యాల ఆధిపత్య ప్రపంచంలో మానవత్వానికి, ఐక్యత, శాంతి, సాంస్కృతిక మార్పిడిని ప్రోత్సహించే భావనలకు మార్గం సుగమం చేసేది మంచి ఆత్మీయ పలకరింపు. చాలా సందర్భాల్లో హలో అనే పదంతో, చిరునవ్వుతో మొదలవుతుంది. ఒక కథనం ప్రకారం... టెలిఫోన్ సృష్టికర్త అలెగ్జాండర్ గ్రాహంబెల్ తొలిసారిగా తన భార్యకు ఫోన్ చేసి 'హలో' అన్నాడని, అప్పటి నుంచి హలో అనే మాట పలకరింపుగా మారిపోయిందని అంటుంటారు. ఆయన కాదు, మార్క్ ట్వైన్ ఈ పదాన్ని తొలిసారి పలికాడని మరికొందరంటారు. 'హలో' పదాన్ని మొదటిసారిగా మార్క్ ట్వైన్ తన 'రఫింగ్ ఇట్' అనే రచనలో ఉపయోగించినట్లు మరో వాదన వుంది. ఈ మాటను ఎవరు పలికినా... ఫోన్ల వల్లే అధిక ప్రాచుర్యం పొందింది. ప్రపంచవ్యాప్తంగా భాషలన్నిటిలో హలో మాట పలకకపోయినా... దీనికి సరితూగే సమానార్థం లేదా పర్యాయపదం వాడుతుంటారు. మాట ఏదైనా భావం ఒక్కటే. ఈ బిజీ లైఫ్‌లో పక్కపక్కనే వుండికూడా ఆత్మీయంగా పలుకరించుకోలేని తెరల మధ్యన మనం బతుకుతున్నాం. ఏ బంధంలోనైనా పలకరింపు అవసరమే. తరచూ పలకరించుకోలేని ఏ బంధమైనా క్రమేణా పలుచబారిపోతుంది. ఎవరికివారు తమ చుట్టూ గిరి గీసుకొని, ఒకరికొకరు సంబంధం లేకుండా బతుకుతున్న ఆధునిక యుగం ఇది. మనుషుల మధ్య ఈ అంతరాలు ఏర్పరచి, క్షణం కూడా తీరికలేనితనాన్ని సృష్టించింది నయా ఉదారవాదం.

ప్రతి సంవత్సరం నవంబర్ 21న 'ప్రపంచ హలో దినోత్సవం' జరుపుకుంటారు. 1973లో ప్రారంభమైన ఈ హలో దినోత్సవం ప్రస్తుతం 180 దేశాలలో జరుపుకుంటున్నారు. 'శాంతిని పరిరక్షించడం' ఈ ఏడాది థీమ్. 'శత్రువును నాశనం చేయడానికి ఉత్తమ మార్గం అతన్ని స్నేహితుడిగా మార్చడం..' అంటాడు అబ్రహం లింకన్. ప్రపంచమంతా యుద్ధ మేఘాలు ఆవరించి వున్న తరుణంలో శాంతిని ప్రోత్సహించడం, ఐక్యతను పెంపొందించడం, మానవ సంబంధాలను మెరుగుపర్చుకోవడం కోసం అవసరమైన వ్యక్తిగత సంభాషణను ప్రోత్సహించాలి. రోజూ కొందరినైనా 'హలో' అని ఆప్యాయంగా పలకరించడం ద్వారా సాంస్కృతిక విభజనను తగ్గించి, మనుషుల మధ్య ఏర్పడిన చిన్నా, పెద్ద విభేదాలను పరిష్కరించుకోవచ్చు. సమిష్టితత్వాన్ని పెంచడానికి ఆప్యాయంగా పిలిచే పలకరింపు ఎంతో ఉపయోగపడుతుంది. 'భాష అనేది మానవ మేధస్సులోని ఒక ఆయుధాగారం. దాన్ని జాగ్రత్తగా ఉపయోగించుకోవాలి' అంటాడు కాలరిడ్జ్. మనుషుల మధ్య నయా ఉదారవాదం కట్టిన ఉక్కు తెరలను ఛేదించుకొని సమిష్టిగా, వ్యక్తిగతంగా ఒక సుహృద్భావ వాతావరణాన్ని ఏర్పరచుకోడానికి ఇలాంటి దినోత్సవాలు వారధిగా వుంటాయి. శాంతి మార్గం సవాళ్లతో నిండి ఉండవచ్చు, కానీ ఇది భవిష్యత్ తరాల కోసం ప్రారంభించదగిన గొప్ప ప్రయాణం.

మహనీయుల మాట

ప్రజలలో కనిపించే వెనుకబాటు భావాలకూ ఇతర వెనుకబాటు లక్షణాలకూ వ్యతిరేకంగా పోరాడాలి. అప్పుడు మాత్రమే మనం ప్రజల రాజకీయ చైతన్యాన్ని పెంచగలం. దోపిడీ వర్గాలను ఓడించేందుకు వారిని ఐక్యపరచగలం.

- లీ షావ్‌చీ

విద్వేష వివాదాలు, విశాల ప్రయోజనాలు!

ప్రస్తుతం

తెలకపల్లి రవి

మీడియా వికృత పోస్టులు, నేతల విద్వేష ప్రసంగాలతో దేశంలో రాజకీయాలు వివాదాస్పదంగా మారుతున్నాయి. వ్యక్తిగత అసభ్యత, కుల మతతత్వాలను రెచ్చగొట్టడం, కుటుంబాలను, మహిళలను కించపర్చడం నిత్యకృత్యంగా మారుతున్నాయి. పాలక వర్గ పార్టీలు తాము అధికారంలో వుంటే ఒక విధంగా ప్రతిపక్షంలో వుంటే మరో విధంగా స్పందిస్తున్నాయి. మీడియాపై వారికి వున్న పట్టును బట్టి దేన్ని పెద్దది చేయాలి? ఏది పక్కకు తోసేయాలి? అన్నది కూడా ఆ ప్రకారమే జరిగిపోతున్నది. సాధారణ ప్రజానీకం, ఆలోచనాపరులు, ప్రజాస్వామిక వాదులకు మాత్రం ఈ వాతావరణం దుర్భరంగా మారుతున్నది. ఆంధ్ర ప్రదేశ్‌లోనైతే టిడిపి, జనసేన కూటమికీ వైసీపీకి మధ్య దీనిపై కురుక్షేత్రమే నడుస్తున్నది. రోజూ కేసులు, అరెస్టులు, దాడులు, ప్రతిదాడులతో ప్రకంపనలు సాగుతున్నాయి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోషల్ మీడియాపై ప్రత్యేక అధ్యయనానికి పిలుపునిచ్చారు. ఎ.పి లో చంద్రబాబు నాయుడు సర్కారు ఏకంగా ఒక చట్టమే తెస్తానంటున్నది. మాజీ ముఖ్యమంత్రి జగన్, ఆయన పార్టీ వైసీపీ ఇదే సమస్యగా మాట్లాడుతున్నాయి. రెండు పార్టీలు, వాటి శ్రేణులు అవతలి వారినే దోషులుగా చూపించుతూ తాము చేసినవన్నీ సరైనవన్నట్టు వ్యవహరిస్తున్నాయి. జాతీయ స్థాయిలోనూ బిజెపి మతతత్వ రాజకీయాలు, ఆ యా రాష్ట్రాల పరిస్థితిని బట్టి విభిన్న రాజకీయ శక్తులు కూడా ఇదే తరహాలో పావులు కదుపుతున్నాయి. వీటన్నిటి మధ్యలో మీడియా సోషల్ మీడియాల అర్థమే మారిపోతున్నట్టు కనిపిస్తుంది. మరోవైపు ఈ పేరుతో మీడియా స్వేచ్ఛపైనే దాడి చేసే ధోరణులూ పెరగడం కూడా ఆందోళన కలిగిస్తుంది.

'అసభ్య' యుద్ధం

ఎ.పి లో ఎన్నికలకు బాగా ముందు నుంచే రెండు ప్రధాన పాలక పార్టీలు పోటాపోటీగా సోషల్ మీడియా సమ్మేళనాలు జరిపి యుద్ధానికి సిద్ధం చేశాయి. వైసీపీ పైన, అప్పటి ముఖ్యమంత్రి జగన్ పోకడల పైనా తీవ్రమైన విమర్శలు, ఆరోపణలు నడిచాయి. అప్పటి ఎంపీ రఘురామ కృష్ణరాజు, తెలుగుదేశం ప్రతినిధులు కొందరు తనను అవమానించారంటూ వైసీపీ ప్రభుత్వం అరెస్టులు చేయడం, కస్టడీలో చిత్రహింసలు దేశవ్యాపిత చర్చకూ కేసులకూ కారణమైనాయి. ఈ కేసుల నేపథ్యంలో హైకోర్టు సుప్రీం కోర్టు న్యాయమూర్తులపైనా అభ్యంతరకర పోస్టులు నడవడంతో న్యాయస్థానాలు కూడా ఆగ్రహోదగ్రమైనాయి. ప్రతిపక్ష నేత చంద్రబాబు సతీమణిపై హీనమైన నిందలు వేసిన మాజీ టీడిపి కమ్ వైసీపీ సభ్యుడి నిర్వాకాన్ని ఖండించకపోగా సభ వేదికపై పరోక్షంగా పాలకపక్షం వంత పాడటంతో ఆయన సభను బహిష్కరిస్తున్నట్టు ప్రకటించారు. ఆ సమయంలో ఆయన కన్నీళ్లు పెట్టుకున్న చిత్రాన్ని వైసీపీ దాదాపు ఒక చిహ్నంలాగా వైసీపీ మీడియా ఎన్నికల పొడుగునా వాడింది. మరో వైపు వై.ఎస్ షర్మిల కాంగ్రెస్‌లో చేరి అధ్యక్ష పదవి చేపట్టి వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేశారు. అదే సమయంలో చంద్రబాబు అరెస్టు, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఓట్లు చీలకుండా చూస్తానని ప్రకటించడం, బిజెపితో కూడా కలిసి వెళ్లడంతో కూటమి పెద్ద విజయం సాధించింది. అంతకు ముందే పవన్ వివాహంపై వికృత దాడి చేస్తున్న వైసీపీ తర్వాత షర్మిల పైనా దాడి ప్రారంభించింది. ఆఖరుకు విజయమ్మ, షర్మిల పైన కూడా దారుణమైన పోస్టులు సోషల్ మీడియా నుంచి వెలువడ్డాయి. ఛానళ్లు కూడా అటో ఇటో విడిపోయి ఒకరినొకరు బహిష్కరించుకుని తమ వేదికలపై తమకు అనుకూలంగా ప్రచారాలు చేసుకోవడంతో అసలు మీడియా దృశ్యమే మారిపోయింది.

తాజా సన్నివేశం...

గతంలో వైసీపీ సర్కారు అరెస్టులు చేయిస్తే ఎన్నికల తర్వాత ఆ అవకాశం టిడిపి, జనసేనలకు వచ్చింది. వాటన్నిటికి గుణపాఠం చెబుతామన్న వైఖరిని సర్కారు చేపట్టింది. వందల మందికి నోటీసులు అందాయి. అనేక మంది అరెస్టయ్యారు. ఇప్పుడు వైసీపీ నేతలు మానవ హక్కులపై దాడి అని ఆందోళనలు చేస్తున్నారు. హైకోర్టును ఆశ్రయిస్తే మానవ హక్కులకు భంగం కలిగేలా వ్యవహరించడం తగదనీ, కానీ ఇష్టానుసారం సోషల్ మీడియాను విచ్చలవిడిగా దుర్వినియోగం చేస్తే చట్ట పరిధిలో చర్య వుండాల్సిందేనని తేల్చింది. తమ న్యాయవ్యవస్థపైనా పోస్టులు పెట్టిన సంగతి గుర్తు చేసింది. ఈ మధ్య కూడా తిరుపతి లడ్డూ విచారణలో ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేస్తే వెంటనే సుప్రీం కోర్టు న్యాయమూర్తిపైనా వ్యక్తిగత ఆరోపణలతో టిడిపి అనుకూల మీడియాలో పోస్టులు, వ్యాఖ్యలు వెలువడ్డాయి. జనసేన ముందు నుంచీ పవన్‌ను ఎవరైనా ఏదైనా అంటే అభిమానులు ఎంత దూరమైనా వెళ్లి దాడి చేస్తారనే విధానం తీసుకుంది. మాజీ ముఖ్యమంత్రి జగన్ భార్య భారతి కూడా ఒక టార్గెట్‌గా మారారు. మరోవైపు భువనేశ్వరి, విజయమ్మ, షర్మిలలపై వికృత వ్యాఖ్యల కారణంగా సహజంగానే వైసీపీ సోషల్ మీడియా ఎక్కువగా విమర్శలు ఎదుర్కొంటున్నది. ఇప్పటికైనా పునరాలోచన లేకపోగా ఈ బూతు పోస్టులన్నీ ప్రజల సమస్యలపై ప్రశ్నించడంగా సమర్థించుకోవడం జరుగుతున్నది. పైగా ప్రభుత్వ వ్యవస్థలను దుర్వినియోగం చేసి ఈ సోషల్ మీడియా ప్రచారకులకు జీతాలు చెల్లించడం వంటి ఆరోపణలూ వచ్చాయి. అన్నిటికీ తన ఎదురు దాడి సమాధానమన్నట్టు వైసీపీ నాయకులు వ్యవహరిస్తున్నారు. మాపైన పోస్టులు పెట్టిన టిడిపి, జనసేన వారి మాటేమిటని ప్రశ్నిస్తున్నారు. అయితే వారి పాలనలో ఈ కారణంగానే పలువురిని అరెస్టు చేసిన సంగతి మర్చిపోతున్నారు.

> **అందరికీ అందుబాటులో వుండే సోషల్ మీడియాను కూడా ప్రజల ప్రయోజనాల కోణంలో గాక పాలక వర్గ పార్టీల పాక్షిక వ్యూహాల కోసం ఎలా దారి తప్పిస్తున్నదీ ఈ పరిణామాలు చెబుతున్నాయి. తప్పులపై చర్యలు తప్పనిసరి. కానీ అది అన్ని వైపుల నుంచి జరగాలి. కోర్టు కేసులే గాక ఎన్నికల సంఘం, ప్రెస్ కౌన్సిల్, మానవ హక్కుల సంఘం, మహిళా కమిషన్ల వంటివి నిష్పాక్షికంగా చర్యలు తీసుకోవాలి. ప్రజాస్వామిక హక్కులు, మీడియా భావ ప్రకటనా స్వేచ్ఛను కాపాడుకోవడంతో పాటు దాన్ని ప్రజల విశాల ప్రయోజనాల కోసం సద్వినియోగపర్చడమే ఇప్పుడు సవాలు. ప్రజాస్వామిక, లౌకిక విలువలే కొలబద్దలుగా రెచ్చగొట్టే శక్తుల పట్ల, కుటిల రాజకీయ సామాజిక వ్యూహాల పట్ల అప్రమత్తంగా వుంటూ ప్రజలను చైతన్యపర్చడం కోసం శాయశక్తులా కృషి చేయడమే జరగాల్సింది.**

> **ఏమైనా ఈ జాడ్యం ఒకరికో లేక ఒక పాలక వర్గ పార్టీకో పరిమితమైంది కాదని చెప్పాలి. రాజకీయ విధానపరమైన అంశాలపై ఎన్ని విమర్శలైనా చేయొచ్చు, కోర్టులకూ వెళ్లవచ్చు కానీ...ఇష్టానుసారం నిందారోపణలు, అసభ్య కథనాలు గుమ్మరించడం అనుమతించరానిది. తాజాగా సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా, సంజయ కుమార్‌ల ధర్మాసనం చేసిన కీలక వ్యాఖ్యలు దీనికి సమాధానమిస్తాయి. విద్వేష ప్రసంగాలు, వ్యాఖ్యలపై తక్షణం సూమోటాగా కేసు పెట్టవలసిందేనని, అందుకు ఎవరూ ఫిర్యాదు చేయవలసిన అవసరం కూడా లేదని చెప్పింది. అలా కాకుండా రెచ్చగొట్టే ప్రసంగాల వంటి వాటిని మరో కోణంలో చూడాలన్నది వారి నిర్ధారణ.**

విద్వేష వ్యూహాలు, మతతత్వం

ఏమైనా ఈ జాడ్యం ఒకరికో లేక ఒక పాలక వర్గ పార్టీకో పరిమితమైంది కాదని చెప్పాలి. రాజకీయ విధానపరమైన అంశాలపై ఎన్ని విమర్శలైనా చేయొచ్చు, కోర్టులకూ వెళ్లవచ్చు కానీ...ఇష్టానుసారం నిందారోపణలు, అసభ్య కథనాలు గుమ్మరించడం అనుమతించరానిది. తాజాగా సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా, సంజయ కుమార్‌ల ధర్మాసనం చేసిన కీలక వ్యాఖ్యలు దీనికి సమాధానమిస్తాయి. విద్వేష ప్రసంగాలు, వ్యాఖ్యలపై తక్షణం సూమోటాగా కేసు పెట్టవలసిందేనని, అందుకు ఎవరూ ఫిర్యాదు చేయవలసిన అవసరం కూడా లేదని చెప్పింది. అలా కాకుండా రెచ్చగొట్టే ప్రసంగాల వంటి వాటిని మరో కోణంలో చూడాలన్నది వారి నిర్ధారణ. మరో వంక మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి ఆనంద్ వెంకటేశ్...నటి కస్తూరి శంకర్ తెలుగువారి చరిత్రపై చేసిన వ్యాఖ్యలకు సారీ చెప్పానంటే సరిపోదనీ, చట్టపరంగా చర్యలు ఎదుర్కోవలసిందేనని అంటూ ముందస్తు బెయిల్ నిరాకరించారు. బిజెపి మద్దతుదారుగా ఆమె ద్రావిడ రాజకీయాలను వ్యతిరేకించేందుకు తెలుగువారిని కించ పర్చడం దిగ్భ్రాంతి కలిగించింది. స్వయంగా ప్రధాని మోడీ జార్ఖండ్ ఎన్నికల ప్రచారంలో ముస్లిములకు వ్యతిరేకంగా ప్రచారం చేయడంపై సిపిఎం ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది గానీ చర్యలు లేవు. కేరళలోనైతే సిపిఎం నేతలకు, కుటుంబాలకు వ్యతిరేకంగా విచ్చలవిడిగా కథనాలు ప్రచారం చేసిన కాంగ్రెస్, బిజెపి కార్యకర్తలు కేసులను ఎదుర్కొంటున్నారు. ఉత్తర ప్రదేశ్‌లో ఈ తరహా దాడులెన్నో చేసిన యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం విమర్శించే యూట్యూబర్లపై కక్ష కట్టి దాడి చేస్తే సుప్రీం కోర్టు అడ్డుపడింది. బుల్డోజర్ జస్టిస్ కుదరదన్నది. మరో వంక తమకు అనుకూలమైన వారికి ఏకంగా ఎనిమిది లక్షల వరకూ యాడ్స్ రూపంలో ముట్టచెప్పేందుకు అదే ప్రభుత్వం బిల్లు తెచ్చింది. యోగి ఆదిత్యనాథ్‌లా అణచివేయాలని పిలుపునిచ్చిన పవన్ కళ్యాణ్ ఇవన్నీ గమనించారో లేదో తెలియదు. అర్నబ్ గోస్వామి వంటి వారిని నేరుగా అమిత్‌షా ఆదుకోవడం, మరోవైపున వైర్, న్యూస్ క్లిక్ వంటి వాటిపై దాడి చేయడం దేశమంతా చూసింది. వామపక్షాలు, ప్రజా సంఘాల నాయకుల అరెస్టులు సాగుతూనే వున్నాయి. కానీ పాలక వర్గ పార్టీల కీలక నేతలలో ఎవరిని ఎప్పుడు అరెస్టు చేస్తారనేదే చర్చగా మారుతోంది. తెలుగు రాష్ట్రాలలోనూ అఘోరి నుంచి తిరుమల వివాదం వరకూ ప్రతి సందర్భంలోనూ చాప కింద నీరులా ఈ మత కోణం కూడా కొనసాగుతున్న తీరు విస్మరించరానిది. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సనాతన ధర్మ ప్రచార వ్యూహం చేపట్టడం, టీవీ 5తో పాటు హిందూ ధర్మం ఛానల్ యజమానిని టిటిడి బోర్డు చైర్మన్‌గా నియమించాక కొండపై అన్య మతస్తుల చర్చ పెరగడంలో రాజకీయ సంకేతాలున్నాయనీ గ్రహించడం అవసరం. అమెరికా అధ్యక్షుడుగా ఎన్నికైన ట్రంప్ విజయం గురించి కూడా ఇలాగే పోస్టులు పెట్టడం దేశవ్యాపితంగా జరిగింది. ఎక్స్ యజమాని ఎలన్ మస్క్ ఏకంగా ట్రంప్ బృందంలో సభ్యుడు కావడం కూడా ఈ ధోరణికి పరాకాష్ట. ఈ క్రమంలో హిందూత్వను, బిజెపిని ప్రశ్నించకుండా ప్రసన్నం చేసుకునే ధోరణులు పెరిగిపోతున్నాయి. వీక్షకులను ఏది ఆకర్షిస్తే అది, ఏది చూస్తే అది ఇస్తూ సోషల్ మీడియాను లాభార్జనా సాధనంగా చూడటం వల్ల కూడా తప్పులు జరుగుతున్నాయి.

సమస్యలపై దృష్టి?

వీటన్నిటి ఫలితంగా కార్మికుల హక్కులు, విశాఖ ఉక్కు రక్షణ, రెండు రాష్ట్రాల్లోనూ గిరిజనుల హక్కులు అటవీ భూములు, గిట్టుబాటు ధరలు, వ్యవసాయ రంగ సవాళ్లు, మహిళలపై అత్యాచారాలు, ఉద్యోగాల కల్పన, విద్యారంగం, కేంద్రం సహాయంకై పోరాటం తదితర కీలక అంశాలు తెరమరుగై పోవడం. ప్రజా ప్రయోజనాల కోణంలో గాక ఆయా పాలక పార్టీల నేతలను కీర్తించడం, దూషించడానికే పరిమితం కావడం. ఆఖరుకు వందల ఏళ్లు వుండాల్సిన ప్రాజెక్టుల పైన కూడా సమగ్ర చర్చ జరక్కపోగా ఆరోపణల యుద్ధంలా, కాంట్రాక్టర్ల మార్పులా మారిపోయింది. రేవంత్ రెడ్డి, బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి వంటి నాయకులు మాత్రం ప్రత్యేకంగా కమ్యూనిస్టు పత్రికలను ఇందుకు మినహాయింపుగా పేర్కొనడం గమనించదగ్గది. ఆ మీడియాలో, పత్రికలలో ఎందుకు ఇలాంటి వివాదగ్రస్తమైన నిరాధారమైన కథనాలు రావని వారు సూటిగానే ప్రశ్నించారు.

మీడియా మాయాజాలం గురించి నోమ్ చోమ్‌స్కీ వంటి వారు ఎప్పుడో చెప్పేశారు. కాగా అందరికీ అందుబాటులో వుండే సోషల్ మీడియాను కూడా ప్రజల ప్రయోజనాల కోణంలో గాక పాలక వర్గ పార్టీల పాక్షిక వ్యూహాల కోసం ఎలా దారి తప్పిస్తున్నదీ ఈ పరిణామాలు చెబుతున్నాయి. తప్పులపై చర్యలు తప్పనిసరి. కానీ అది అన్ని వైపుల నుంచి జరగాలి. కోర్టు కేసులే గాక ఎన్నికల సంఘం, ప్రెస్ కౌన్సిల్, మానవ హక్కుల సంఘం, మహిళా కమిషన్ల వంటివి నిష్పాక్షికంగా చర్యలు తీసుకోవాలి. ప్రజాస్వామిక హక్కులు, మీడియా భావ ప్రకటనా స్వేచ్ఛను కాపాడుకోవడంతో పాటు దాన్ని ప్రజల విశాల ప్రయోజనాల కోసం సద్వినియోగపర్చడమే ఇప్పుడు సవాలు. ప్రజాస్వామిక, లౌకిక విలువలే కొలబద్దలుగా రెచ్చగొట్టే శక్తుల పట్ల, కుటిల రాజకీయ సామాజిక వ్యూహాల పట్ల అప్రమత్తంగా వుంటూ ప్రజలను చైతన్యపర్చడం కోసం శాయశక్తులా కృషి చేయడమే జరగాల్సింది. ★

డిజిటల్ కాలుష్యం - అణు విద్యుత్

విశ్లేషణ

రఘు



'వాతావరణ మార్పు' గురించి మాట్లాడుకునే సందర్భాలలో, నూతన సాంకేతికతలైతే, తక్కువ కర్బన అడుగు జాడల్ని (కార్బన్ ఫుట్ ప్రింట్) వదులుతాయని అంటే తక్కువ కాలుష్య కారకాలుగా ఉంటాయని అనుకుంటాము. గ్రీన్ టెక్నాలజీల ముసుగులో ఈ సాంకేతికతలు చెలామణి అవుతుంటాయి. నీలి హైడ్రోజన్, నాచురల్ గ్యాస్ లాంటి ప్రత్యామ్నాయాల గురించి యూరప్‌లో, అమెరికాలో మాట్లాడుతూ ఉంటారు. మానవ జీవితాన్ని మారుస్తున్న, తీవ్రంగా మార్చబోతున్న ఈ సాంకేతికతలన్నీ (కంప్యూటర్ సాంకేతికతలు, ప్రక్రియలు లాంటివి) ఒక సగటు మనిషికి నిరపాయకరంగానే అనిపిస్తాయి. ఇవి కల్పించే సౌలభ్యంలో పడి, వీటి వల్ల వచ్చే కాలుష్యాలను, గ్రీన్ హౌస్ ఉద్గారాలను పెద్దగా పట్టించుకోవడం లేదు. ఇప్పటి లాప్‌టాప్‌లు, టాబ్లెట్లు, స్మార్ట్ ఫోన్లు చాలా శక్తివంతమైనవి. ఎంత శక్తి అంటే, మనిషి చంద్రుడి పైకి వెళ్ళి, మళ్ళీ తిరిగి రావటానికి ఉపయోగపడిన ఒక గది అంత సైజు ఉండే కంప్యూటర్ కంటే కూడా, వందల రెట్లు శక్తివంతమైనవి. ఒక గంట సేపు చార్జి చేస్తే, ఎన్నో గంటల పాటు అవి పని చేయగలవు. వీటిలో సినిమాలు చూడొచ్చు. ప్రశ్నలు అడగొచ్చు. ఇప్పుడైతే, సెర్చ్ ఇంజిన్ల నుండే కాదు, మిలియన్ల బైట్ల సమాచారం ఉండే కృత్రిమ మేధ (ఏ.ఐ)ల నుండి కూడా ఆ జవాబులు పొందొచ్చు. ఈ కృత్రిమ మేధ సర్వవ్యాపితం. సైన్స్ అండ్ టెక్నాలజీ, వైద్యం, సినిమా, కళ, పరిశ్రమలు-అంతటా ఇదే. ఒక క్లిక్‌తో సమాచారం అందుబాటులోకి వచ్చేస్తుంది. అయితే ఇంత భారీ సమాచారం ఎక్కడ నిల్వ ఉంచి ఇస్తున్నారు? అనే అంశాన్ని ఎవరూ ఆలోచించడం లేదు. అలాగే క్రిప్టో కరెన్సీల విషయం కూడా. అమ్ముతున్నారు, కొంటున్నారు. కానీ వాటి తయారీపై ఆలోచన లేదు. పెద్ద పెద్ద సర్వర్లను వాడే కంపెనీలు, ఇప్పుడు పెద్ద పెద్ద క్లౌడ్ సర్వీసులను వాడుతున్నాయి. అవి ఎక్కడో ఉండి, మనకు కనపడకుండానే భారీ సమాచారాలను నిల్వ ఉంచుతున్నాయి. ఇదంతా చాలా అద్భుతంగా, ఒక కొత్త ప్రపంచం లాగా, నమ్మశక్యం కానంతగా అనిపిస్తుంది. పర్యావరణానికి ఎటువంటి హాని కూడా జరగదన్నట్టుగా, సున్నితంగా ఉన్నట్టుగా కూడా ఉంటుంది. కానీ ఒక ప్రమాదకరమైన, భయానకమైన, వికారమైన వాస్తవాలు ఇందులో ఉన్నాయి.

ఉద్గారాలు

విద్యుత్ ఎక్కువగా వాడే కొద్దీ, ఎక్కువ ఉద్గారాలు వెలువడతాయి. కృత్రిమ మేధ, క్రిప్టో కరెన్సీలు, బిగ్ డేటాలకు చాలా ఎక్కువ విద్యుత్ వాడకం అవసరం అవుతుంది. వినియోగదారుల షాపింగ్ ప్రవర్తనల గుర్తింపు, ముఖ కవళికల గుర్తింపు, సోషల్ మీడియా, ఇంటర్నెట్ ట్రాకింగ్-లాంటి వాటిల్లో చాలా ప్రాసెసింగ్ ఉంటుంది. ఈ ప్రక్రియ కంటికి కనిపించదు. కానీ పెద్ద పెద్ద సర్వర్లు, వాటిని ఉంచే పెద్ద పెద్ద భవనాలు, వాటికున్న బృహత్తరమైన కంప్యూటింగ్ శక్తి సామర్థ్యాలు, వాటిని చల్లబరిచేందుకు ఎంతో నీరు, పెద్ద పెద్ద ఫ్యాన్లు అవసరమవుతాయి. ఇంత పెద్ద ఎత్తున విద్యుత్ వాడినప్పుడు, ఉద్గారాలు కూడా పెరుగుతాయి. పునరుత్పాదక శక్తి వాడినప్పుడు, శిలాజ వనరులు వాడినప్పటి కంటే తక్కువ ఉద్గారాలు వెలువడవచ్చు. కానీ వాటి వల్ల వచ్చే, అదనపు సమస్యలు వేరే ఉన్నాయి.

ఈమధ్య కాలంలో, డిజిటల్ ప్రపంచం నుంచి వెలువడుతున్న ఉద్గారాలు ఆకాశాన్ని అంటుతున్నాయి. 2010 సంవత్సరంలో ఇంటర్నెట్‌తో అనుసంధానింపబడిన పరికరాలు 100 కోట్లు ఉంటే, 2025 వచ్చేసరికి 5000 కోట్లు, 2030 వచ్చేసరికి 10000 కోట్లు ఉంటాయని అంచనా. మొత్తం ప్రపంచ వ్యాప్త ఉద్గారాలలో డిజిటల్ రంగం నుండి వచ్చేవే, 3.5 శాతం దాకా ఉండొచ్చు. వైమానిక రంగం నుంచి వచ్చే ఉద్గారాలను (2.5 శాతం) ఇది ఇప్పుడు మించిపోయింది. వాస్తవిక కరెన్సీని అనుకరించే, దాదాపు సమానమనిపించే క్రిప్టో కరెన్సీని వెలికి తీయడానికి కూడా ఎంతో డేటా వినియోగం, శక్తి వినియోగం జరుగుతుంది. గ్లోబల్ ఉద్గారాలలో దీని వాటా 0.7 శాతం ఉంటుంది. వీటన్నింటిలో, ఉత్పత్తి ప్రక్రియల వల్ల సగం ఉద్గారాలు వెలువడితే, మరో సగం వినియోగం ద్వారా వెలువడతాయి. స్మార్ట్ ఫోన్ల వినియోగం, కృత్రిమ మేధ వినియోగం పెరిగే కొద్దీ, ఎన్నో రెట్లు ఈ ఉద్గారాలు కూడా పెరుగుతాయి.

> **విద్యుత్ ఎక్కువగా వాడే కొద్దీ, ఎక్కువ ఉద్గారాలు వెలువడతాయి. కృత్రిమ మేధ, క్రిప్టో కరెన్సీలు, బిగ్ డేటాలకు చాలా ఎక్కువ విద్యుత్ వాడకం అవసరం అవుతుంది. వినియోగదారుల షాపింగ్ ప్రవర్తనల గుర్తింపు, ముఖ కవళికల గుర్తింపు, సోషల్ మీడియా, ఇంటర్నెట్ ట్రాకింగ్- లాంటి వాటిల్లో చాలా ప్రాసెసింగ్ ఉంటుంది. ఈ ప్రక్రియ కంటికి కనిపించదు. కానీ పెద్ద పెద్ద సర్వర్లు, వాటిని ఉంచే పెద్ద పెద్ద భవనాలు, వాటికున్న బృహత్తరమైన కంప్యూటింగ్ శక్తి సామర్థ్యాలు, వాటిని చల్లబరిచేందుకు ఎంతో నీరు, పెద్ద పెద్ద ఫ్యాన్లు అవసరమవుతాయి. ఇంత పెద్ద ఎత్తున విద్యుత్ వాడినప్పుడు, ఉద్గారాలు కూడా పెరుగుతాయి.**

ఉద్గారాల లెక్కలు - సమస్యలు

ఈ ఉద్గారాలను సరిగ్గా లెక్కించాలంటే, అవసరమైన డేటాను పరిశ్రమలు ఇవ్వడం లేదు. ఇతర పరిశ్రమలలో ఉన్నట్టుగా, ఉద్గారాలకు సంబంధించిన ప్రామాణికరింపబడిన లెక్కలు కానీ, ప్రోటోకాల్స్ గాని ఇక్కడ లేవు. ప్రాసెసింగ్ ఎంత జరుగుతోందనే సమాచారం మాత్రం కొంత ఉంది. క్లౌడ్ కంప్యూటింగ్, డేటా స్టోరేజ్, ఏ.ఐ ప్రాసెసింగ్ లాంటివి జరిగే డేటా సెంటర్లకు, క్రిప్టో కరెన్సీ మైనింగ్‌లకూ అవసరమయ్యే విద్యుత్తు, ప్రపంచ విద్యుత్తు వినియోగంలో 2 శాతం దాకా ఉంటే, ఉద్గారాలు 1 శాతం వరకూ ఉండొచ్చు. అయితే ఇవన్నీ కూడా పాత లెక్కలే. పెద్ద పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీలు, ఏ.ఐ సర్వీసులు, ఏ.ఐ సాఫ్ట్‌వేర్లు, హార్డ్‌వేర్ల విస్ఫోటానికి ముందు లెక్కలు ఇవన్నీ. ఈ మధ్య ఐఎంఎఫ్ ఒక లెక్క వేసింది. డేటా సెంటర్లు, క్రిప్టో కరెన్సీల వాటా ప్రపంచ విద్యుత్ వినియోగంలో 3.5 శాతం ఉండవచ్చని చెప్పింది. ఇది ఐదవ పెద్ద దేశమైన, జపాన్ విద్యుత్ వినియోగానికి దాదాపు సమానం. అయితే కచ్చితంగా లెక్క వేయడం ఇప్పటికీ సాధ్యం కావడం లేదు. ప్రపంచంలోని ఎక్కడెక్కడి ప్రాంతాలకో డేటా ప్రాసెసింగ్‌ను, క్లౌడ్ స్టోరేజ్‌ను, ఔట్ సోర్స్ చేయడం లాంటి బిజినెస్ మోడళ్ల వల్ల కచ్చితమైన లెక్కలు సాధ్యం కావడం లేదు.

ఇదంతా డేటా ప్రాసెసింగ్‌కు సంబంధించిన విషయం. కానీ డేటా వినియోగం, వైపు నుండి ఎంత ఉద్గారాలు వస్తాయనే విషయంలో చాలా తక్కువ అధ్యయనం ఉంది. ఈ మధ్య కాలంలోనే ఎం.ఐ.టి లాంటి చోట్ల కొన్ని అధ్యయనాలు జరుగుతున్నాయి. ఉదాహరణకు ఏ.ఐ ని ఉపయోగించి ఒక ఇమేజ్‌ను సృష్టించడానికి అయ్యే విద్యుత్తు, ఒక స్మార్ట్ ఫోన్‌ను పూర్తిగా చార్జ్ చేయడానికి అయ్యే విద్యుత్‌తో సమానమని అంటున్నారు. గూగుల్ సెర్చ్ కంటె చాట్ జిపిటి పదింతలు ఎక్కువ విద్యుత్‌ను వినియోగిస్తుందని అంటున్నారు. చాలా స్మార్ట్ ఫోన్లలో, ఏ.ఐ డిఫాల్ట్ ఆప్షన్‌గా ఉంది. అంటే గూగుల్ సెర్చ్‌కు అడ్డుపడుతుంది. సాధారణ సాఫ్ట్‌వేర్ కంటే ఈ ఏ.ఐ సాఫ్ట్‌వేర్ 33 రెట్లు ఎక్కువ విద్యుత్తును వాడుకుంటుంది. వరల్డ్ ఎకనమిక్ ఫోరం అంచనా ప్రకారం, ఏ.ఐ కంప్యూటింగ్, ప్రతి వంద రోజులకు రెండింతలు పెరుగుతోంది.

బిగ్ ఫైవ్

విద్యుత్ వినియోగం, కాలుష్య ఉద్గారాల విషయంలో మొదటి ఐదు స్థానాల్లో పెద్ద కంపెనీల డేటా సెంటర్లే ఉన్నాయి. అమెజాన్, గూగుల్, మైక్రోసాఫ్ట్, యాపిల్, మెటా- ఈ ఐదు కంపెనీలూ అవడం పెద్ద ఆశ్చర్యం కాదు. రెండవ స్థానంలో ఉన్న యాపిల్ కంటే, మొదటి స్థానంలో ఉండే అమెజాన్ వెలువరించే ఉద్గారాలు రెండింతలు వుంటాయి. అయితే చాలా అధ్యయనాలు అమెజాన్‌ను వదిలేస్తాయి. ఎందుకంటే అమెజాన్ డేటా వినియోగం, కంప్యూటింగ్ మోడళ్లు విభిన్నంగా ఉండి, ఇతర కంపెనీలతో పోలిక కష్ట సాధ్యం చేస్తాయి. ద గార్డియన్ పత్రిక ఒక అధ్యయనం చేసింది. మిగిలిన నాలుగు కంపెనీలు (అమెజాన్ మినహా) అధికారికంగా ఇచ్చే లెక్కల కంటే, వాటి వాస్తవ ఉద్గారాలు 662 శాతం ఎక్కువ ఉంటాయని, ఆ అధ్యయనం చెబుతుంది. ఆ కంపెనీలు ఉపయోగించే ఔట్ సోర్సింగ్ పద్ధతుల వల్ల, పారదర్శకం కానీ విధానాల వల్ల అసలైన లెక్కలు బయటకు రావడం లేదు. యాపిల్, మెటా 'సృజనాత్మక' పద్ధతులను ఉపయోగించి లెక్కల్ని దాస్తాయి. గూగుల్ 2030 వచ్చేసరికి తన డేటా సెంటర్లన్నింటా, సంపూర్ణంగా (22/7) రెన్యువల్ ఎనర్జీని ఉపయోగిస్తామని హామీ ఇచ్చింది. మైక్రోసాఫ్ట్ కూడా ఇటువంటి నూరు శాతం హామీనే (100/100/0) ఇచ్చింది.

అణు విద్యుత్ రంగప్రవేశం

పారిశ్రామిక వాణిజ్య గృహ విద్యుత్ అవసరాలలో, రాత్రింబవళ్లలో హెచ్చుతగ్గులు ఉంటాయి. కానీ డేటా సెంటర్లు, ఏ.ఐ కోసం 24 గంటల విద్యుత్ సరఫరా సంవత్సరం పొడుగునా అవసరమవుతుంది. ఈ డిమాండు గ్రిడ్ల మీద విపరీతమైన భారాన్ని మోపుతుంది. అది తీవ్రమైన సమస్యలకు దారితీస్తుంది. డేటా సెంటర్లకు చాలా హెచ్చుగా 800-900 ఎం.డబ్ల్యు.ఇ దాకా అవసరమవుతుంది. అందుకే వీటికి 24 గంటల హామీ ఉండే సొంత, శిలాజేతర విద్యుత్ వనరులు అవసరమవుతాయి. ఇటువంటి, నిరంతరాయ విద్యుత్తు, జల-వాయు-సౌర వనరుల ద్వారా సాధ్యం కాదు. ఇక్కడే అణు విద్యుత్తు రంగంలోకి ప్రవేశిస్తుంది. ఒక ఐదేళ్లకు ముందు ఎవరూ ఈ ఆలోచన చేయలేదు. ఈ మధ్యనే మైక్రోసాఫ్ట్, కన్సల్టేషన్ పవర్ అనే ఒక సంస్థతో 20 ఏళ్ల ఒప్పందం చేసుకుంది. ఇప్పటికే తీవ్రమైన ప్రమాదం జరిగిన 'త్రీ మైల్' అణు విద్యుత్ కేంద్రం నుండి విద్యుత్‌ను అందించే ఒప్పందం ఇది.

1979లో, అమెరికాలోనే అతి పెద్ద అణు ప్రమాదాలలో ఒకటి ఈ ప్లాంట్ లోనే (యూనిట్ 2) జరిగింది. 2019లో మూసివేసిన, సందేహాస్పదమైన యూనిట్ 1 నుండి ఇప్పుడు విద్యుత్తును కొనుగోలు చేస్తున్నారు. అలాగే, అమెజాన్ వెబ్ సర్వీస్‌లు ఈ మార్చి నుండి పెన్సిల్వేనియా లోని 'టాలెన్ ఎనర్జిస్' అణు విద్యుత్ కేంద్రం నుండి 960 ఎం.డబ్ల్యు.ఇ ని కొనుగోలు చేస్తున్నారు. మరోవైపు చిన్న చిన్న న్యూక్లియర్ రియాక్టర్ల వైపు ఆసక్తి పెరుగుతోంది. పెట్టుబడులు పెట్టడం వైపు, సాంకేతిక అభివృద్ధి వైపు ఆలోచనలు జరుగుతున్నాయి. అంటే దీని అర్థం ఏమిటి? ఇంటర్నెట్ భవిష్యత్తు అణుశక్తిపై ఆధారపడి ఉన్నదా? వేచి చూద్దాం.

/ స్వేచ్ఛానువాదం/

పాఠశాలలో పశువైద్యశాల.. వరండాలో తరగతులు

- ఇబ్బందుల్లో విద్యార్థులు

ప్రజాశక్తి-తలుపుల

సత్యసాయి జిల్లా తలుపుల మండల కేంద్రమైన తలుపులలో పశు వైద్య శాఖకు సొంత భవనం ఉండేది. ఆ భవనం శిథిలావస్థకు చేరడంతో స్థానిక ఉర్దూ స్కూల్ ఆధీనంలో ఉన్న ఓ పాఠశాల గదిని కరోనా సమయంలో అప్పట్లో పనిచేస్తున్న ఓ అధికారి తాత్కాలికంగా పశు వైద్య శాఖకు అప్పగించినట్లు సమాచారం. దీంతో పశు వైద్య శాఖ వారు ఆ గదిలో కార్యాలయం ఏర్పాటు చేసుకొని ఆవరణంలో పశువులకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఇదిలా ఉండగా ఎంపియుపి ఉర్దూ స్కూల్‌లో నలుగురు ఉపాధ్యాయులు ఉండగా ముగ్గురు విద్యార్థులకు పాఠశాల గదుల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. మరో ఉపాధ్యాయుడు వరండాలో పిల్లలకు పాఠాలు బోధిస్తున్నారు. దీనికి తోడు విరామ సమయంలో పిల్లలకు ఆడుకోవడానికి మైదానం లేకుండా పోయింది. పక్కనే ఉన్న పశువైద్యశాల ఉండడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా విద్యాశాఖ అధికారులు విద్యార్థుల ఇబ్బందులను గుర్తించి పశువైద్యశాల నిర్వహిస్తున్న గదిని పాఠశాలకు అప్పజెప్పాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.

ఆర్‌డిఒ చొరవతో మహిళా రైతుకు న్యాయం

- పరిహారం పొందిన రైతు నుంచి భూమి అప్పగింత

ప్రజాశక్తి - భోగాపురం

విమానాశ్రయం భూసేకరణలో అధికారులు పరిహారం ఒకరికి వేసి మరో మహిళా రైతు వద్ద భూమిని తీసుకునే ప్రయత్నం చేశారు. ఆర్‌డిఒ దాట్ల కీర్తి చొరవతో ఆ మహిళా రైతుకు ఎట్టకేలకు న్యాయం జరిగింది. వివరాల్లోకి వెళితే.. భోగాపురం గ్రామానికి చెందిన మాతా శిఖామణి అనే మహిళా రైతు వద్ద గూడెపువలస రెవెన్యూ పరిధిలో అప్రోచ్ రోడ్డు నిమిత్తం 27 సెంట్లు భూమిని 2017లో తీసుకున్నారు. దానికి సంబంధించిన పరిహారాన్ని కూడా అప్పట్లో ఆ మహిళా రైతుకు చెల్లించారు. ఆ తరువాత రహదారికి కొలతలు వేసే సమయంలో మరో 33 సెంట్లుకు పరిహారం ఇవ్వకుండా ఈ మహిళా రైతు భూమిలో హద్దు రాళ్ళను విమానాశ్రయం నిర్మాణ సంస్థ వేసింది. కాని ఈ 33 సెంట్లుకు సంబంధించిన పరిహారం పక్క రైతుకు చెల్లించేసి ఈమె భూమిని తీసుకునే ప్రయత్నం చేశారు. 27 సెంట్లుకు పరిహారం చెల్లించి అదనంగా మరో 33సెంట్లు భూమిని తీసుకుంటున్నారంటు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసింది. అయినప్పటికీ అధికారులు పట్టించుకోలేదు. చివరకు ఆ మహిళా రైతు 33సెంట్లు చుట్టూ కంచె వేశారు. దీంతో ఈ మహిళా రైతు పడుతున్న ఇబ్బందులపై ప్రజాశక్తిలో ప్రత్యేక కథనాలు వచ్చాయి. దీంతో అప్పటి ఆర్‌డిఒ సూర్యకళ పరిహారం చెల్లించిన రైతు పొలంలో రెవెన్యూ అధికారులతో సర్వే చేసి 33 సెంట్లును అప్పగించారు. కాని పరిహారం పొందిన రైతు మాత్రం భూమి ఇచ్చేందుకు నిరాకరించాడు. ఆ మహిళా రైతు ఈ విషయాన్ని మళ్లీ అధికారుల దృష్టికి ఇటీవలి తీసుకువెళ్ళింది. ఈ విషయం పత్రికల్లో రావడంతో ప్రస్తుత ఆర్‌డిఒ దాట్ల కీర్తి స్పందించారు. వెంటనే పరిహారం పొందిన రైతుతోపాటు ఈ మహిళా రైతును ఇద్దరికీ నోటీసులు ఇచ్చి ఇటీవల సమావేశమయ్యారు. దీంతో పరిహారం పొందిన భూమిలో 27 సెంట్లు మాత్రమే అప్పగించేందుకు అంగీకరించాడు. దీనికి ఆ మహిళా రైతు ఒప్పుకోవడంతో ఆమెకు న్యాయం జరిగింది.

BEFORE THE HONOURABLE DEBTS RECOVERY TRIBUNAL AT VISAKHAPATNAM

O.A. 645 / 2024

Summons under sub-section (4) of section 19 of the Act, read with sub-rule (2A) of Rules 5 of RDBI Rules, 1993.

Between :
Union Bank Of India, Asset Recovery Branch, 4th Floor, Andhra Bank Building, R.R. Apparao Street, One Town, Vijayawada - 520001. ....Applicant
And
Mrs. Nusetti Naga Lakshmi Anuradha and another ....Defendants
To,
1. Nusetti Naga Lakshmi Anuradha, W/o. Thota Sreenivasa Rao, Flat No. FF1 & FF2, 1st Floor, Sri Lakshmi Residency, RS. No. 2/1, Yanamalakuduru, Vijayawada - 520007.
2. Thota Sreenivasa Rao, S/o. Venkata Siva Satyanarayana Flat No. FF1 & FF2, 1st Floor, Sri Lakshmi Residency, RS. No. 2/1, Yanamalakuduru, Vijayawada - 520007.

SUMMONS TO THE DEFENDANT D1 & D2 BY THE WAY OF PAPER PUBLICATION

WHEREAS, OA -645/2024 filed was listed before the Hon'ble Presiding Officer/Registrar on 04/ 12 /2024.
WHEREAS this Hon'ble Tribunal is pleased to issue summons/notice on the said Application under Section 19(4) of the Act, OA-645/2024 filed against you for. recovery of debts of **Rs. 35,33,242.62 Ps** (Application and copies of document enclosed). In accordance with Sub section (4) of the Sec 19 of the Act, you the defendant are directed as under :-
(1) To show cause within 30 days of the service of summons as to why relief prayed for should not be granted;
(2) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application;
(3) You are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment;
(4) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and / or other assets and properties specified or disclosed under serial number 3A of the original application with out the prior approval of the tribunal;
(5) You shall not be liable to account for the sale proceeds realized by the sale of secured assets or other assets and properties in the ordinary course of the business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institution holding security interest over such assets.
You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and to appear before Presiding Officer/Registrar on **04/ 12/ 2024** at 10.30 A.M failing the application shall be heard and
Given under my hand and the seal of this Tribunal on this date 14th November, 2024.

Sd/- Signature of the Officer,
Authorized to issue summons

यूनियन बैंक ऑफ इंडिया भारत सरकार का उपक्रम | యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ప్రాంతీయ కార్యాలయము, మచిలీపట్నం

బంగారు నగల వేలం ప్రకటన

ఇందుమూలంగా తెలియజేయుట ఏమనగా మా బ్యాంకు ద్వారా బంగారు నగలు తాకట్టు పెట్టి తీసుకున్న ఋణములు ఎన్ని నోటీసులు పంపిననూ దిగువ తెలిపినవారు తమ బాకీలను చెల్లించిచుండలేదు మరియు ఋణము చెల్లించవలసిన కాలము గతించినందున, సదరు బంగారునగలు **ది. 22-11-2024, శుక్రవారం, సాయంత్రం 04.00 గం॥లకు** మా బ్రాంచి ఆవరణలో బహిరంగ వేలము వేసి వారి పేరునయున్న బకాయిలకు జమకట్టుకొనబడును. వేలములో పాల్గొనదలచినవారు **ది. 22-11-2024, మధ్యాహ్నం 02.00 గం॥లలోపు తమ గుర్తింపుకార్డును చూపి రూ. 5,000/- లు** ధరావత్తుగా చెల్లించవలయును. ఎట్టికారణము చూపకనే వేలమును రద్దుచేయుటకు గానీ, వాయిదా వేయుటకు గానీ బ్యాంకు వారికి పూర్తి అధికారము కలదు. వేలము వేసినా కూడా బకాయి రద్దుకాని యెడల మిగిలిన బకాయి మరియు ఇతర ఖర్చులు కొరకు వారిపై చట్టరీత్యా తగుచర్య తీసుకొని మిగిలిన బయాయిలను వసూలు చేయబడును. ఈ దిగువ పేర్కొనబడిన ఖాతాదారులలో ఎవరైనా మరణించిన యెడల వారి వారసులకు ఈ వేలము నోటీసు వర్తిస్తుంది.

క్రమ. సం.	లోను ఖాతా నెంబరు	ఖాతాదారుని పేరు మరియు చిరునామా	మొత్తం తూకం గ్రాముల్లో
		చల్లపల్లి బ్రాంచి	
1.	007416540005589	**గుత్తికొండ నవీన్,** తండ్రి : పూర్ణ చంద్రరావు, 5-54, మేకవారిపాలెం, చల్లపల్లి మండలం, కృష్ణా జిల్లా - 521126	85.30
		జవ్వార్‌పేట బ్రాంచి	
1.	027216630001131	**అరసవల్లి సతీష్,** హెచ్.నెం. 5/165-2, జవ్వార్‌పేట, మచిలీపట్నం	6.19
2.	027216540001325	కొప్పర్తి ఎన్.వి.ఆర్. దివ్యశ్రీ, హెచ్.నెం.23/21, గవర్నమెంట్ హాస్పిటల్ రోడ్డు, రామానాయుడుపేట, మచిలీపట్నం,	39.00
		పోరంకి బ్రాంచి, విజయవాడ	
1.	330006540223884	**అంజనివేలి రతీష్ కుమార్,** తండ్రి:శశిధరన్ నాయర్, డి.నెం. 29-27-40-1, ప్రభు నిలయం, బకింగ్‌హాంపేట, సూర్యనారాయణ వీధి.	9.70
2.	330006540216032	దాసరి శరత్ చంద్ర, తండ్రి : వెంకటేశ్వరరావు, డి.నెం. 3-40, టీచర్స్ కాలనీ, తాడిగడప	38.00
3.	330006540216222		20.10
4.	330006540216796		8.0
5.	330006630000332	**సోమిరెడ్డి జయ,** భర్త : సోమిరెడ్డి రాజు, డి.నెం. 2-49, పోరంకి రూరల్	19.0
6.	330006540222013	**టాటా భాగ్య లక్ష్మి అలియాస్,** భర్త :టి.విశ్వేశ్వరరావు, డి.నెం. 1.264, పోరంకి, కృష్ణా జిల్లా.	28.2
		ఉయ్యూరు యు.బి.ఐ. బ్రాంచి	
1.	639606540012931	**వి. సుధారాణి,** కేరాఫ్. వి. జగదీష్, హెచ్.నెం.8-200, హనుమాన్ నగర్, కాటూరు రోడ్డు, ఉయ్యూరు, కృష్ణా, పిన్-521165	64.00
		నాగాయలంక బ్రాంచి	
1.	037616540011676	**కొల్లల రమేష్,** తండ్రి : వెంకటేశ్వరరావు, డి.నెం. 3-47, మండపాకల, కోడూరు మండలం.	30.00
		తాడిగడప బ్రాంచి	
1.	119316540003291	**తమ్మూ హేమ నాగ కుమార్,** తండ్రి : రాంబాబు, డి.నెం. 2-55, పెనమలూరు, కృష్ణా జిల్లా, ఎపి-521139	5.50
		జిల్లా పరిషత్ బ్రాంచి	
1.	115516540000345	**శ్రీ రామ చంద్ర మూర్తి కొల్లేరు,** తండ్రి : కె.ఆదినారాయణ, డి.నెం. 15-530/2, సింగరాజు వారి వీధి, ఈడేపల్లి, మచిలీపట్నం	37.50
		చిన్నాపురం బ్రాంచి	
1.	078316540005654	**విట్టంశెట్టి గణేష్,** తండ్రి : వెంకటపతిరావు, చిన్నాపురం, మచిలీపట్నం, ఎపి-521001	19.50

తేది. 16-11-2024, ప్రదేశం : మచిలీపట్నం సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రీజనల్ ఆఫీస్, మచిలీపట్నం

సమస్యల్లో గెస్ట్ లెక్చరర్లు

- నేటికీ అరకొర జీతాలే శరణ్యం
- ఉద్యోగ భద్రత లేక ఆందోళన
- అర్థిక ఇబ్బందులతో సతమతం

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పదేళ్లుగా పని చేస్తున్నా రూ.10 వేలు మించి వేతనం రావడం లేదని పలువురు అతిథి అధ్యాపకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధరలు ఆకాశాన్నంటుతున్నా తమ వేతనాల్లో దశాబ్ద కాలంగా ఎటువంటి మార్పు లేదని ఆవేదన చెందుతున్నారు. శ్రమకు తగిన ఫలితం దక్కక అనేక అవస్థలు పడుతున్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, గెస్ట్ అధ్యాపకుల సమస్యలపై నిరంతరం పనిచేస్తున్న పిడిఎఫ్ ఎంఎల్‌సిలు మాత్రమే తమ సమస్యలపై గళం విప్పుతున్నారన్నారు. దీనిపై అధికార పార్టీ ఎంఎల్ఎలూ స్పందించాలని వారు కోరుతున్నారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 100 మంది, డిగ్రీ కాలేజీల్లో 230 మంది, ఎపి సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలల్లో 170 మంది అతిథి అధ్యాపకులు (గెస్ట్ లెక్చరర్లు) పని చేస్తున్నారు. కళాశాలల్లో అధ్యాపకుల కొరత కారణంగా 2014లో ప్రభుత్వం వీరిని నియమించింది. జూనియర్ కళాశాలల వారికి గంటకు రూ.150, డిగ్రీ వాళ్లకు రూ.200, గురుకుల పాఠశాలల్లో టిజిటిలకు రూ.141, పిజిటిలకు గంటకు రూ.161 వంతున రోజుకు ఎన్ని గంటలు బోధిస్తే అన్ని గంటల వంతున లెక్కించి గౌరవ వేతనంగా ప్రభుత్వం చెల్లిస్తోంది. ఒక్కొక్కరు నెలకు సగటున 120 నుంచి 130 గంటలు బోధిస్తున్నారు. అయితే నెల వేతనానికి పరిమితి విధించడంతో ఎన్ని ఎక్కువ గంటలు పని చేసినా పరిమిత వేతనం చెల్లించేలా నిబంధనలు విధించారు. ఆరు నెలల కితం ప్రభుత్వం డిగ్రీ, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో పని చేస్తున్న వారికి వేతనాలు పెంచి అమలు చేసింది. కాని జూనియర్ కాలేజీల్లో పని చేస్తున్న వారిని మాత్రం గాలికొదిలేసింది.

రూ.10 వేలు వేతనంతో సరి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంట్రాక్ట్ వ్యవస్థని 2012లో అప్పటి ప్రభుత్వం నిలిపేసింది. ఆ సమయంలో ఇంటర్మీడియట్ వ్యవస్థలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయకుండా అప్పటి టిడిపి ప్రభుత్వం ఈ గెస్ట్ ఫ్యాకల్టీ వ్యవస్థను తెరపైకి తెచ్చింది. విభజన అనంతరం తెలంగాణలో ఇంటర్మీడియట్ వ్యవస్థలో పనిచేసే అతిథి అధ్యాపకులకు రూ.10 వేల నుంచి వేతనాన్ని రూ.21,600కి పెంచింది. ఆ తర్వాత కాలంలో మరోసారి దీన్ని రూ.28 వేలకు పెంచింది. కాని ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం అతిథి అధ్యాపక వ్యవస్థ కొనసాగుతున్నా నాటి నుంచి నేటి వరకూ రూ.10 వేలు మాత్రమే వేతనంగా ఇస్తుంది. ఇంటర్మీడియట్ వ్యవస్థలో పనిచేసే గెస్ట్ ఫ్యాకల్టీల విషయంలో జీతాల చెల్లింపుల్లో భారీ వ్యత్యాసం కన్పిస్తోంది. జూనియర్ కళాశాలల్లో పనిచేసే అతిథి అధ్యాపకులకు రూ.10 వేలతో సరిపెడితే ఇదే వ్యవస్థలో ఉన్న బిసి వెల్ఫేర్‌లో టిజిటిలకు రూ.19 వేలు, పిజిటిలకు రూ.24 వేలు, సోషల్ వెల్ఫేర్ టిజిటిలకు రూ.19,350, పిజిటిలకు రూ.24,100, జెఎల్‌లకు రూ.26 వేలు ఇస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేసే వారికి మాత్రం రూ.57,100, పార్ట్ టైం అధ్యాపకులకు రూ.37,100, ఎంటిఎస్‌లకు రూ.57,100తో బాటు డిఎను కూడా ఇస్తున్నారు. జూనియర్ కళాశాలల్లో గెస్ట్ లెక్చరర్లకు మాత్రం పదేళ్ల క్రితం నాటి పద్ధతినే అవలంబిస్తూ గంటల ప్రాతిపదికన రూ.10వేలు మించకుండా వేతనం ఇస్తున్నారు. ఒకే వ్యవస్థలో విద్యా అర్హతలు, పనిచేసే విధానంలో సమానంగా ఉన్నప్పటికీ వేతనంలో వ్యత్యాసాలు ఉండటంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

సుప్రీంకోర్టు చెప్పినా...

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీం కోర్టు ఆదేశాలిచ్చినా ఇక్కడ ఇంటర్మీడియట్ వ్యవస్థలో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులకు మాత్రం కనీస వేతనం ఇవ్వకపోవడం శోచనీయమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వంలో పలువురికి వేతనాలు పెంచినా తమకు మాత్రం పెంచకుండా అన్యాయం చేసిందని విమర్శిస్తున్నారు. ఏ రోజుకైనా తమ జీవితాలను బాగు చేస్తుందని ఆశా భావంతో పని చేస్తున్నారు. ప్రస్తుత జీవన ప్రమాణాలను దృష్టిలో ఉంచుకుని తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

పెరుగుతున్న ధరలతో ఇబ్బందులు

ప్రభుత్వం జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న గెస్ట్ అధ్యాపకుల సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహ రిస్తుంది. అన్ని రకాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. పదేళ్లలో ధరలు పదిరెట్లకుపైగా పెరిగాయి. గ్యాస్, పెట్రోలు, కరెంటు ఛార్జీలు, ఆర్‌టిసి బస్సు ఛార్జీలు అదనం. ఈ నేపథ్యంలో గెస్ట్ లెక్చరర్లకు ప్రస్తుతం ఇస్తున్న వేతనానికి, పెరిగిన ధరలతో ఏమాత్రం సంబంధం లేకుండా ఉంది. దీంతో కుటుంబ పోషణ భారమైంది. ప్రభుత్వం ఇచ్చే రూ.10వేలు ఇంటి అద్దెలు, కరెంటు, ఇతర బిల్లులకే సరిపోవడం లేదు. దీంతో అప్పులు చేసి కుటుంబాలను పోషించుకోవాల్సిన పరిస్థితి దాపురించిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అన్నమయ్య జిల్లాలో క్షుద్రపూజలు

- డాక్టర్‌తో కలిసి పాల్గొన్న కదిరి వైసిపి నాయకుడు
- గుప్తనిధుల కోసమేనన్న అనుమానాలు
- పోలీసుల అదుపులో నిందితులు..?

ప్రజాశక్తి - కదిరి టౌన్

సత్యసాయి జిల్లా కదిరికి చెందిన ఓ వైసిపి నాయకుడు అన్నమయ్య జిల్లా బి. కొత్తకోట మండలంలోని ఓ పురాతన దేవాలయంలో శనివారం తెల్లవారుజామున క్షుద్రపూజలు చేస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. మదనపల్లికి చెందిన ఓ డాక్టర్‌తో కలసి గుప్తనిధుల తవ్వకాల్లో భాగంగా క్షుద్రపూజలు చేస్తూ పట్టుబడినట్లు తెలిసింది. ఈఘటనకు సంబంధించి విశ్వసనీయంగా తెలిసిన వివరాల మేరకు.. కదిరికి చెందిన వైసిపి నాయకుడు వజ్రభాస్కర్‌రెడ్డి, మదనపల్లికి చెందిన ఓ డాక్టర్ ఎ.వి.సుబ్బారెడ్డి కలసి అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలోని అటవీ ప్రాంతంలో ఉన్న ఓ పురాతన దేవాలయం వద్ద శనివారం తెల్లవారుజామున గుప్త నిధుల కోసం క్షుద్రపూజలు నిర్వహిస్తున్నారు. అది గమనించిన చుట్టుపక్కల గ్రామాల వారు వారిని ఘటనాస్థలంలోనే నిలదీశారు. అక్కడ జరుగుతున్న తతంగాన్ని పోలీసులకు సమాచారమందించారు. దీంతో వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఇదిలా ఉండగా కదిరికి చెందిన వైసిపి నాయకుడు వజ్రభాస్కర్‌రెడ్డిపై స్థానికంగా పలు ఆరోపణలు ఉన్నాయి. ప్రజాసేవకుడిగా చెలామణి అవుతూ దేవుడి మాన్యం భూములను దోచుకోవటానికి కుట్ర పన్నారన్న ఆరోపణలు ఉన్నాయి. గతంలో కదిరికి చెందిన ఓ వ్యాపారి ఆస్తిని కాజేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

జీడిపిక్కల ఫ్యాక్టరీ మూత

ప్రజాశక్తి - ఏలేశ్వరం (కాకినాడ)

కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలంలోని చిన్నింపేట జీడి పిక్కల ఫ్యాక్టరీ శుక్రవారం రాత్రి అకస్మాత్తుగా యాజమాన్యం లే ఆఫ్ ప్రకటించి తాళాలు వేసి పరారైంది. ఈ నేపథ్యంలో కర్మాగారంలో పని చేస్తున్న కార్మికులు రోడ్డున పడ్డారు. కర్మాగారం వద్ద కార్మికులు బైఠాయించి నిరసన తెలిపారు.

ఈ విషయమై బోర్డు సభ్యులు రమేష్‌కు పలువురు కార్మికులు ఫోన్ చేయగా ఈ నెల 23న వచ్చి మాట్లాడతానని, అప్పటి వరకూ రావలసిన వేతనాలు, ఇతర బకాయిలను చెల్లిస్తామని తెలిపారు. రాత్రికి రాత్రి కర్మాగారం మూసివేస్తే తమ కుటుంబాలు ఎలా పోషించుకోవాలని కార్మికులు ఆందోళన చెందుతున్నారు. కార్మికులు తాము పని చేసిన కాలంలో సంవత్సరానికి రెండు లక్షల రూపాయలు నష్టపరి హారాన్ని యాజమాన్యం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. కార్మిక శాఖ అధికారులు వెంటనే స్పందించి కార్మికులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఫ్యాక్టరీని ప్రభుత్వమే నడపాలి

ఆకస్మికంగా లే ఆఫ్ ప్రకటించి 300 కుటుంబాలను రోడ్డు పడేసిన ఏలేశ్వరం మండలం చిన్నింపేట జీడిపిక్కల ఫ్యాక్టరీని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని కొనసాగించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దువ్వా శేషబాబ్జి, చెక్కల రాజకుమార్, మండల ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు ఓ ప్రకటనను విడుదల చేశారు. జీడిపిక్కల ఫ్యాక్టరీని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని కార్మికులకు రావలసిన పిఎఫ్, ఇఎస్ఐతోపాటు కనీస వేతనాలు చెల్లించాలన్నారు. లాభాలలో నడుస్తున్న జీడి పిక్కల ఫ్యాక్టరీని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - చింతపల్లి (అల్లూరి జిల్లా)

అల్లూరి జిల్లా చింతపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫిజిక్స్ అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యురాలు డాక్టర్ ఎం విజయ భారతి అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ, ఎమ్మెస్సీ ఫిజిక్స్‌లో 55 శాతంతో పీజీ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. నెట్, స్లెట్, పిహెచ్‌డిలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు సర్టిఫికెట్లతో 19 తేదీన (మంగళవారం) కళాశాలలో సంప్రదించాలని, డెమో, ఇంటర్వ్యూ ఆధారముగా అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

డెల్టా ఆధునికీకరణ కదిలేనా..!

- ఐదేళ్లుగా పడకేసిన పనులు
- పంట కాల్వలు పూడుకుపోయి నీరు పారని దుస్థితి
- ప్రతియేటా వర్షాలకు వేల ఎకరాల్లో పంట ముంపు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 80 శాతం వ్యవసాయమే జీవనాధారం. వ్యవసాయ రంగానికి అత్యంత ప్రధానమైన డెల్టాలోని పంట కాలువల ఆధునికీకరణ గురించి మాత్రం ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రతియేటా వర్షాలు, వరదలు, తుఫాన్లకు వేలాది ఎకరాల్లో పంట నష్టపోయి రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. ప్రస్తుత ఖరీఫ్‌లో మూడుసార్లు విరుచుకుపడిన వరదలు, వర్షాలకు 29 వేల ఎకరాల్లో పంటను రైతులు కోల్పోయారు. రూ.27 కోట్లు మేర పంట నష్టం అందించాలని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. వైసిపి ఐదేళ్ల పాలనలో డెల్టా ఆధునికీకరణ ఊసే లేకుండాపోయింది. దీంతో పంట కాలువలన్నీ మెరకదేరి నీరు కిందకు పారని దుస్థితి నెలకొంది. చిన్నపాటి వర్షానికి సైతం పంట పొలాలు మునిగిపోతున్నాయి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలకు 11 ప్రధాన కాలువలు, 300కుపైగా ఉపకాలువ ద్వారా సాగునీరు అందుతోంది. రెండు జిల్లాల్లో దాదాపు ఐదు లక్షల ఎకరాల వరకూ డెల్టా ఆయకట్టుగా ఉంది. ప్రతియేటా డెల్టా ఆధునికీకరణ పనులకు సంబంధించి ప్రతిపాదనలు తయారు చేసి అధికారులు ప్రభుత్వానికి నివేదించడం, వాటిని పాలకులు పక్కన పెట్టేయడం పరిపాటైంది.

ఆధునికీకరణ పనులు జరగకపోవడంతో ఖరీఫ్‌లో వరదల ముంపు, దాళ్వాలో సాగునీటి ఎద్దడి సమస్యతో రైతులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. తూడు, గుర్రపుడెక్క తొలగింపు వంటి పనులు తూతూమంత్రంగా సాగించి చేతులు దులుపుకుంటున్న పరిస్థితి ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, జలవనరుల శాఖ మంత్రిగా జిల్లాకు చెందిన నిమ్మల రామానాయుడు ఉండటంతో ఈ ఏడాదైనా డెల్టా ఆధునికీకరణ పనులు జరిగేనా అనే చర్చ రైతుల్లో సాగుతోంది. డెల్టా ఆధునికీకరణ పనులు చేయాలంటే ఇప్పటి నుంచే ప్రత్యేక ప్రణాళిక అత్యంత ముఖ్యమనే చర్చ సాగుతోంది.

జనవరిలో టెండర్లు పూర్తయితేనే పనులు ముందుకు

ప్రతియేటా నవంబర్ మూడో వారంలో జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశాలు జరుగుతాయి. ఈ సమావేశానికి మంత్రులు, ఎంఎల్ఎలు, జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు పాల్గొంటారు. దాళ్వాకు సాగునీటి సరఫరా, తాగునీటికి సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపైనా, డెల్టా ఆధునికీకరణ పనులపై చర్చించి నిర్ణయం తీసుకుంటారు. ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ నేపథ్యంలో సాగునీటి పారుదల సలహా మండలి సమావేశాలు మమ అన్నట్లు సాగుతున్నాయి. ఇప్పటికే పశ్చిమలో సాగునీటి సలహా మండలి సమావేశం పూర్తయ్యింది. ఏలూరు జిల్లాలో నిర్వహించాలని తలపెట్టి వాయిదా వేశారు. ఇక్కడ కూడా కొద్దిరోజుల్లో జరిగే అవకాశం ఉంది. ప్రజాప్రతినిధులు లేకపోవడంతో ఆధునికీకరణ పనులపై చర్చ లేకుండాపోయింది. ఈ ఏడాది పశ్చిమలో రూ.310 కోట్లు, ఏలూరు జిల్లాలో దాదాపు రూ.160 కోట్లు విలువైన పనులకు సంబంధించి అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. వీటిని ఆమోదిస్తేనే డెల్టా ఆధునికీకరణ పనులు జరిగే అవకాశం ఉంటుంది. డిసెంబర్ నెలాఖరులోపు ఆధునికీకరణ పనులకు సంబంధించిన ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోద ముద్ర వేయాల్సి ఉంది. అప్పుడే జవవరిలో టెండర్లు పిలిచేందుకు అవకాశం ఉంటుంది. జనవరిలోపు టెండర్ల ప్రక్రియ పూర్తయితేనే డెల్టా ఆధునికీకరణ పనులు ముందుకు సాగుతాయి. పశ్చిమలో జరిగిన జిల్లా సాగునీటి పారుదల సలహా మండలి సమావేశంలో ఏప్రిల్ 15న కాలువలు మూసివేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. మళ్లీ జూన్ ఒకటిన కాలువలకు నీరు విడుదల చేయనున్నారు. జనవరి నెలాఖరులోపు టెండర్ల ప్రక్రియ పూర్తి చేస్తే కాలువలు మూసివేసిన వెంటనే ఆధునికీకరణ పనులు చేపట్టేందుకు అవకాశం ఉంటుంది. ప్రభుత్వం ఈ విషయంలో ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందోననే చర్చ రైతుల్లో సాగుతోంది. ఈ ఏడాదైనా డెల్టా ఆధునికీకరణ పనులు చేయాలని రైతులు కోరుతున్నారు.

यूनियन बैंक ऑफ इंडिया भारत सरकार का उपक्रम | యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ప్రాంతీయ కార్యాలయము, విజయవాడ

బంగారు నగల వేలం ప్రకటన

ఇందుమూలంగా తెలియజేయుట ఏమనగా మా బ్యాంకు ద్వారా బంగారు నగలు తాకట్టు పెట్టి తీసుకున్న ఋణములు ఎన్ని నోటీసులు పంపిననూ దిగువ తెలిపినవారు తమ బాకీలను చెల్లించిచుండలేదు మరియు ఋణము చెల్లించవలసిన కాలము గతించినందున, సదరు బంగారునగలు **ది. 22-11-2024, శుక్రవారం, సాయంత్రం 04.00 గం॥లకు** మా బ్రాంచి ఆవరణలో బహిరంగ వేలము వేసి వారి పేరునయున్న బకాయిలకు జమకట్టుకొనబడును. వేలములో పాల్గొనదలచినవారు **ది. 22-11-2024, మధ్యాహ్నం 02.00 గం॥లలోపు తమ గుర్తింపుకార్డును చూపి రూ. 5,000/- లు** ధరావత్తుగా చెల్లించవలయును. ఎట్టికారణము చూపకనే వేలమును రద్దుచేయుటకు గానీ, వాయిదా వేయుటకు గానీ బ్యాంకు వారికి పూర్తి అధికారము కలదు. వేలము వేసినా కూడా బకాయి రద్దుకాని యెడల మిగిలిన బకాయి మరియు ఇతర ఖర్చులు కొరకు వారిపై చట్టరీత్యా తగుచర్య తీసుకొని మిగిలిన బయాయిలను వసూలు చేయబడును. ఈ దిగువ పేర్కొనబడిన ఖాతాదారులలో ఎవరైనా మరణించిన యెడల వారి వారసులకు ఈ వేలము నోటీసు వర్తిస్తుంది.

క్రమ. సం.	లోను ఖాతా నెంబరు	ఖాతాదారుని పేరు మరియు చిరునామా	మొత్తం తూకం గ్రాముల్లో
		ఆగిరిపల్లి బ్రాంచి	
1.	000316540006760	పసులేటి లక్ష్మీకుమారి	69.0
2.	000316540006761	పసులేటి లక్ష్మీకుమారి	44.0
		భవానీపురం బ్రాంచి	
1.	124016540002825	గంపసంతల జయకృష్ణ	54.0
		ఎనికేపాడు బ్రాంచి, విజయవాడ	
1.	329806540070404	తోట నాగసాయి రాజశేఖర్	54.8
		ఇబ్రహీంపట్నం బ్రాంచి	
1.	102716540001397	తెలగతోట సింగయ్య	21.8
2.	102716630000660	జరపాల గీతా పవార్	15.5
		లోటస్ ల్యాండ్‌మార్క్ బ్రాంచి	
1.	222016540000724	కారుమంచి శ్రీధర్	63.8
2.	222016630000489	కారుమంచి శ్రీధర్	27.6
3.	222016540000735	కారుమంచి శ్రీధర్	16.9
		నిడమానూరు బ్రాంచి	
1.	087716630000041	కొమ్మినేని భారతి	39.0
2.	087716540001139	కొమ్మినేని భారతి	31.0

తేది. 16-11-2024, ప్రదేశం : విజయవాడ సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రీజనల్ ఆఫీస్, విజయవాడ

పవర్ గ్రిడ్
POWERGRID

నోటీసు

1. 2019-24 కోసం ట్రాన్స్‌మిషన్ టారిఫ్‌ను సరిచేయడానికి మరియు 2024-29 కోసం ట్రాన్స్‌మిషన్ టారిఫ్‌ను నిర్ణయించడం కొరకు **పిటిషన్-1 :** సెంట్రల్ సెక్టార్ సబ్-స్టేషన్‌ల కోసం ఫైబర్ ఆప్టిక్ కమ్యూనికేషన్ సిస్టమ్ మరియు జనరేటింగ్ స్టేషన్ ; **పిటిషన్-2 :** దక్షిణ ప్రాంతంలో ఇప్పటికే ఉన్న యూనిఫైడ్ లోడ్ డిస్పాచ్ అండ్ కమ్యూనికేషన్ (యుఎల్‌డిసి) మైక్రోవేవ్ లింక్‌లకు బదులుగా ఫైబర్ ఆప్టిక్ కమ్యూనికేషన్ సిస్టమ్ (847.124 కి.మీ.)
2. పైన పేర్కొన్న ట్రాన్స్‌మిషన్ సిస్టం యొక్క లబ్ధిదారులు: **(a)** TANGEDCO **(b)** TSNPDCL **(c)** KSEB **(d)** TSSPDCL **(e)** గోవ విద్యుత్ శాఖ **(f)** పాండుచెర్రి విద్యుత్ శాఖ **(g)** APEDCL **(h)** APSPDCL **(i)** CESC **(j)** MESCOM **(k)** BESCOM **(l)** GESCOM **(m)** HESCOM **(n)** APCPDCL **(o)** APTRANSCO **(p)** NLC **(q)** NTPC **(r)** NPCIL **(s)** NTECL **(t)** MEPL **(u)** SEL & **(v)** LANCO
3. టారిఫ్ వివరాలు :

ఎ) **2019-24 బ్లాక్** (రూ. లక్షలలో)

పిటీషన్ నం.	ఆస్తి వివరాలు	డిఓసిఓ/ ఇసిఓడి	31.03.2024 నాటికి పూర్తి ఖర్చు	2019-20	2020-21	2021-22	2022-23	2023-24
				ట్ర్యూయింగ్ అప్ ఆధారంగా సవరించబడిన ఎఫ్‌సి				
పిటీషన్ -1	సంయుక్త ఆస్తి- 1-12	13.05.2016	15658.56	2876.63	2686.31	2759.83	2532.69	2629.99
	అసెట్- 13	20.04.2020	515.18	-	93.20	97.81	90.61	93.49
పిటీషన్ -2	అసెట్- 1	01.02.2013	743.21	105.06	104.99	104.9	104.92	105.13
	అసెట్- 2	01.04.2013	561.11	79.38	79.32	79.25	79.26	79.43
	అసెట్- 3	01.04.2013	1215.05	264.12	288.52	261.54	245.70	250.22
	అసెట్- 4	01.01.2014	238.44	49.58	54.42	49.05	45.92	46.86
	అసెట్- 5	01.01.2014	105.13	17.90	17.88	17.86	17.85	17.82
	అసెట్- 6	01.06.2015	59.12	8.68	8.35	8.00	7.68	7.36
	అసెట్- 7	01.06.2015	1.17	0.15	0.14	0.14	0.13	0.13
	అసెట్- 8	28.03.2018	97.55	20.17	21.34	18.89	17.20	16.97

బి) **2024-29** (రూ. లక్షల్లో)

పిటీషన్ నం.	ఆస్తి వివరాలు	31.03.2024 నాటికి పూర్తి ఖర్చు	2024-25	2025-26	2026-27	2027-28	2028-29
			వార్షియ స్థిర ఛార్జీలు (ఎఎఫ్‌సి)				
పిటీషన్ -1	సంయుక్త ఆస్తి	16173.74	2720.74	2622.08	2473.94	2191.89	2183.08
పిటీషన్ -2	అసెట్- 1	743.21	105.14	105.16	105.15	87.53	-
	అసెట్- 2	561.11	79.44	79.45	79.44	79.36	-
	అసెట్- 3	1215.05	252.34	252.36	252.26	251.84	30.78
	అసెట్- 4	238.44	47.02	47.05	47.01	46.96	35.2
	అసెట్- 5	105.13	17.82	17.83	17.82	17.81	13.35
	అసెట్- 6	59.12	7.03	6.71	6.51	6.46	4.62
	అసెట్- 7	1.17	0.12	0.12	0.11	0.11	0.08
	అసెట్- 8	97.55	16.28	15.73	15.20	14.69	14.18

4. ఒక కాపీ అప్లికేషన్‌ను తయారుచేసి సుంకం నిర్ధారణకు వెబ్‌సైట్ **www.powergrid.in** కు అప్లికేషన్‌ను పోస్టుచేయాలి.
5. సలహాలు మరియు అభ్యంతారాలు, అప్లికేషన్‌లో ఉన్న సుంకాన్ని నిర్ణయించే ప్రతిపాదనలపై ఏవైనా సూచనలు మరియు అభ్యంతారాలు ఉంటే, లబ్ధిదారుడితో సహా ఏ వ్యక్తి అయినా సెక్రటరీ, సెంట్రల్ ఎలక్ట్రిసిటి రెగ్యులేటరీ కమీషన్, 6వ, 7వ మరియు 8వ అంతస్తు, టవర్ బి, వరల్డ్ ట్రేడ్ సెంటర్, నౌరోజి నగర్, న్యూ ఢిల్లీ-110029 (లేదా వేరొక చిరునామ కమీషన్ కార్యాలయం ఎక్కడ ఉన్నదో అక్కడ) ఒక కాపీతో అప్లికెంట్ దీని కార్పొరేట్ ఆఫీస్ వద్ద నోటీసు ప్రచురించబడిన 30 రోజులలోగా తెలుపవచ్చు.

ప్రదేశం: గుర్‌గ్రామ్ సం/-
తేది: 15.11.2024 చీఫ్ జనరల్ మేనేజర్ (కమర్షియల్/ఆర్‌సి)

పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్
(భారత ప్రభుత్వ రంగ సంస్థ)
నమోదిత కార్యాలయం : బి-9, క్వాతబ్ ఇన్‌స్టిట్యూషనల్ ఏరియా, కట్వారియా సరయి, న్యూ ఢిల్లీ-110016.
కార్పొరేట్ కార్యాలయం: "సౌధామిని", ప్లాట్ నం.2, సెక్టార్-29, గుర్‌గ్రామ్, హర్యాణ -122001
www.powergrid.in సిఐఎన్: L40101DL1989GOI038121
ఎ మహరత్న పిఎస్‌యు

PG/CC/Notice-126/Advt.-161/2024-25 Interpub

SBI భారతీయ స్టేట్ బ్యాంక్
RACPC మంగళగిరి బ్రాంచ్
1వ అంతస్థు, సిఎ-5, సిఎఫ్‌సి ఏరియా, హోండా షోరూమ్ వెనుక, ఆటో నగర్, మంగళగిరి, గుంటూరు జిల్లా-522503.

స్వాధీనత ప్రకటన

APPENDIX IV రూల్ 8(1) సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్,2002, (స్థిరాస్తి కొరకు)

ఇందుమూలంగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 & సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువుకోవలసిన సదరు చట్టంలోని సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ **భారతీయ స్టేట్ బ్యాంక్, RACPC బ్రాంచ్, మంగళగిరి, గుంటూరు జిల్లా** అధీకృత అధికారిగా దిగువ సంతకందారు నోటిసులో పేర్కొన్న బకాయి **తేది.14.02.2024** నాటికి **HTL Loan A/c No. 39216664459**కు **రూ.27,15,570/- (అక్షరాల ఇరవై ఏడు లక్షల పదిహేను వేల ఐదు వందల డెబ్భై రూపాయలు మాత్రమే)** కాంట్రాక్చువల్ రేటు ప్రకారం వడ్డీతో సహా తిరిగి చెల్లించాల్సిందిగా సంభవించు ఖర్చులు, కాస్ట్స్, ఛార్జీలు మొ॥నవి సదరు నోటీసు అందిన తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **ఋణగ్రహీతలు: 1) శ్రీమతి కొండా రమ్యశ్రీ, భర్త: గుమ్మడి రాజేంద్రబాబు & 2) శ్రీ గుమ్మడి రాజేంద్రబాబు, తండ్రి: శరత్ బాబు,** సమీప డి.నెం.12-464, ఫ్లాట్ నెం.404, 4వ అంతస్థు, స్మార్ట్ హోమ్స్, కామధేను టవర్స్, సిఎస్ఆర్ కళ్యాణ మండపం రోడ్డు, ఆశ్రమం రోడ్డు, తాడేపల్లి, తాడేపల్లి మండలం, గుంటూరు జిల్లా-522501, ఆం.ప్ర., వారిని కోరుతూ **తేది.14.02.2024న డిమాండ్ నోటీసు** జారీచేసినారు.

సదరు డిమాండు నోటీసు జారీ చేసిన తరువాత ఋణగ్రహీత **రూ.2,12,444/-** చెల్లించియున్నారు అనంతరం **తేది.12.11.2024** నాటికి **HTLకు రూ.26,90,189/- (అక్షరాల ఇరవై ఆరు లక్షల తొంభై వేల నూట ఎనభై తొమ్మిది రూపాయలు మాత్రమే)** తదుపరి వడ్డీ, కాస్ట్స్, ఛార్జీలు మొ॥నవి ఋణగ్రహీత/హామీదారు బకాయి పడియున్నారు.

ఋణగ్రహీత సదరు ఋణాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనారు. ఋణగ్రహీతకు/హామీదారులకు మరియు సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా సదరు రూల్స్‌లో 8&9 తో చదివే సదరు యాక్టులోని సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ ఈ దిగువ సంతకందారు బ్యాంకునకు తనఖా ఉంచిన దిగువ వివరించిన ఆస్తిని **తేది.12.11.2024 న లాంఛనాత్మకంగా స్వాధీనం** చేసుకున్నారు.

సాధారణ ప్రజానీకానికి ముఖ్యముగా ఋణగ్రహీతకు / హామీదారులకు ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తితో ఎవ్వరు ఎట్టి లావాదేవీలు జరుపరాదు. సదరు ఆస్తులకు సంబంధించిన ఎట్టి లావాదేవీలైనను **తేది.12.11.2024** నాటికి **HTLకు రూ.26,90,189/- (అక్షరాల ఇరవై ఆరు లక్షల తొంభై వేల నూట ఎనభై తొమ్మిది రూపాయలు మాత్రమే) సంభవించు ఖర్చులు, కాస్ట్స్, ఛార్జీలు మరియు వడ్డీ మొ॥నవి భారతీయ స్టేట్ బ్యాంక్, RACPC బ్రాంచ్, మంగళగిరి, గుంటూరు జిల్లా** వారి ఛార్జికి లోబడి ఉంటాయి.

ఋణగ్రహీత & హామీదారుల సెక్యూర్డు ఆస్తుల విమోచనం కొరకు గడువు లభ్యతపై సదరు చట్టములోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) లోని నిబంధనలను గమనించగలరు.

స్థిరాస్తి వివరములు

షెడ్యూల్-ఎ: గుంటూరు జిల్లా, మంగళగిరి సబ్ రిజిస్ట్రీ, తాడేపల్లి మండలం, తాడేపల్లి మున్సిపల్ ఏరియా, తాడేపల్లి, ఆర్ఎస్ నెం.54/1ఎ లో ఉన్న సమీప డోర్ నెం.12-464లోని మొత్తం 861 1/2 చ॥గ॥ 720.32 చ॥మీ॥ల స్థలంలో అవిభాజ్యపు ఉమ్మడి వాటా 43.075 చ॥గ॥ లేదా 36.57 చ॥మీ॥. **అపార్ట్‌మెంట్‌నకు హద్దులు: తూర్పు:** గుండపల్లి సుశీల, మువ్వ వెంకట సుబ్బమ్మ గార్ల స్థలం, **దక్షిణం:** మద్దిరాల కమలా సమిత గారి స్థలం, **పడమర:** 33.0అ॥ వెడల్పు రోడ్డు, **ఉత్తరం:** చెరుకూరి ప్రణీత గారి ఆస్తి.

షెడ్యూల్-బి: తెలియపర్చిన మొత్తం స్థలంలో "స్మార్ట్ హోమ్స్" అపార్ట్‌మెంట్‌లోని 4వ అంతస్థు, ప్లింత్ ఏరియా 1125 చ॥అ॥ (కామన్ ఏరియా, కార్ పార్కింగ్‌తో) ఫ్లాట్ నెం.404. ఈ ఆస్తి కొండా రమ్యశ్రీ, భర్త: గుమ్మడి రాజేంద్రబాబు గారికి చెందినది, డాక్యుమెంట్ నెం.1759/2020, తేది: 16.03.2020. **ఫ్లాట్‌నకు హద్దులు: తూర్పు:** ఓపెన్ టు స్కై, **దక్షిణం:** లిఫ్ట్ మరియు ఫ్లాట్ నెం.403కు అనుకుని ఉన్న ఓపెన్ టు స్కై, **పడమర:** కామన్ కారిడార్, **ఉత్తరం:** ఓపెన్ టు స్కై.

తేది : 12.11.2024 సం/- అధీకృత అధికారి
ప్రదేశం : మంగళగిరి భారతీయ స్టేట్ బ్యాంక్

టీమిండియాకు గాయాల బెడద

- శుభ్‌మన్ వేలికి గాయం
- పెర్త్ టెస్టుకు కష్టమే..?

పెర్త్ : బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ ప్రారంభానికి ముందు టీమిండియాను గాయాల బెడద వేధిస్తోంది. ప్రాక్టీస్ సందర్భంగా ఇప్పటికే ముగ్గురు ఆటగాళ్లు గాయాల బారిన పడ్డారు. తొలుత మాజీ సారథి విరాట్ కోహ్లీ గాయపడగా.. కుడి మోచేతికి బౌన్సర్ తగిలి కేఎల్ రాహుల్ నొప్పితో నెట్స్‌ను వీడాడు. తాజాగా యువ క్రికెటర్ శుభ్‌మన్ గిల్ సైతం వీళ్లను అనుసరించాడు. భారత బృందంలోని మరో జట్టుతో జరిగిన మ్యాచ్‌లో స్లిప్‌లో ఫీల్డింగ్ చేస్తూ క్యాచ్ పడుతుండగా గిల్ బొటనవేలికి బంతి బలంగా తాకింది. దాంతో, అక్కడి ఎముక విరగడంతో మైదానం వీడాడు. అయితే.. అతడి గాయం తీవ్రత గురించి పూర్తి సమాచారం లేదు. 'అవును.. శుభ్‌మన్ గిల్ బొటన వేలికి గాయమైంది. పెర్త్ టెస్టు సన్నాహక మ్యాచ్‌లో క్యాచ్ పట్టబోతుండగా బంతి తగిలి అతడు బాధ పడ్డాడు. దాంతో, బిసిసిఐ వైద్య బృందం అతడికి వెంటనే స్కానింగ్ పరీక్షలు నిర్వహించింది. అందులో గిల్ బొటన వేలి ఎముక విరిగినట్టు వైద్యులు నిర్ధారించారు. ఈ పరిస్థితుల్లో గిల్ పెర్త్ టెస్టులో ఆడడంపై సందేహాలు నెలకొన్నాయి' అని బిసిసిఐ అధికారి ఒకరు తెలిపాయి.

మణిపూర్‌లో హింసాగ్నికి మళ్లీ ఆజ్యం

- కేంద్రం తీరుతో ఆదివాసీల ఆగ్రహం
- అంతర్యుద్ధం తరహాలో ఘర్షణలు

ఇంఫాల్ : ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో గత పద్దెనిమిది నెలలుగా కొనసాగుతున్న హింస నేడు మరింత తీవ్ర రూపం దాల్చింది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల పలు ప్రాంతాల్లో సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టం (ఎఎఫ్ఎస్‌పిఎ) పునరుద్ధరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై ఆదివాసీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే బిజెపికి అనుకూలంగా ఉండే మెయితీ, కొండ ప్రాంతాల్లో ప్రాబల్యమున్న కుకీ గిరిజనుల మధ్య ఘర్షణలు అంతర్యుద్ధ పరిస్థితిని తలపిస్తున్నాయి. . కుకీలు అపహరించారని చెబుతున్న ఆరుగురు మెయితీల జాడ తెలియరాలేదు. శుక్ర, శనివారాల్లో బయట పడిన ఆరు మృతదేహాలు అపహరణకు గురైనవారివేనా అనేది ఇంకా నిర్ధారణ కాలేదు. డిఎన్ఎ పరీక్షలకు పంపామని పోలీసులు చెబుతున్నారు. ఇంతలోనే ఈ హత్యలకు నిరసనగా జిరిబామ్ జిల్లాలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ఇంఫాల్‌లో ఇద్దరు మంత్రులు, ముగ్గురు ఎమ్మెల్యేల ఇళ్ల ముందు నిరసనకారులు దాడి చేశారు. శాసనసభ్యుల ఇళ్లపై అల్లరి మూకలు దాడులు చేయడంతో జిరిబామ్ జిల్లాలో అధికారులు నిషేధాజ్ఞలు జారీ చేశారు. ఇంఫాల్ వెస్ట్, ఈస్ట్, బిష్ణుపూర్, తౌబల్, కక్చింగ్, కాంగ్‌పోక్పి, చురచంద్‌పూర్ జిల్లాల్లో రెండు రోజుల పాటు ఇంటర్నెట్, మొబైల్ డేటా సేవలను నిలిపివేశారు. లాంఫెల్ సనకీతెల్ ప్రాంతంలోని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సపమ్ రంజన్ నివాసంపై ఒక గుంపు దాడి చేసిందని సీనియర్ అధికారి తెలిపారు. ఇంఫాల్ పశ్చిమ జిల్లాలోని సగోల్‌బంద్ ప్రాంతంలో ముఖ్యమంత్రి ఎన్ బీరెన్ సింగ్ అల్లుడు, బిజెపి ఎమ్మెల్యే ఆర్‌కే ఇమో నివాసం ముందు నినాదాలు చేశారు. ముగ్గురిని హత్య చేసిన నిందితులను 24 గంటల్లోగా పట్టుకొని శిక్షించాలని డిమాండ్ చేశారు. కైషామ్‌థాంగ్ నియోజకవర్గ స్వతంత్ర శాసనసభ్యుడు సపం నిషికాంత సింగ్‌ను తిడ్డిమ్ రోడ్‌లోని ఆయన నివాసంలో కలవడానికి నిరసనకారులు అక్కడికి చేరుకున్నారు.

గత మంగళవారం పోలీసులు జరిపిన ఎన్‌కౌంటర్‌లో 11 మంది కుకీ గిరిజన వలంటీర్లు చనిపోయారు. వీరిని ఉగ్రవాదులు అని పోలీసులు చెబుతున్నారు. దీనిపై న్యాయ విచారణ జరిపించాలని కుకీ విద్యార్థి సంఘం నాయకులు మిన్‌లాల్ గాంగ్ట్ పేర్కొన్నారు. ఈ క్రమంలో ముగ్గురు మహిళలు, ముగ్గురు చిన్నారులను కుకీలు బందీలుగా తీసుకెళ్లినట్లు మెయితీలు ఆరోపిస్తున్నారు. అపహరణకు గురైనవారి మతదేహాలు శనివారం ఉదయం గుర్తించడంతో నిరసనాగ్ని రాజుకుంది.

సీలేరులో పెరుగుతున్న చలి

ప్రజాశక్తి -సీలేరు : సీలేరు పరిసర ప్రాంతాల్లో చలి తీవ్రత పెరుగుతోంది. సీలేరు, దారకొండ, దుప్పిలివాడ పంచాయతీల పరిధిలో శనివారం మంచు అధికంగా కురిసింది. పగటిపూట మబ్బులతో కూడిన వాతావరణం నెలకొంది. ఈ క్రమంలోనే స్వల్ప చిరుగాలులతో చలి ప్రారంభమైంది. తెల్లవారుజామున వాకింగ్‌కి వెళ్లేవారు చలి కారణంగా కాస్త ఇబ్బందులు గురవుతున్నారు. స్థానిక రెగ్యులేటరీ మెయిన్ డ్యాం పరిసర ప్రాంతాల్లో అధికంగా మంచు కురవడంతో ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల నుంచి వచ్చే వాహనదారులు తెల్లవారుజామున హెడ్ లైట్లు వేసుకొని ప్రయాణించాల్సి వస్తోంది.

FORM NO. 3
[See Regulation-15 (1) (a)/16(3)]
IN THE HONOURABLE DEBTS RECOVERY TRIBUNAL AT VISAKHAPATNAM

OA/803/2024

Summons under Sub-section (4) of section 19 of the Act read with sub-rule (2A) of Rule 5 of the Debts Recovery Tribunal (Procedure) Rules 1993
Bank of India, Arundalpeta branch of Guntur of A.P
Vs
M/s Palnadu Traders and another

To,
1) **M/s Palnadu Traders** rep by its Partner Mr. Nadendla Anil Kumar Partnership Firm D.No: 5-50,63/1, 6/14 Lane, Brodipeta, Guntur-522002.
2) **Mr.Nadendla Anil Kumar**,S/o Babu Rao, Door No.4-14-222,Anjaneyapeta, Amaravathi Road,Guntur,Andhrapradesh-522002 Phone-9985596232
3) **Master. Naga Sujay (Legal Heir of Mr. Nadendla Hari Rama Krishna)** S/o Nadendla Hari Rama Kishna represented by his Natural guardian **mother Mrs. Vadigineni Siva Leela Rani** D/o Narasimha Rao D.No. 16-18-1/1, Borlavari Street Old Guntur, Kothapeta ,Guntur, Andhrapradesh-522001 Phone: 8885780888
4) **Baby Sai Harsha (Legal Heir of Mr. Nadendla Hari Rama Krishna)** S/o Nadendla Hari Rama Kishna represented by his Natural guardian mother Mrs. Vadigineni Siva Leela Rani D/o Narasiha Rao D.No.16-18-1/1, Borlavari Street ,Old Guntur, Kothapeta Guntur, Andhrapradesh-522001 Phone: 8885780888
5) **Mrs. Vadigineni Siva Leela Rani** D/o Narasimha Rao D.No. 16-18-1/1, Borlavari Street ,Old Guntur, Kothapeta,Guntur, Andhrapradesh-522001 Phone: 8885780888 ---DEFENDANTS

SUMMONS BY WAY OF PAPER PUBLICATION TO SHOW CAUSE WHY THE RELIEF PRAYED FOR SHOULD NOT BE GRANTED

1. WHEREAS the applicant has instituted an application U/S 19 of the Recovery of Debts and Bankruptcy Act 1993 against you for the recovery of sum of **Rs.25,49,382.61ps (Rupees Twenty Five Lakhs Forty Nine Thousand Three Hundred Eight Two and Sixty one paisa)** together with current and future interest and other reliefs. You are hereby directed to appear before this Tribunal in person or through advocate or duly authorized representative on **22/11/2024 at 10.30 a.m.** to answer the claim.
2. You are directed to collect the OA copy along with the annexure on your appearance before the Tribunal
3. If you intend to file any documents, you may file the same with a list along with the written statement.
4. You should file your registered address and a memo of appearance when you enter appearance before the Tribunal either in person or by a pleader/Advocate duly instructed
5. Take notice that in default of your appearance on the day mentioned herein before, the proceedings will be heard and determined in your absence.

Given under my hand and the seal of this Tribunal on this the **24th day of October 2024**

Assistant Registrar
Debts Recovery Tribunal
Visakhapatnam

తమిళ్, ఢిల్లీ జట్ల గెలుపు

ప్రొ కబడ్డీ సీజన్-11

నోయిడా(యుపి): ప్రొ కబడ్డీ సీజన్-11లో తమిళ్ తలైవాస్, దబాంగ్ ఢిల్లీ విజయం సాధించాయి. తొలి మ్యాచ్‌లో తమిళ్ తలైవాస్ 46-31పాయింట్ల తేడాతో బెంగాల్ వారియర్స్‌ను, రెండో మ్యాచ్‌లో దబాంగ్ ఢిల్లీ 35-25పాయింట్ల తేడాతో బెంగళూరు బుల్స్‌ను చిత్తుచేశాయి. తమిళ్ జట్టులో విశాల్ ఛాహల్(12), బస్తామి(7)రైడ్ పాయింట్లు సాధించగా.. ట్యాకిల్స్‌లో మొయిన్(6), నితీశ్(6) రాణించారు. ఇక బెంగాల్ జట్టులో విశ్వాస్(9), నితిన్(8) రాణించారు. తమిళ్ తలైవాస్ జట్టు ఆరుసార్లు బెంగాల్ జట్టును ఆలౌట్ చేయగా.. ట్యాకిల్స్ రూపంలో 19పాయింట్లు దక్కాయి. ఇక ఢిల్లీ జట్టులో ఆషు మాలిక్(14) రైడ్ పాయింట్లు సాధించగా.. బెంగళూరు జట్టులో నితిన్(7) మాత్రమే రాణించాడు. దబాంగ్ ఢిల్లీ నాలుగుసార్లు బెంగళూరు బుల్స్‌ను ఆలౌట్ చేసింది. ఈ గెలుపుతో తమిళ్ జట్టు 10మ్యాచ్‌లు ముగిసేసరికి 27పాయింట్లతో 6వ స్థానంలో నిలిచింది.

ప్రొ కబడ్డీలో నేడు: తమిళ్ తలైవాస్ × హర్యానా స్టీలర్స్(రా.8.00గం॥లకు)
జైపూర్ పింక్ ప్యాంథర్స్ × పుణేరి పల్టన్స్(రా.9.00గం॥లకు)

ఆంధ్ర-హైదరాబాద్ రంజీమ్యాచ్ డ్రా

హైదరాబాద్: ఆంధ్ర-హైదరాబాద్ జట్ల మధ్య రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరిగిన రంజీట్రోఫీ మ్యాచ్ డ్రాగా ముగిసింది. నాలుగురోజుల ఆట ముగిసేసరికి ఇరుజట్లు రెండు ఇన్నింగ్స్‌ను పూర్తి చేయలేకపోయాయి. తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 301పరుగులు చేయగా.. ఆంధ్ర 448పరుగులు చేసింది. శనివారం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన హైదరాబాద్ జట్టు చివరిరోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోయి 193పరుగులు చేసింది. హైదరాబాద్ జట్టులో తన్మయ్ అగర్వాల్(95), అభిరథ్‌రెడ్డి(70) బ్యాటింగ్‌లో రాణించారు. దీంతో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యతతో ఆంధ్రకు మూడు పాయింట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ రషీద్‌కు దక్కింది.

మధ్యప్రదేశ్‌పై బెంగాల్ గెలుపు

టీమిండియాలో చోటుకోసం ప్రయత్నిస్తున్న బెంగాల్ బౌలర్ మహ్మద్ షమీ రెండో ఇన్నింగ్స్‌లో సత్తా చాటాడు. మధ్యప్రదేశ్‌పై తొలి ఇన్నింగ్స్‌లో నాలుగు వికెట్లు తీసిన షమీ.. రెండో ఇన్నింగ్స్‌లో మరో మూడు వికెట్లు కూల్చి బెంగాల్ గెలుపులో కీలకపాత్ర పోషించాడు. దీంతో 338పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన మధ్యప్రదేశ్ జట్టు 326పరుగులకు ఆలౌటైంది. దీంతో బెంగాల్ 11 పరుగుల తేడాతో గెలుపొందగా.. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ షాబాజ్‌కు దక్కింది.

రెండో టి20లోనూ ఆసీస్ గెలుపు

- సిరీస్ 2-0తో కైవసం

సిడ్నీ: పాకిస్తాన్‌తో జరిగిన రెండో టి20లోనూ ఆతిథ్య ఆస్ట్రేలియా జట్టు గెలిచి 2-0తో సిరీస్‌ను కైవసం చేసుకుంది. సిడ్నీ క్రికెట్ స్టేడియంలో శుక్రవారం జరిగిన రెండో టి20లో ఆస్ట్రేలియా జట్టు 13పరుగుల తేడాతో గెలిచింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 147పరుగులు చేయగా.. ఛేదనలో పాకిస్తాన్ 19.4ఓవర్లలో 134పరుగులకు ఆలౌటైంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్‌కు ఓపెనర్లు షార్ట్(32), ఫ్రేజర్(20) శుభారంభం అందించారు. ఆ తర్వాత కెప్టెన్ ఇంగ్లిస్(0) డకౌటైనా.. మ్యాక్స్‌వెల్(21) మరో సంచలన ఇన్నింగ్స్‌తో ఆదుకున్నాడు. టిమ్ డేవిడ్(18), హార్డీ(20) కూడా ఫర్వాలేదనిపించినా.. లోయర్ ఆర్డర్ బ్యాటర్లు నిరాశపరిచారు. దీంతో ఆసీస్ జట్టు 147పరుగులకే పరిమితమైంది. పాకిస్తాన్ బౌలర్లు రౌఫ్‌కు నాలుగు, అబ్బాస్ అఫ్రిది, ముషీమ్‌కు రెండు వికెట్లు దక్కాయి. స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో పాకిస్తాన్ ఓపెనర్ రిజ్వాన్(16), బాబర్(3), ఫర్హామ్(5), సల్మాన్(0) నిరాశపరిచారు. ఉస్మాన్ ఖాన్(52), ఇర్ఫాన్ ఖాన్(37) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించినా.. లోయర్ ఆర్డర్ బ్యాటర్లు ఒకరివెంట ఒకరు పెవీలియన్‌కు చేరారు. దీంతో పాక్ జట్టు 19.4ఓవర్లలో 134పరుగులకే పరిమితమైంది. ఆస్ట్రేలియా బౌలర్లు జాన్సన్‌కు ఐదు, జంపాకు రెండు, బార్టెఫ్‌కు ఒక వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ జాన్సన్‌కు దక్కింది. దీంతో మూడు టి20ల సిరీస్‌ను ఆస్ట్రేలియా 2-0తో చేజిక్కించుకోగా.. మూడో, చివరి టి20 హోబర్ట్ వేదికగా సోమవారం జరగనుంది.



టి20 సిరీస్ ట్రోఫీతో టీమిండియా ఆటగాళ్లు

టి20ల్లో భారత్ నెలకొల్పిన రికార్డులివే..!

జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాతో జరిగిన నాలుగు టి20ల సిరీస్‌ను భారత్ 3-1తో చేజిక్కించుకుంది. జోహన్నెస్‌బర్గ్ వేదికగా శుక్రవారం జరిగిన నాల్గో టి20లో భారత్ ఏకంగా 135పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో టీమిండియా పలు రికార్డులను తన పేర లిఖించుకుంది. ఒక టి20 మ్యాచ్‌లో ఇద్దరు భారత బ్యాటర్లు సెంచరీలు కొట్టడం ఇదే ప్రథమం. అలాగే టి20ల్లో 2వ వికెట్‌కు 210 పరుగుల భాగస్వామ్య రికార్డుతోపాటు భారత్ తరఫున ఏ వికెట్‌కైనా ఇదే అత్యధిక భాగస్వామ్యం. టి20ల్లో దక్షిణాఫ్రికాపై ఇదే అతిపెద్ద పార్టనర్‌షిప్‌గా రికార్డులకెక్కింది. ఇక అంతర్జాతీయ టి20 క్రికెట్‌లో రెండవ వికెట్‌కు ఇదే అత్యధిక భాగస్వామ్యంగా ప్రపంచ రికార్డు నమోదయింది. వీరిద్దరూ కలిసి 210 పరుగుల పార్టనర్‌షిప్‌ని కేవలం 93 బంతుల్లోనే నెలకొల్పడం మరో విశేషంగా ఉంది. ఒక టి20 సిరీస్‌లో ఇద్దరూ బ్యాటర్లు రెండు సెంచరీలు బాదడం కూడా ఇదే తొలిసారి.

పాల్ చేతిలో టైసన్ చిత్తు

న్యూయార్క్: దిగ్గజ బాక్సర్ మైక్ టైసన్‌కు ఓటమి ఎదురైంది. ఇరవై ఏళ్ల తర్వాత ప్రొఫెషనల్ బాక్సింగ్ రింగ్‌లోకి దిగిన మైక్‌టైసన్ యూ ట్యూబర్ జేక్ పాల్ చేతిలో పరాజయాన్ని చవిచూశాడు. హోరాహోరీగా సాగిన ఈ పోటీలో యూ ట్యూబర్ జేక్ పాల్ చేతిలో టైసన్ 74-78 తేడాతో పరాజయం చవిచూశాడు. 8 రౌండ్ల పాటు సాగిన ఈ బౌట్‌లో ఆరు రౌండ్లలో పాల్ గెలవగా.. మైక్ టైసన్ రెండులోనే గెలిచాడు. దీంతో 10-9, 10-9, 9-10, 9-10, 9-10, 9-10, 9-10, 9-10 తేడాతో పాల్ విజయం సాధించాడు. 2005లో కెవిన్ చేతిలో ఓటమి తర్వాత టైసన్ ప్రొఫెషనల్ బాక్సింగ్‌కు గుడ్‌బై చెప్పిన సంగతి తెలిసిందే. ఇప్పుడీ బౌట్‌లో తలపడటం కోసం టైసన్ సుమారు రూ.168 కోట్లు, పాల్ దాదాపు రూ.337 కోట్లు పొందనున్నారు. బౌట్ ప్రారంభానికి ముందు పాల్‌ను చెంపదెబ్బ కొట్టిన మైక్ టైసన్ పోరుపై ఆసక్తి పెంచాడు. అందుకుతగ్గట్టుగానే మొదటి రెండు రౌండ్లలో 58ఏళ్ల టైసన్ ఆధిపత్యం ప్రదర్శించాడు. కానీ, ఆ పట్టును చివరివరకూ కొనసాగించలేక పోయాడు. మూడో రౌండ్ నుంచి పుంజుకొన్న 27ఏళ్ల జేక్ పాల్ వరుసగా ఆరు బౌట్‌లలో గెలిచాడు.

నిడో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ nido HOME FINANCE
(గతంలో ఈడెల్వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ గా పేర్కొనబడినది)
నమోదిత కార్యాలయం : టవర్ 3, 5వ అంతస్తు వింగ్ 'బి', కోహినూర్ సిటీ మాల్, కోహినూర్ సిటీ, కిరోల్ రోడ్డు, కుర్ల (వెస్ట్), ముంబయి - 400 070.
రీజినల్ కార్యాలయం : 4వ అంతస్తు, జానకి అవెన్యూ, నం.1-11-220/15, బృందావన్ కాలనీ, ప్లాట్ నం.2, బేగంపేట, హైదరాబాద్-500 016

సర్ఫేసీ యాక్ట్, 2002 యొక్క రూల్ 8(1) క్రింద స్వాధీనతా నోటీసు

ఏదైతే, నిడో హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో ఈడెల్వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ గా పేర్కొనబడినది) యొక్క అధీకృత అధికారిగా క్రింది సంతకందారు, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ (సెకండ్) ఆర్డినెన్స్, 2002 (2002 యొక్క ఆర్డర్ 3) క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని డిమాండ్ నోటీసు జారీచేసి, ఇక్కడ దిగువ వివరించినట్లుగా రుణగ్రహీతలను సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొనబడిన మొత్తాలను చెల్లించు వాస్తవ తేదీ వరకు అన్ని ఖర్చులు, చార్జీలు మరియు వ్యయాలను తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది. సదరు రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలం చెందియున్నందున, ఇందుమూలంగా రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలకు ప్రకటన ఇవ్వడమేమనగా, సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువబడే సెక్షన్ 13(4) క్రింద దిగువ సంతకందారుకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని ఇందు క్రింద వివరించిన ఆస్తిని **లాంఛనప్రాయంగా** స్వాధీనంచేసుకున్నారు, మరియు ప్రత్యేకించి రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తులతో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తులతో ఏవేని లావాదేవీలు జరుపుటకు **నిడో హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో ఈడెల్వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ గా పేర్కొనబడినది)** కు తదుపరి వడ్డీతోపాటు ఇందు సూచించిన మొత్తాలను చెల్లించుటకు లోబడి ఉంటుంది.
రుణగ్రహీతలు, సహ-రుణగ్రహీతలు మరియు హామీదారులు, సెక్యూరిటీస్, బకాయి మొత్తాలు, డిమాండ్ నోటీసు పంపిన వివరాలు సెక్షన్ 13(2) క్రింద మరియు క్లెయించేసిన మొత్తాలు మరియు స్వాధీనతా తేది దిగువ ఇవ్వబడినవి :

1. రుణగ్రహీత, సహ-రుణగ్రహీత, హామీదారు పేరు మరియు చిరునామా, రుణ ఖాతా నం. మరియు రుణ మొత్తాలు :
గుజ్జుల నరేష్ (రుణగ్రహీత), గుజ్జుల మరియమ్మ (సహ రుణగ్రహీత), హౌ.నం.4-153, భుజబలపట్నం, కైకలూరు యు మన్ దల్, కృష్ణ-521340. ఎల్ఎఎన్ నం.: **LELRSTH0000021920** రుణ ఒప్పందం తేది : **10/01/2017**
రుణ మొత్తాలు : రూ. **9,00,000/-** (తొమ్మిది లక్షల రూపాయలు మాత్రమే)
ఎన్‌పిఎ తేది : **02-02-2024** డిమాండ్ నోటీసు తేది : 15/02/2024
బకాయి మొత్తాలు : రూ. **9,50,739.28/-**(తొమ్మిది లక్షల యాభై వేల ఏడు వందల ముప్పై తొమ్మిది రూపాయల ఇరవై ఎనిమిది పైసలు మాత్రమే) లాంఛనప్రాయ / నిర్మాణాత్మక స్వాధీనతా తేది : 15.11.2024
ఆస్తి షెడ్యూల్ : కృష్ణ-521340, కైకలూరు (మం), భుజబలపట్నం గ్రామ పంచాయతీ వద్ద ఉన్న ఆర్.ఎస్.నం.416 మొత్తం ఆ భాగం మరియు పార్సిల్ పరిధి 96.8 చ.గ.లు. **హద్దులు : ఉత్తరం :** గుజ్జల యాకోబుకు చెందిన సైట్, **దక్షిణం:** 7 లిం.లు. వెడల్పు ఉమ్మడి మార్గం సైట్ మరియు గుజ్జల పద్మ కుమారకు చెందిన సైట్, **తూర్పు :** గుజ్జల లక్ష్మణరావుకు చెందిన సైట్, **పడమర :** గుజ్జల విజయ కుమార్ (రాంబాబు)కు చెందిన సైట్.

2. రుణగ్రహీత, సహ-రుణగ్రహీత, హామీదారు పేరు మరియు చిరునామా, రుణ ఖాతా నం. మరియు రుణ మొత్తాలు :
దబ్బాది కనకరాజు (రుణగ్రహీత), దబ్బాది బంగారమ్మ (సహ రుణగ్రహీత), డో.నం.22-15/1-88/85సి, సిమెంట్ రోడ్డు, భానునగర్, విజయవాడ-520011. ఎల్ఎఎన్ నం.: **LVIJSTL0000050290** రుణ ఒప్పందం తేది : **22/06/2018**
రుణ మొత్తాలు : రూ. **20,00,000/-** (ఇరవై లక్షల రూపాయలు మాత్రమే)
ఎన్‌పిఎ తేది : **04-08.2024** డిమాండ్ నోటీసు తేది : 09/08/2024
బకాయి మొత్తాలు : రూ. **19,42,792.38/-**(పంతొమ్మిది లక్షల నలభై రెండు వేల ఏడు వందల తొంభై రెండు రూపాయల ముప్పై ఎనిమిది పైసలు మాత్రమే) లాంఛనప్రాయ / నిర్మాణాత్మక స్వాధీనతా తేది : 12.11.2024
ఆస్తి షెడ్యూల్ : విజయవాడ-520011, మాచవరం, గుణదల, భాను నగర్ జాగీరు, సిమెంట్ రోడ్డు, బ్లాక్ నం.9, ఆర్. వార్డు నం.16, ఎన్.టి.ఎస్.నం.29, బేరింగ్ డో.నం.22-15/1-88/85సి మొత్తం ఆ భాగం మరియు పార్సిల్. **ఆస్తి సరిహద్దులు : తూర్పు :** ఇతరుల ఆస్తి, **దక్షిణం :** పిసిని సూరిబాబు ఆస్తి, **పడమర :** గోర్లి కృష్ణ ఆస్తి, **ఉత్తరం :** రోడ్డు.

ప్రదేశం : విజయవాడ
తేది : 17.11.2024
సం/- అధీకృత అధికారి
నిడో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్, తరఫున
(గతంలో ఈడెల్వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేర్కొనబడినది)

నేడు పుష్ప 2 ట్రైలర్ విడుదల

అల్లు అర్జున్ హీరోగా, రష్మిక మందన్నా హీరోయిన్‌గా నటించిన చిత్రం 'పుష్ప 2'. ఆదివారం సాయంత్రం 6.03 గంటలకు బీహార్ రాజధాని పాట్నాలో ట్రైలర్‌ను మేకర్లు విడుదల చేయనున్నారు. సుకుమార్ ఈ సినిమాను తెరకెక్కించారు. విడుదలైన వెంటనే ఆదివారం సాయంత్రం ట్రైలర్ యూట్యూబ్‌లో అందుబాటులో ఉంటుందని అల్లు అర్జున్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. పోస్టర్‌ను పోస్ట్‌చేశారు.

హోంబలే 'నరసింహ'

హోంబలే ఫిల్మ్స్ కొత్త ప్రాజెక్ట్‌ను నిర్మిస్తోంది. అశ్విన్ కుమార్ దర్శకత్వంలో 'మహావతార్ : నరసింహ' చిత్రాన్ని తాజాగా ప్రకటించింది. ఇందుకు సంబంధించిన ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది. నటీనటులు ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే వెల్లడించనున్నారు. కన్నడ, తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో ఈ మూవీ రానుంది. సామ్ సీఎస్ ఈ చిత్రానికి సంగీతం అందించనున్నారు. శిల్పా ధావన్, కుశాల్ దేశాయ్, చైతన్య దేశాయ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మహావతార్ సిరీస్‌లో రానున్న తొలి సినిమా ఇది. దీనికి కొనసాగింపుగా ఇతర అవతారాలతో సినిమాలు రాబోతున్నాయని సమాచారం.

పిరమల్ క్యాపిటల్ అండ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ Piramal Capital & Housing Finance
సిఐఎన్ : L65910MH1984PLC032639
నమోదిత కార్యాలయం : యూనిట్ నం.601, 6వ అంతస్తు, పిరమల్ అమితి భవనం, పిరమల్ అగస్త్య కార్పొరేట్ పార్క్, కమని జంక్షన్, ఫైర్ స్టేషన్ ఎదురు, ఎల్‌బిఎస్ మార్గ్, కుర్లా (వెస్ట్), ముంబై-400 070. టి+91 22 3802 4000
శాఖా కార్యాలయం : డో.నం.7-1-615, 616 మరియు 617/ఎ, ఇంపీరియల్ టవర్స్, 4వ అంతస్తు, అమీర్‌పేట మెయిన్ రోడ్డు, హైదరాబాద్-500 016, తెలంగాణ
సంప్రదించాల్సిన వ్యక్తి : 1. దుర్గ విజయప్రసాద్ వనచర్ల - 9493330003, 2. రమణారావు - 9849271633, 3. రోహన్ సావంత్ - 9833143013

ఇ-వేలం విక్రయ నోటీసు - తదుపరి విక్రయం

పిరమల్ క్యాపిటల్ అండ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి క్రింద పేర్కొన్న సెక్యూర్డ్ అసెట్స్‌ను సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటి ఇంట్రస్ట్ యాక్ట్, 2022 క్రింద మరియు సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 క్రింద రుణగ్రహీత/ల నుండి బకాయిల రికవరీ కొరకు స్వాధీనం చేసుకోవడం జరిగినది. **'ఎక్కడ ఉందో అక్కడే", "ఆధారం ఏమిటి" మరియు "ఏది ఉందో అదే"** ప్రాతిపదికన స్థిరాస్తి కొనుగోలు ఏదైతే భౌతిక స్వాధీనంచేసుకొన్న దిగువసంతకందారు ద్వారా ఆఫర్లు ఆహ్వానించబడుచున్నవి. వివరాలు దిగువ విధంగా ఉన్నవి :

లోన్ కోడ్ / శాఖ / రుణ గ్రహీత(లు) / సహ రుణ గ్రహీత(లు) / హామీదారు(లు)	డిమాండ్ నోటీసు తేది మరియు మొత్తం	ఆస్తి చిరునామా - ఫైనల్	రిజర్వు ధర	ధరావత్తు డిపాజిట్ మొత్తం (ఇఎమ్‌డి) 10 శాతం ఆర్‌పి)	బకాయి మొత్తం (15.11.2024)
లోన్ కోడ్ నం.: **M0167793** విజయవాడ (శాఖ), రత్నకుమార్ దేవతోటి (రుణగ్రహీత) హుల్దా దేవతోటి (సహ రుణగ్రహీత 1)	తేది : 20.02.2020, రూ. 23,18,439/- (ఇరవై మూడు లక్షల పద్దెనిమిది వేల నాలుగు వందల ముప్పై తొమ్మిది రూపాయలు మాత్రమే)	ఆంధ్రప్రదేశ్-520010, కృష్ణాజిల్లా, విజయవాడ, లబ్బీపేట, బడవపేట, బ్లాక్ నం.2, రెవెన్యూ వార్డు నం.11, మున్సిపల్ వార్డు నం.18, ఎన్.టి.ఎస్.నం.33, ఉన్న ఆస్తి మొత్తం ఆ ముక్క మరియు పార్సిల్ డో.నం.37-5/1-8 వద్ద విస్తీర్ణం 51.28 చ.గ.లు. మరియు **హద్దులు : తూర్పు :** వేములపల్లి రాజ్‌కుమార్ ఆస్తి, **దక్షిణం :** వేపూరి గోపాలరావు ఆస్తి, **పడమర:** వేములపల్లి సురేష్ కుమార్ ఆస్తి, **ఉత్తరం :** రోడ్డు.	రూ. 20,82,600/- (ఇరవై లక్షల ఎనభై రెండు వేల ఆరు వందల రూపాయలు మాత్రమే)	రూ. 2,08,260/- (రెండు లక్షల ఎనిమిది వేల రెండు వందల అరవై రూపాయలు మాత్రమే)	రూ. 25,52,339/- (ఇరవై ఐదు లక్షల యాభై రెండు వేల మూడు వందల ముప్పై తొమ్మిది రూపాయలు మాత్రమే)

ఇ-వేలం తేది : 05.12.2024, ఉ॥ 11.00 గం.ల నుండి మ॥ 1.00 గం.ల వరకు (ప్రతిసారి 5 నిమిషాల అపరిమిత పొడిగింపుతో), బిడ్ దాఖలుచేయుటకు చివరి తేది : 04.12.2024, సా॥ 4.00 గం.లకు ముందు.
అమ్మకం యొక్క వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కొరకు, దయచేసి అందించిన లింక్ **www.piramalfinance.com/e-Auction.html** లేదా మా ఇ మెయిల్ **piramal.auction@piramal.com** ను చూడవచ్చును.

రుణగ్రహీత/హామీదారు/తాకట్టుదారుకు సర్ఫేసీ యాక్ట్ క్రింద చట్టబద్ధ 15 రోజుల అమ్మకపు ప్రకటన

పై పేర్కొన్న రుణగ్రహీత/హామీదారును ఇందుమూలంగా పేర్కొనుట ఏమనగా, వేలం తేదీకి ముందు తేదీ వరకు వర్తించు వడ్డీతో పూర్తిగా సెక్షన్ 13(2)లో పేర్కొన్నట్లుగా మొత్తాలను చెల్లించవలెను, విఫలం చెందిన ఏదైతే ఆస్తిని వేలం/అమ్మకం జరుపబడుతుంది మరియు మిగతా బకాయిలను రుణగ్రహీత/హామీదారు నుండి వడ్డీ & ఖర్చులతో రికవర్‌చేయబడుతుంది.
తేది : 17.11.2024, ప్రదేశం : ఏ.పి. సం/- (అధీకృత అధికారి), పిరమల్ క్యాపిటల్ మరియు హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

నయనతారకి ధనుష్ లీగల్ నోటీసులు

నయనతారతో నెట్‌ఫ్లిక్స్ ఓ డాక్యుమెంటరీని తీస్తున్న విషయం తెలిసిందే. ఈ డాక్యుమెంటరీలో ఆమె నటించిన 'నానుమ్ రౌడీ దాన్' సినిమా నుంచి 3 సెకన్ల వీడియోను వినియోగించారు. అయితే ఈ 3 సెకన్ల వీడియో ఉపయోగించడంపై చిత్ర నిర్మాత ధనుష్ నయనతారకు లీగల్ నోటీసులు పంపించారు. రూ.10 కోట్లు అపరాధ రుసుము చెల్లించాలని కూడా డిమాండ్ చేశారు. ఈ వివాదంపై నయనతార సోషల్ మీడియా వేదికగా ధనుష్‌పై విమర్శలు చేశారు. బహిరంగ లేఖను విడుదల చేశారు. నయనతార, విజయ్ సేతుపతి ప్రధాన పాత్రల్లో వచ్చిన 'నానుమ్ రౌడీ దాన్' సినిమాని నయనతార భర్త విఘ్నేష్ శివన్ దర్శకత్వం వహించారు. వండర్ బేర్స్ బ్యానర్‌పై ధనుష్ ఈ సినిమాను నిర్మించారు.

తమిళ దర్శకుడు మృతి

తమిళ దర్శకుడు సురేష్ సంగయ్య అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన తమిళ చిత్రసీమలో విభిన్నమైన కథలు తెరకెక్కించారు. 2017లో విధార్థ్ హీరోగా 'ఒరు కిడైన్ కరుణా మను' చిత్రానికి దర్శకత్వం వహించి మొదటి సినిమాతోనే మంచి పేరు పొందారు. తర్వాత ప్రేమ్ జి కథానాయకుడిగా 'సత్యాత్రిక' చిత్రాన్ని రూపొందించారు. ప్రస్తుతం యోగి బాబుతో ఇంకా పేరు పెట్టని సినిమాకి దర్శకత్వం వహించారు. అలాగే సెంథిల్‌తో ఒక సినిమాని తెరకెక్కించినట్లు తెలుస్తోంది. నెల రోజులుగా జాండీస్‌తో బాధపడుతున్న సురేష్ శుక్రవారం రాత్రి మరణించారు. సురేష్ ఆకస్మిక మృతికి సినీ ప్రముఖులు, తమ సంతాపం తెలిపారు.

చరిత్రలో నిలిచే చిత్రం 'ప్రేమ చరిత్ర-కృష్ణ విజయం'

'ప్రేమ చరిత్ర-కృష్ణ విజయం' కృష్ణ నటించిన చివరి చిత్రంగా చరిత్రలో నిలిచిపోతుంది. సూపర్‌స్టార్ కృష్ణను అభిమానంచే ప్రతి ఒక్కరూ ఈ చిత్రాన్ని చూడాలి. కృష్ణతో ఈ సినిమా రూపొందించటం మా అదృష్టంగా భావిస్తున్నాం. ఆయన నటించిన ఆఖరు చిత్రం విడుదల కాని చిత్రాల జాబితాలో ఉండకూడదనే పట్టుదలతో ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం. ఆధునిక సాంకేతిక హంగులన్నీ అద్దుకున్న ఈ చిత్రం కృష్ణ అభిమానులతోపాటుగా అందరినీ అమితంగా అలరిస్తుంది' దర్శక నిర్మాత మధుసూదన్ అన్నారు. ఘట్టమనేని కృష్ణ ద్వితీయ వర్ధంతిని హైదరాబాద్‌లో శనివారం నిర్వహించారు.

చిత్రపటానికి మధుసూదన్, నిర్మాతల మండలి అధ్యక్షులు కె.ఎల్. రామోదర్ ప్రసాద్, దర్శక నిర్మాత సునీల్ కుమార్‌రెడ్డి, నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ, హీరోయిన్ మధుమిత, కృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఖాదర్ గోరి, పద్మాలయ శర్మ, దర్శక నిర్మాత హెచ్.మధు సూదన్, సహనిర్మాత బండ్రి నాగరాజ్ గుప్తా, ధీరజ అప్పాజీ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబుజా మూవీస్, రామ్ ఫిల్మ్స్ బ్యానర్స్‌పై తెలుగు చలన చిత్ర చరిత్రలో చెరగని ముద్ర వేసిన సూపర్‌స్టార్ కృష్ణ నటించిన చివరి చిత్రం 'ప్రేమ చరిత్ర-కృష్ణ విజయం'. యశ్వంత్, సుహాసిని జంటగా నటించారు. నాగబాబు, ఆలీ ముఖ్యపాత్రలు పోషించారు. జనవరి 3న సంక్రాంతి కానుకగా ఈ సినిమాను విడుదల చేస్తామని చిత్ర ప్రతినిధులు ఈ కార్యక్రమంలో వెల్లడించారు. ఎంఎం శ్రీలేఖ సంగీతాన్ని అందించారు. సహనిర్మాతలు బి.వెంకటేష్‌శెట్టి, శ్రీపాద హను చాటే.

ది గాంధీ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్
హెడ్ ఆఫీస్ : నెం. హెచ్.948, మ్యూజియం రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ - 520002. ఫోన్ : 0866-2433379, 2436365

స్వాధీనతా ప్రకటన (అనుబంధం - 4 - స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ యొక్క రూల్ 8(1) క్రింద. సెక్యూరిటైజేషన్ మరియు రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 క్రింద ఏర్పాటు కాబడినది. SARFAESI చట్టం 2002 క్రింద బ్యాంక్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 9తో చదవబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ SARFAESI చట్టం 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద రుణగ్రహీతలు/సహ రుణగ్రహీతలు/రుణగ్రహీతల యొక్క న్యాయవారసులకు డిమాండు నోటీసు జారీచేసి సదరు నోటీసులో పేర్కొనబడిన మొత్తంతో పాటు చెల్లించు వరకు తదుపరి వడ్డీ మరియు ఛార్జీలు మొదలగు వాటిని తిరిగి చెల్లించవలసిందిగా కోరడమైనది. రుణగ్రహీతలు దిగువ పేర్కొనబడిన మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఇందుమూలముగా ప్రత్యేకించి పైన పేర్కొనబడిన రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానికమునకు తెలియజేయునది ఏమనగా సదరు రూల్స్ యొక్క రూల్ 9తో చదవబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ దిగువ పేర్కొనబడిన ఆస్తిన దిగువ సంతకందారు **లాంఛనప్రాయంగా స్వాధీనపరుచుకున్నారు.** ప్రత్యేకించి పైన పేర్కొనబడిన రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తులతో ఎటువంటి లావాదేవీలు జరుపకూడదు మరియు ఆస్తులతో ఏవేని లావాదేవీలు జరిపితే లోన్ రీకాల్ డిమాండ్ నోటీసులో పేర్కొనబడిన మొత్తంతో పాటు తదుపరి వడ్డీలు, ఛార్జీలు మొదలగు వారి కొరకు బ్యాంకు యొక్క ఛార్జీకి లోబడి ఉండగలదు. హామీగల ఆస్తులు విడిపించుకొనుటకు అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి SARFAESI చట్టం 2002 యొక్క సెక్షన్ 13 యొక్క ఉప-సెక్షన్ (8) నిబంధనలను రుణగ్రహీతల దృష్టికి తీసుకురావడం జరుగుచున్నది.

1	**రుణగ్రహీతల వివరాలు: మరణించిన ప్రధాన రుణగ్రహీత చెరుకూరి శకుంతల భర్త: లోకేశ్వరరావు వారి కుటుంబ సభ్యులు : 1 కుమారుడు :** చెరుకూరి సత్యనారాయణ, 2. కీ॥శే॥ చెరుకూరి శకుంతల గారి మరణించిన కుమార్తె తాతినేని కరుణ కుమారి వారి కుమార్తె **తాతినేని రాజశ్రీ,** మరియు కుమారుడు: **తాతినేని. రాజేష్,, డిమాండ్ నోటీసు తేదీ:** 01-08-2023. **బకాయి మొత్తం రూ.36,85,104/-** ది.31.07.2023 నాటికి తదుపరి వడ్డీతో పాటు. **మెయిన్ బ్రాంచ్** నందలి **లోన్ నెం. 01-2213-008310**లో పూర్తిగా చెల్లించే వరకు. **ఆస్తి వివరణ:- ఆస్తి హోల్డర్: చెరుకూరి శకుంతల (లేటు)** డోర్ నెం.46-4-130బి, బెత్లాహెం నగర్, గుణదల, విజయవాడ. గుణదల గ్రామంలోని సర్వే నెం.413/ఏలో కొండ పోరంబోకు మరియు అసెస్‌మెంట్ నెం.290602. గుణదల సబ్ రిజిస్ట్రీ షెడ్డు 207.55 చదరపు గజాల పరిధిలో నిర్మించబడింది. **ఆస్తి సరిహద్దులు:** తూర్పు:- చెరుకూరి కృష్ణ కుమారి, దక్షిణం:- చెరుకూరి సత్యనారాయణ, పడమర:- తాతినేని కరుణ కుమారి, ఉత్తరం:- రోడ్డు. **స్వాధీనం చేసుకున్న తేదీ: 11-11 -2024.**
2	**రుణగ్రహీతల వివరాలు: మరణించిన ప్రధాన రుణగ్రహీత తాతినేని కరుణ కుమారి,** W/o రాజేంద్ర ప్రసాద్ (లేటు) వారి కుటుంబ సభ్యులు, **1. కుమార్తె : తాతినేని రాజశ్రీ, 2. కుమారుడు : తాతినేని రాజేష్, డిమాండ్ నోటీసు తేదీ:** 01-10-2023. **బకాయి మొత్తం రూ.Rs. 45,08,635/-** ది.31.07.2023 నాటికి తదుపరి వడ్డీతో పాటు. **మెయిన్ బ్రాంచ్** నందలి **లోన్ నెం. 012213009252**లో పూర్తిగా చెల్లించే వరకు. **ఆస్తి వివరణ:- ఆస్తి హోల్డర్: తాతినేని కరుణ కుమారి** (లేటు) డోర్ నెం.46-4-130C, బెత్లాహెం నగర్, గుణదల, విజయవాడ. అసెస్‌మెంట్ నెం.290604. గుణదల సబ్ రిజిస్ట్రీ కింద డాక్ నెం.1000/2010 & MODT నం.6819/2015. గుణదల గ్రామంలోని సర్వే నెం.413/Aలో 242.21 చ.గజాల కొండ పోరంబోకులో RCC భవనం ఉంది. **ఆస్తి సరిహద్దులు:** తూర్పు:- చెరుకూరి శకుంతల, దక్షిణం:- చెరుకూరి సత్యనారాయణ, పడమర:- దారి, ఉత్తరం:- రోడ్డు **స్వాధీనం చేసుకున్న తేదీ: 11-11-2024.**

ది.16-11-2024, స్థలం : విజయవాడ సం/- ఆథరైజ్డ్ ఆఫీసర్, ది గాంధీ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్

ఢిల్లీలో తీవ్రస్థాయిలో పడిపోయిన గాలినాణ్యతలు

న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో గాలి నాణ్యతలు తీవ్రంగా పడిపోయాయి. శనివారం ఉదయం 9 గంటలకు ఢిల్లీలోని షాదీపూర్‌లో 457 గాలి నాణ్యతలు అత్యంత తీవ్రమైన స్థాయిలో పడిపోయాయని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి పేర్కొంది. ఢిల్లీలో కొన్ని ప్రాంతాల్లో నరేలా (449), వజీర్‌పూర్ (441), జహంగీరూరి (445), మరికొన్ని ప్రాంతాల్లో కూడా ఎక్యూఐలు 400లుగా నమోదైనట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి పేర్కొంది.

కాగా, వాయు కాలుష్యంని తగ్గించేందుకు ఢిల్లీ ప్రభుత్వం అంత:రాష్ట్ర నాన్ ఎలక్ట్రికల్ (ప్రైవేటు బస్సులు, పెట్రోల్, డీజిల్ వాహనాలు) వాహనాలపై నిషేధం విధించింది. ఒకవేళ నాన్ ఎలక్ట్రిక్ వాహనాలు రోడ్డుపై తిరిగితే.. ఆ వాహనాలకు ప్రభుత్వం రూ. 20 వేలు జరిమానా విధించనున్నట్లు ఆదేశాలు జారీ చేసింది.

కాంగ్రెస్‌లో చేరిన కేరళ బిజెపి నేత సందీప్ వారియర్

కేరళ (పాలక్కాడ్) : కేరళ బిజెపి సీనియర్ నేత సందీప్ వారియర్ శనివారం కాంగ్రెస్‌లోకి చేరారు. ఈయన బిజెపి కేరళ రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఉన్నారు. బిజెపి పార్టీలో సరైన గుర్తింపు, గౌరవం దక్కలేదన్న కారణంతోనే ఆయన కాంగ్రెస్‌లోకి చేరుతున్నట్లు వెల్లడించారు. అయితే పాలక్కాడ్ బై ఎలక్షన్ (నవంబర్ 20) నాలుగు రోజుల ముందే సందీప్ కాంగ్రెస్‌లో చేరడంతో రాజకీయంగా ఆసక్తి నెలకొంది. కాగా, సందీప్ వారియర్ కాంగ్రెస్‌లో చేరడం పట్ల కేరళ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కె. సుధాకరన్, మరో కాంగ్రెస్ సీనియర్ నేత వి.డి సతీశన్ హర్షం వ్యక్తం చేశారు.

విపత్తు బాధితులకు కేంద్రం ద్రోహం

- 19న వయనాడ్‌లో హర్తాళ్

కల్పేట: ముండక్కై-చురల్‌మల కొండచరియల విపత్తు బాధితులకు కేంద్ర ప్రభుత్వం చేసిన ద్రోహం, అన్యాయానికి వ్యతిరేకంగా 19న మంగళవారం వయనాడ్‌లో హర్తాళ్ చేపట్టనున్నట్లు ఎల్‌డిఎఫ్ పేర్కొంది. కొండచరియలు విరిగిపడిన ఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించాలన్న కేరళ డిమాండ్‌ను తిరస్కరించడం, ప్రత్యేక సహాయ నిరాకరణకు నిరసనగా ఈ హర్తాళ్ చేపట్టింది. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు హర్తాళ్ ఉంటుందని ఎల్‌డిఎఫ్ జిల్లా కన్వీనర్ సికె శశీంద్రన్ ప్రకటించారు. యుడిఎఫ్ కూడా 19న హర్తాళ్ ప్రకటించింది.

జార్ఖండ్‌లో ఘోర ప్రమాదం

- వధూవరులు సహా ఏడుగురు మృతి

రాంఛీ : జార్ఖండ్‌లో శనివారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నూతన వధూవరులతో సహా ఏడుగురు చనిపోయారు. డెహ్రాడూన్-నైనిటాల్ హైవేపై ధాంపూర్ అగ్నిమాపక కేంద్రం సమీపంలో శనివారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో పెళ్లి బృందంతో వెళ్తున్న టెంపో.. మరో కారును ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు జిల్లా ఎస్‌పి అభిషేక్ తెలిపారు. ప్రమాద ధాటికి టెంపోలోని ప్రయాణికులు కిందపడిపోయారని, ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు వ్యక్తులు అక్కడికక్కడే మరణించారని ఆయన చెప్పారు. తీవ్రంగా గాయపడిన టెంపో డ్రైవర్ అజబ్ సింగ్ ఆసుపత్రికి తరలిస్తున్న సమయంలో చనిపోయారని తెలిపారు. కాగా కారులో ప్రయాణిస్తున్నవారిలో ఇద్దరు గాయపడినట్లు ఎస్‌పి చెప్పారు. మతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించామన్నారు.

శిరోమణి అకాలీదళ్ అధ్యక్ష పదవికి సుఖ్‌బిర్ రాజీనామా

చండీగఢ్ : శిరోమణి అకాలీదళ్ పార్టీ అధ్యక్ష పదవికి సుఖ్‌బీర్ సింగ్ బాదల్ శనివారం రాజీనామా చేశారు. ఈ విషయాన్ని పంజాబ్ మాజీ విద్యాశాఖామంత్రి డాక్టర్ దల్జిత్ ఎస్ చీమా సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. ఈ సందర్భంగా సుఖ్‌బీర్ సింగ్.. తన నాయకత్వంపై విశ్వాసం ఉంచినందుకు, తన పదవీ కాలంలో సహకరించిన నాయకులు, కార్యకర్తలందరికీ హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలిపారు. కాగా, తన రాజీనామాకు సంబంధించి.. చండీగఢ్‌లో సీనియర్ నేతలతో సుఖ్‌బీర్ సింగ్ చర్చించారు. త్వరలోనే కోర్ కమిటీ ఏర్పాటుపై నిర్ణయం తీసుకోనున్నారు. ఈ సమావేశంలో త్వరలో జరగబోయే నాలుగు స్థానాల్లో జరిగే ఉప ఎన్నికలపై కూడా చర్చించినట్లు చీమా తెలిపారు.

బొలీవియాలో ఇద్దరు ప్రతిపక్ష నేతల అరెస్టు

లా పాజ్ : బొలివియా మాజీ అధ్యక్షులు ఎవో మొరెల్స్‌తో సంబంధాలున్నట్లు భావిస్తున్న ఇద్దరు ప్రతిపక్ష నాయకులను అధికారులు అరెస్టు చేశారు. ఉగ్రవాదులు, ఇతర నేరపూరిత వ్యక్తులతో సంబంధాలున్నాయనే అభియోగాలతో రైతు ఉద్యమ నాయకులు రమిరో కుచో, హంబెర్టో క్లారస్‌లను అదుపులోకి తీసుకున్నట్లు స్థానిక మీడియా పేర్కొంది. వీరిని లాపాజ్‌కు తరలించినట్లు తెలిపింది. మాజీ మంత్రి జువాన్ రమోన్ క్వింటానా నివాసంలోనూ పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఆయనకు కూడా ఉగ్రవాదులతో సంబంధాలున్నాయనే నేరాన్ని అంటగట్టి అరెస్టు చేయాలని పోలీసులు భావించారని, అయితే అందుకు తగిన సాక్ష్యాలేవీ ఆయన నివాసంలో లభించకపోవడంతో అరెస్టు చేయలేకపోయారని మీడియా తన కథనంలో పేర్కొంది. రైతు ఉద్యమ నాయకుల అరెస్టును మొరెల్స్, ఇతర రాజకీయ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఇవన్నీ రాజకీయ అపహరణలేనని, ఇది కచ్చితంగా ప్రతిపక్షంపై సాగిస్తున్న అణిచివేత చర్య అని పేర్కొన్నారు. నిరసనలు తెలిపే స్వేచ్ఛపై జరిగిన దాడిగా అభివర్ణించారు.

బియ్యం తరలిపోతోంది!

- అక్టోబర్‌లో 86 శాతం పెరిగిన ఎగుమతులు
- విలువ రూ.8870 కోట్లకు పైనే..

న్యూఢిల్లీ : భారత్ నుంచి విదేశాలకు భారీ స్థాయిలో బియ్యం తరలిపోతోంది. ఈ ఏడాది అక్టోబర్ నెలలో 86 శాతం మేర బియ్యం ఎగుమతులు పెరిగాయి. ఎగుమతుల విలువ ఒక బిలియన్ డాలర్ మార్కును దాటింది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ వెల్లడించిన గణాంకాల ప్రకారం..అక్టోబర్‌లో బియ్యం ఎగుమతుల విలువ రూ.8874.81 కోట్లుగా ఉన్నది. గతేడాది ఇదే సమయంలో ఇది రూ.4776.98 కోట్లకు పైగా అంటే, ఈ సారి పెరుగుదల 85.79 శాతం కావటం గమనార్హం. ఈ ఏడాది సెప్టెంబర్‌లో బియ్యం ఎగుమతుల విలువ దాదాపు 5,862.96 కోట్లుగా ఉన్నది.

ఈ ఏడాది సెప్టెంబర్ 28న కేంద్రం నాన్-బాస్మతీ వైట్ రైస్ ఎగుమతిపై నిషేధాన్ని ఎత్తివేసింది. అయితే, కనీస ఎగుమతి ధర (ఎంఈపీ)ని టన్నుకు రూ.41,395గా విధించింది. ఆ తర్వాత అక్టోబర్ 23న ఈ పరిమితిని కూడా కేంద్రం తొలగించింది. సెప్టెంబర్ 27న, నాన్-బాస్మతి వైట్ రైస్‌పై 20 శాతం ఎగుమతి సుంకాన్ని కేంద్రం తీసేసింది. అలాగే, మూడు కేటగిరిల బియ్యంపై ఎగుమతి సుంకాన్ని సగానికి తగ్గించింది. ఆ తర్వాత అక్టోబర్ 22న సుంకాన్ని సున్నాకు చేసింది.

అక్టోబర్ నెలలో బియ్యం ఎగుమతుల్లో పెరుగుదలతో.. 2024-25 ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోని మొదటి ఏడు నెలల్లో(ఏప్రిల్-అక్టోబర్) మొత్తం బియ్యం ఎగుమతి.. 5.27 శాతం పెరుగుదలను చూసింది. మొత్తం ఎగుమతి విలువ దాదాపు రూ.52,130.96 కోట్లు.. గతేడాది ఇదే సమయంలో ఈ విలువ దాదాపు రూ.49,500.92 కోట్లుగా నమోదు కావటం గమనార్హం. గత ఆర్థిక సంవత్సరం మొదటి అర్ధభాగంలో భారత మొత్తం బియ్యం ఎగుమతుల విలువ రూ.44,734.31 కోట్లుగా ఉంటే.. అది ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి రూ.43,253.24 కోట్లకు పడిపోయింది. అంటే, ఈ తగ్గుదల 3.33 శాతం.

వరి ఉత్పత్తిలో భారత్, చైనాలది పైచేయి

ప్రస్తుతం భారత్ ప్రపంచంలోనే రెండో అతిపెద్ద బియ్యం ఉత్పత్తిదారు, ఎగుమతిదారుగా ఉన్నది. భారత్, చైనా కలిసి ప్రపంచ బియ్యం ఉత్పత్తిలో సగం కంటే ఎక్కువ వాటాను కలిగి ఉన్నాయి. బియ్యం విషయంలో చైనా అతిపెద్ద వినియోగదారు కాగా.. ఎగుమతుల్లో మాత్రం చిన్నదే. యునైటెడ్ స్టేట్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ (యూఎస్‌డీఏ) సమాచారం ప్రకారం.. గతేడాది ప్రపంచ మొత్తం బియ్యం ఎగుమతుల్లో భారత వాటా 33 శాతం (17 మిలియన్ టన్నులు)గా ఉన్నది. నాన్-బాస్మతి వైట్ రైస్ ఎగుమతులపై నిషేధానికి ముందు 2022లో ఇది 40 శాతంగా ఉన్నది. ప్రపంచ రైస్ మార్కెట్‌లో భారత్‌కు థాయ్‌లాండ్, వియత్నాంలు ప్రధాన పోటీదారుగా ఉన్నాయి.

మోడీ సర్కార్ వినాశకర విధానాలను నిరసిస్తూ
26న దేశవ్యాప్త ఆందోళనలు

- కేంద్ర కార్మిక, రైతు సంఘాల పిలుపు
- భాగస్వామ్యం కానున్న వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్రంలో బిజెపి నేతృత్వ ఎన్‌డిఎ ప్రభుత్వం, రాష్ట్రాల్లో దాని భాగస్వామ్య పక్షాల ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 26న దేశవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఆందోళనలు చేపట్టనున్నారు. కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాల నేతృత్వంలో నిర్వహించే ఈ ఆందోళనల్లో కార్మికులు, రైతులతో పాటు వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు కూడా భాగస్వామ్యం కానున్నారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణపై చర్చించేందుకు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం), అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఎఐఎడబ్ల్యుయు), కౌలు రైతు సంఘం తదితర సంఘాల సంయుక్త సమావేశం శనివారం ఇక్కడి హరికిషన్ సింగ్ సూర్జిత్ భవన్‌లో జరిగింది. భారత కిసాన్ మజ్దూర్ యూనియన్ (బికెఎంయు) నేత వివిఎస్ నిర్మల్, ఎస్‌కెఎం నేత డాక్టర్ దర్శన్ పాల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయా సంఘాలకు చెందిన 18 మంది నాయకులు మాట్లాడారు. వ్యవసాయ రంగ కార్పొరేటీకరణ, జీవనోపాధులపై బిజెపి ప్రభుత్వాలు సాగిస్తున్న దాడులను తిప్పికొట్టాలని, కార్మిక, కర్షక ఐక్యతతో విశాల ప్రజా ఉద్యమాలను నిర్మించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కనీస వేతనం, అందరికీ ఉపాధి, 200 రోజుల పని, ఉపాధి హామీ కింద రోజు వారీ వేతనం రూ.600, ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్), ధరల నియంత్రణ వంటి డిమాండ్లతో ఈ దేశవ్యాప్త ఆందోళన చేపట్టనున్నారు. వ్యవసాయ కార్మికులు, కౌలు రైతుల కోసం చట్టం చేయాలని, సామాజిక వివక్ష, హింసను అంతం చేయాలని, వ్యవసాయ ఉత్పత్తి, సేకరణ, నిల్వ, అగ్రో-ప్రాసెసింగ్, సహకార సంఘాల అభివృద్ధి చేయాలన్న డిమాండ్లు కూడా ప్రధానంగా కార్మిక, కర్షక నేతలు ప్రభుత్వం ముందుంచారు. ఈ సమావేశంలో అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) నాయకులు హన్నన్ మొల్లా (ఎఐకెఎస్), ఎఐఎడబ్ల్యుయు నాయకులు బి వెంకట్, ప్రేమ్ సింగ్ గెహ్లాట్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు, బిజెపికి ఇసి నోటీసులు

న్యూఢిల్లీ : మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో స్టార్ క్యాంపెయినర్లు రాహుల్ గాంధీ, అమిత్ షా చేసిన ప్రసంగాలపై వివరణ ఇవ్వాల్సిందిగా ఎన్నికల సంఘం (ఇసి) శనివారం కాంగ్రెస్, బిజెపి అధ్యక్షులకు నోటీసులు జారీ చేసింది. ఇరువురు నేతల వ్యాఖ్యలు ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా ఉన్నాయని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఇసి ఈ నోటీసులు జారీ చేసింది. బిజెపి అధ్యక్షులు జేపీ నడ్డా, కాంగ్రెస్ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట లోగా ఇసికి వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ నెల 6న ముంబయిలో రాహుల్ ప్రసంగిస్తూ 'మహారాష్ట్రకు వస్తున్న అవకాశాలను ఇతర రాష్ట్రాలు దొంగిలిస్తున్నాయ'ని ఆరోపించినట్లు బిజెపి ఇసికి చేసిన ఫిర్యాదులో పేర్కొంది. కాగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ నెల 12న ధన్‌బాద్‌లో కాంగ్రెస్, దాని మిత్రపక్షాలపై తప్పుడు, హానికరమైన, నిందాపూర్వకమైన ఆరోపణలు చేశారని కాంగ్రెస్ ఇసికి ఫిర్యాదు చేసింది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు వ్యతిరేకమని, అవి దేశంలో ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నాయని అమిత్ షా నిందలు మోపారంటూ కాంగ్రెస్ పేర్కొంది. కులం, మతం ప్రాతిపదికన ఓటర్లను రెచ్చగొట్టడమే అమిత్ షా ప్రకటన వెనుక ఉన్న ఏకైక ఉద్దేశమని తెలిపింది. ఈ ఫిర్యాదులపై స్పందించిన ఇసి ఇరువురి పార్టీల అధినేతలకు నోటీసులు జారీ చేసింది.

ఆర్థిక సహకారం బలోపేతం

- పౌరులకు సాధికారత
- అపెక్ సదస్సు పిలుపు

లిమా : ఆర్థిక సహకారాన్ని బలోపేతం, పౌరులకు సాధికారత ద్వారానే ఈ ప్రాంత సమగ్రాభివృద్ధి సాధ్యమని ఆసియా పసిఫిక్ ఆర్థిక సహకార కూటమి (అపెక్) శిఖరాగ్ర సదస్సు పిలుపునిచ్చింది. 21 ఆర్థిక వ్యవస్థలతో ఏర్పడిన అపెక్ ప్రపంచ స్థూల జాతీయోత్పత్తి (జిడిపి)లో 60శాతం, అంతర్జాతీయ వాణిజ్యంలో దాదాపు సగం వాటాకు ప్రాతినిధ్యం వహిస్తున్నది. ప్రపంచ వాణిజ్యంలో అత్యంత ప్రభావ వంతమైన దేశాల నేతలను ఒక చోటకు చేర్చింది. పెరూ రాజధాని లిమాలో శుక్రవారం ప్రారంభమైన ఈ సదస్సులో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, చైనా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్‌తో సహా పలు దేశాల నేతలు హాజరయ్యారు. ఆర్థికాభివృద్ధికి సమ్మిళిత వ్యూహాలతోపాటు అసమానతలు తగ్గించడానికి శక్తి వంతమైన సాధనంగా అపెక్‌ను తీర్చిదిద్దాలని పెరూ అధ్యక్షురాలు డీనా బోలువార్టే అన్నారు. వియత్నాం, చిలీ, పెరూ వంటి సభ్య దేశాలు ఇలాంటి సవాళ్లనే ఎదుర్కొంటున్నాయని ఆమె అన్నారు. ప్రజల జీవితాల్లో మార్పు లేకుండా సాధించిన అభివృద్ధికి అర్థం లేదన్నారు. జనాభాలో పెద్ద సెక్షన్‌కు ఇప్పటికీ నాణ్యమైన విద్య, మంచి ఉద్యోగావకాశాలు అందుబాటులో లేవని అన్నారు. సహకారం పట్ల నిబద్ధత తప్పనిసరిగా మానవతా దృక్పథంతో కూడి ఉండాలి.ఆర్థికాభివృద్ధి అనేది పేదరికాన్ని తగ్గించడానికి, మంచి ఉద్యోగాలను సృష్టించడానికి, అందరికీ ప్రాథమిక సేవలకు హామీ ఇవ్వడానికి ఒక సాధనంగా ఉండాలని ఆమె నొక్కి చెప్పారు. అంతర్జాతీయ వాణిజ్యంలోనే కాకుండా స్థానిక ఆర్థిక వ్యవస్థల్లో కూడా తలుపులు తెరిచే విధానాలు రూపొందించడానికి అపెక్ ఓ ఉత్ప్రేరకం వలె పనిచేస్తుందని పెరూ నేత చెప్పారు. సామాజిక శ్రేయస్సు, పర్యావరణ పరిరక్షణ, పౌరులకు సాధికారత అంశాలపై అపెక్ ప్రధాన ఎజెండాగా ఉండాలని ఆమె నిర్దేశించారు. చిలీ అధ్యక్షుడు గాబ్రియెల్ బోరిక్ మాట్లాడుతూ లాటిన్ అమెరికా అభివృద్ధికి ఈ ఫోరమ్‌కు చాలా దోహదపడుతుందని అన్నారు. సమాజంలోని అన్ని ప్రాంతాలకు ప్రయోజనం చేకూర్చడమే స్వేచ్ఛా వాణిజ్యం లక్ష్యమని అన్నారు.

బీరుట్‌లో నివాస భవన సముదాయలపై ఇజ్రాయిల్ క్షిపణి దాడులతో ఎగిసి పడుతున్న అగ్నికీలలు

యుద్ధోన్మాదంతో పెట్రేగిపోతున్న ఇజ్రాయిల్

- దక్షిణ బీరుట్‌లో వరుస దాడుల్లో 59 మంది మృతి
- గాజాలో మరో 28 మంది బలి

గాజా, బీరుట్ : అమెరికా అండదండలతో ఇజ్రాయిల్ యుద్ధోన్మాదంతో పెట్రేగిపోతోంది. లెబనాన్ రాజధాని బీరుట్‌పై వరుసగా దాడులు కొనసాగిస్తున్న ఇజ్రాయిల్ తాజాగా దక్షిణ శివార్లలోని దహియె, హరెత్ హ్రీక్, చియాహ్ ప్రాంతాలపై వైమానిక దాడులకు పాల్పడింది. హిజ్బుల్లా కేంద్రాలే తమ లక్ష్యమని చెబుతూ పెద్ద సంఖ్యలో సాధారణ ప్రజల ప్రాణాలను బలిగొంటోంది. ప్రధానంగా దక్షిణ బీరుట్‌పై వరుస దాడులకు తెగబడుతోంది. గత 24 గంటల వ్యవధిలో లెబనాన్‌వ్యాప్తంగా 59 మంది మరణించారు. మరో 182 మంది గాయపడ్డారు. మరోవైపు ఉత్తర గాజాలోనూ ఇజ్రాయిల్ అమానవీయ దాడులు కొనసాగుతున్నాయి. గత 24గంటల్లో 28మంది పాలస్తీనియన్లు మరణించారు. మరో 120 మంది గాయపడ్డారు. దీంతో గాజాలో ఇప్పటివరకు 43,799 మంది మరణించగా, 1,03,601 మంది గాయపడ్డారు. లెబనాన్‌లో 3,445 మంది మరణించగా, 14,599 మంది గాయపడ్డారు. కాగా దక్షిణ గాజాలోని ఖాన్ యూనిస్ మున్సిపాలిటీలో ఇంధన నిల్వలు హరించుకుపోయాయని అధికారులు ప్రకటించారు. దీంతో మంచినీటి, పారిశుధ్య సదుపాయాలు పనిచేయడం నిలిచిపోయే ప్రమాదముందని హెచ్చరించారు. వ్యర్థాల సేకరణ, పారిశుధ్యం, రవాణా వంటి సేవలు ఇక పనిచేయబోవని తెలిపారు. దీనివల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల 12 లక్షల మంది ప్రజలకు పరిశుద్ధమైన తాగునీరు అందుబాటులో లేకుండా పోతుందన్నారు.

రేపు శ్రీలంక కొత్త ప్రధాని, కేబినెట్ నియామకం

కొలంబో : శ్రీలంక కొత్త ప్రధానిని, కేబినెట్‌ను అధ్యక్షులు అనూర కుమార దిసనాయకె సోమవారం నియమించనున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్‌పిపి) పార్టీ మూడింట రెండు వంతుల మెజారిటీ సాధించింది. ఎన్‌పిపి సీనియర్ ప్రతినిధి తిల్విన్ సిల్వా విలేకర్లతో మాట్లాడుతూ, 25 మంది లేదా అంతకన్నా తక్కువ మందితో కేబినెట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. రాజ్యాంగంలోని 46వ అధికరణ ప్రకారం, కేబినెట్ మంత్రుల సంఖ్య 30కి మించరాదు. డిప్యూటీ మంత్రుల సంఖ్య 40 దాటరాదు. అయితే డిప్యూటీ మంత్రుల సంఖ్య పెరిగే అవకాశముందని ఆయన చెప్పారు. పెద్ద మంత్రిత్వశాఖకు సంబంధించిన వివిధ విభాగాలను నిర్వహించేందుకు డిప్యూటీ మంత్రులు అదనంగా నియమించాల్సి వుంటుందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజలపై భారాన్ని తగ్గించేందుకు చిన్న ప్రభుత్వాలే మంచిదన్నది ఎన్‌పిపి అభిప్రాయమని ఆయన స్పష్టం చేశారు.

రికార్డుల మోత

అనేక అంశాల్లో ఎన్‌పిపి విజయం పలు రికార్డులను సృష్టించింది. మాజీ అధ్యక్షులు మహిందా రాజపక్సా నేతృత్వంలోని పార్టీ 2010 ఎన్నికల్లో సాధించిన 60.33 శాతం ఓట్లే ఇప్పటివరకు అత్యధికంగా కాగా తాజా ఎన్నికల్లో ఎన్‌పిపి 61.56 శాతం ఓట్లు గెలుచుకుంది. అలాగే 169 పోలింగ్ డివిజన్లలో 152 డివిజన్లలో ఎన్‌పిపి విజయం సాధించింది. గత ప్రభుత్వం 136 డివిజన్లలోనే గెలిచింది. అలాగే 22కు గానూ 21 జిల్లాల్లో ఎన్‌పిపి గెలుపొందింది. గత ఎన్నికల్లో ఈ సంఖ్య 19గానే వుంది. 2020లో రాజపక్సా 145 సీట్లు గెలవగా, తాజా ఎన్నికల్లో 159సీట్లు గెలిచారు. దామాషా ప్రాతినిధ్య ఎన్నికల వ్యవస్థ కింద 150సీట్లు సాధించి మూడింట రెండు వంతుల మెజారిటీని సాధించి మొదటి పార్టీ కూడా ఎన్‌పిపినే కావడం విశేషం.

అగ్ని ప్రమాదంలో చనిపోయిన పిల్లలను గుర్తించేందుకు వచ్చిన తల్లిదండ్రులతో ఝాన్సీ ఆసుపత్రి పరిసర ప్రాంతాలు రోదనలతో మార్మోగాయి

రోదనల మధ్య స్వాగత సత్కారాలా?

- యుపి ప్రభుత్వ తీరుపై వెల్లువెత్తిన విమర్శలు
- ఎన్నిక

ఝాన్సీ : ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీలో ఉన్న ప్రభుత్వ మహారాణి లక్ష్మీబాయి వైద్య కళాశాలలో శుక్రవారం అగ్ని ప్రమాదం సంభవించి 10 మంది నవజాత శిశువులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. పరిస్థితిని సమీక్షించి, బాధితులను పరామర్శించేందుకు ఉప ముఖ్యమంత్రి బ్రజేష్ పాథక్ శనివారం ఆస్పత్రికి వచ్చారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రికి స్వాగత సత్కారాల కోసం భారీ స్థాయిలో ఏర్పాట్లు చేశారు. దీనికి సంబంధించిన ఓ వీడియో సామాజిక మాధ్యమాలలో చక్కర్లు కొట్టింది. బాధితులను పరామర్శించేందుకు వచ్చే వారికి ఘనంగా స్వాగతం పలకడమేమిటని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జరిగిన దారుణంపై ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందని, పాలనా యంత్రాంగం పూర్తిగా విఫలమైందని వారు ఆరోపించారు.

'వీడియో చూసి దిగ్భ్రాంతి చెందాను. ఆరోగ్య శాఖ మంత్రి పర్యటన కోసం ఆస్పత్రి అధికారులు ఏర్పాట్లు చేయడంలో ఎలా తలమునకలవుతారు? ఈ విషాద ఘటనపై ప్రభుత్వంలో చలనం లేనట్లు కన్పిస్తోంది' అని వినోద్ చంద్ర అనే వ్యక్తి ఎక్స్‌లో తన అసహనం వ్యక్తం చేశారు. ఝాన్సీ ఆస్పత్రికి దారితీసే రోడ్డును తళతళలాడేలా శుభ్రం చేశారని, ఇది సిగ్గులేని తనానికి నిదర్శనమని కాంగ్రెస్ పేర్కొంది. 'ఇంతకంటే సిగ్గులేనితనం మరేముంటుంది? ఓ వైపు చిన్నారులు సజీవ దహనమయ్యారు. వారి కుటుంబాలు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నాయి. మరోవైపు ఉప ముఖ్యమంత్రికి స్వాగతం పలికేందుకు రోడ్డుపై సున్నం చల్లుతున్నారు. ఇది ప్రభుత్వంలో కదలిక లేదన్న విషయాన్ని బయటపెడుతోంది. పిల్లలు అగ్ని ప్రమాదంలో చనిపోతే ప్రభుత్వం దానికి మసిబూసి మారేడుకాయ చేస్తోంది. యోగి ఆదిత్యనాథ్ పాలనలో ఉత్తరప్రదేశ్‌లో పుట్టడమే పిల్లలు చేసుకున్న తప్పిదం' అని కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి షానవాజ్ ఆలం ధ్వజమెత్తారు. స్వాగత సత్కారాలపై దుమారం రేగడంతో యుపి ఉప ముఖ్యమంత్రి వివరణ ఇచ్చారు. ఇది గర్హనీయమని, తనకు దిగ్భ్రాంతి కలిగించిందని చెప్పుకొచ్చారు. వీడియో తీసిన వారిపై చర్య తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించానని అన్నారు.

ఎన్నికల ప్రచారంలో యోగి బిజీ

అభంశుభం తెలియని 10 మంది చిన్నారులు అగ్నికి ఆహుతి అయ్యి వారి కుటుంబాలు తీవ్ర విషాదంలో ఉంటే ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు మాత్రం వారిని పరామర్శించేందుకు తీరిక కూడా దొరకడం లేదు. ఆయన ఉప ఎన్నికల ప్రచారంలో బిజిబిజీగా ఉన్నారు. కాన్పూర్‌లోని శిషమావు అసెంబ్లీ నియోజకర్గంలో సమాజ్‌వాదీ పార్టీ నుంచి ఎన్నికైన ఇర్ఫాన్ సోలంకీకి ఒక కేసులో జైలు శిక్ష పడటంతో ఆయనపై అనర్హత వేటు కారణంగా ఇక్కడి ఉప ఎన్నిక జరుగుతోంది. ఈ స్థానాన్ని ఎలాగైనా దక్కించుకోవాలని యోగి ఆదిత్యనాథ్ బిజెపి తరపున సర్వ శక్తులు ఒడ్డుతున్నారు. ఇందులో భాగంగానే ఆయన విషాదంలో మునిగిన ప్రజలను కూడా పట్టించుకోకుండా బిజెపి అభ్యర్థి తరపున శిషమావులో భారీ రోడ్ షో నిర్వహించారు. విషాదం వేళలోనూ ఉపముఖ్యమంత్రికి భారీ స్వాగత ఏర్పాట్లు చేయడం, దీనివైపు కన్నెత్తి కూడా చూడకుండా యోగి ఎన్నికల ప్రచారంలో మునిగిపోవడంపై సర్వత్రా తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.

రాష్ట్రపతి దిగ్భ్రాంతి

ఝాన్సీలో నవజాత శిశువుల మరణం పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ప్రభృతులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'ఇది చాలా హృదయ విదారక వార్త. గాయపడిన చిన్నారులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను' అని రాష్ట్రపతి ముర్ము సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. ఈ ఘటనకు కారకులైన దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఖర్గే డిమాండ్ చేశారు.

యుపి సివిల్ సర్వీసెస్ పరీక్షల వాయిదా

- నిరసనల నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం

ప్రయాగరాజ్ : సివిల్ సర్వీస్ ప్రిలిమినరీ పరీక్షలను రీషెడ్యూల్ చేస్తున్నామని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. డిసెంబర్ 22న ఒకే రోజు ఈ పరీక్షను నిర్వహిస్తామని తెలిపింది. ప్రయాగరాజ్‌లో నాలుగు రోజుల పాటు జరిగిన ఆందోళన నేపథ్యంలో ప్రభుత్వం ఎట్టకేలకు దిగి వచ్చింది. సివిల్ సర్వీస్ పరీక్షలను, రెవ్యూ అధికారులు, అసిస్టెంట్ రెవ్యూ అధికారుల నియామక పరీక్షలను రెండు రోజుల పాటు రెండు షిఫ్టులలో నిర్వహిస్తామని యుపిపిఎస్‌సి ప్రకటించిన నేపథ్యంలో ఉద్యోగార్థులు నిరసనలకు దిగారు. సివిల్ సర్వీస్ పరీక్షలు డిసెంబర్ 7, 8 తేదీలలో రెండు షిఫ్టులలో జరగాల్సి ఉంది. ఆర్‌ఓ, ఏఆర్‌ఓ పరీక్షలు డిసెంబర్ 22, 23 తేదీలలో మూడు షిఫ్టులలో జరగాల్సి ఉంది. అభ్యర్థుల నిరసన నేపథ్యంలో ఈ పరీక్షలను వాయిదా వేసి కొత్త తేదీలను ప్రకటించారు. దీంతో ప్రయాగరాజ్‌లోని కమిషన్ కార్యాలయం ఎదుట జరుపుతున్న ఆందోళనను అభ్యర్థులు విరమించారు. నిరసనకారులందరూ శుక్రవారం సాయంత్రమే ఆ ప్రదేశాన్ని వదిలి వెళ్లారు. తమ డిమాండ్లకు కమిషన్ అంగీకరించడంతో నిరసనకు స్వస్తి చెప్పామని ఓ అభ్యర్థి తెలిపారు. షిఫ్టుల వారీగా పరీక్షల నిర్వహణను వ్యతిరేకిస్తూ ప్రయాగరాజ్‌లో ఈ నెల 11న ఆందోళన ప్రారంభమైంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన పది వేల మంది అభ్యర్థులు వరుసగా నాలుగు రోజుల పాటు ప్రతికూల పరిస్థితుల నడుమ ఆందోళన కొనసాగించారు. వారిపై పోలీసులు లాఠీఛార్జీ చేసి దాష్టీకం ప్రదర్శించారు. తినుబండారాలు, తాగునీరు కూడా లభించకుండా అడ్డుకున్నారు.

అమెరికాలోకి రహస్యంగా ప్రవేశించే యత్నంలో ఓ గుజరాతీ కుటుంబం మృతి

- ఆలస్యంగా వెలుగులోకి..

వాషింగ్టన్ : భద్రతా తనిఖీల నుంచి తప్పించుకుని అమెరికాలోకి ప్రవేశించే యత్నంలో చలికి గడ్డకట్టుకుపోయి గుజరాతీ కుటుంబం మొత్తం చనిపోయిన విషాదకర ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ విషాదకర ఘటనలో జగదీష్ పటేల్ , ఆయన భార్య వైశాలి, మూడేళ్ల కుమారుదు ధార్మిక్, టీనేజి కుమార్తె బిహంగీ చనిపోయారు. సరిహద్దు కాపలాదారులకు చిక్కకుండా అమెరికాలో ప్రవేశించేందుకు ఎముకలు కొరికే భయంకరమైన చలి మధ్య రోజుల తరబడి నిరీక్షిస్తూ చివరికి దయనీయమైన స్థితిలో చనిపోయారు. ఈ ఘటన 2022లో చోటుచేసుకుంది. మానవ అక్రమ రవాణా కేసులో పట్టుబడిన హర్షకుమార్ పటేల్ అనే ఓ బ్రోకర్ తెలిపిన దానిని బట్టి ఈ కథ మొత్తం బయటకొచ్చింది. డర్టీ హ్యారీ అని పిలిచే బ్రోకర్ పటేల్‌పై అమెరికా కోర్టులో సోమవారం విచారణ జరగనుంది.అమెరికా వెళితే పెద్ద యెత్తున డబ్బు సంపాదించుకోవచ్చన్న ఆశతో జగదీష్ పటేల్ దంపతులు వీరిని ఆశ్రయించారు. జగదీష్ కుటుంబంతో బాటు మొత్తం 11 మందిని అమెరికాకు తీసుకెళ్తానని చెప్పి వీరి నుంచి బ్రోకర్ దాదాపు రూ. 76 లక్షలు వసూలుచేశారు. సరిహద్దుల గుండా అమెరికాలోకి పంపేందుకు బ్రోకర్లు వీరిని దాని పొరుగు దేశమైన కెనడాలో నిర్మానుష్యంగా ఉండే అతి శీతల ప్రదేశంలో ఉంచారు. అటు నుంచి అదును చూసుకుని సరిహద్దుకు ఆవలి వైపు ఉన్న అమెరికాలోకి పంపిస్తారు. ఈ ప్రయాణం కష్టతరమే కాదు చాలా ప్రమాదంతో కూడుకున్నది. సరిహద్దు భద్రతా దళాల కంటపడితే ఇక అంతే సంగతి. ఈ విధంగా యత్నించి పట్టుబడి, అమెరికా జైళ్లలో మగ్గుతున్నవారు ఉన్నారు. గత ఏడాది కాలంలో కెనడా, మెక్సికో సరిహద్దుల ద్వారా అక్రమంగా ప్రవేశించిన 29 లక్షల మందిని అమెరికన్ సరిహద్దు భద్రతా బలగాలు అదుపులోకి తీసుకున్నాయి. వీరిలో 90 వేల మంది దాకా భారతీయులే ఉన్నారు. అందులో సగం మంది గుజరాతీయులే ఉండడం గమనార్హం.నరేంద్ర మోడీ ప్రభుత్వ హయాంలో ఈ ట్రెండ్ బాగా పెరిగిపోయింది.

పిల్లలకూ

వినోదం కావాలి..

ఈ సమాజం పిల్లల చుట్టూ నిర్మితమవ్వాలి. వాళ్ల సంతోషాలు, అల్లర్లు, బాధలు, ఊహలు అన్ని భావోద్వేగాలకు పెద్దపీట వేయాలి. సినీ పరిశ్రమను ఒక పుస్తకం అనుకుంటే.. ఒకప్పుడు అందులో పిల్లలకంటూ కొన్ని పేజీలు ఉండేవి. అందులో పిల్లల కేంద్రంగా నడిచే కథలు వచ్చేవి. పిల్లలు నడిపించిన ఎన్నో సినిమాల్లో పెద్ద పెద్ద హీరోలు, హీరోయిన్లు కూడా అతిథి పాత్రల్లోనే కనిపించేవారంటే అతిశయోక్తి కాదు.. కానీ ఇప్పుడు.. పిల్లలతో కలసి సినిమాలు చూడలేని పరిస్థితి. పిల్లల కోసం ప్రత్యేక సినిమాలు లేకపోవడం వల్ల వారు కూడా పెద్దలతో పాటు, పెద్దల సినిమాలు చూస్తున్నారు. ఫలితంగా అశ్లీలం, హింస, జుగుప్స కలిగించే ఎన్నో భావోద్వేగాలకు గురవుతున్నారు.



పిల్లలు ఫోన్లలో గేమ్స్‌కి అలవాటు పడిపోతున్నారని తెగ గగ్గోలు పెడుతున్నాం. టీవీలో కార్టూన్ సీరియల్స్‌కి ఎడిక్ట్ అయిపోయారని బాధపడిపోతున్నాం. ఆటలు, పాటలు స్థానే పిల్లలకు వినోదం కూడా కావాలని ఎంతమంది పెద్దలు ఆలోచిస్తున్నారు. వాళ్లకి వినోదం అందించే సాధనాలు ఇప్పుడు మనకు అందుబాటులో ఉన్నాయా? అంటే.. లేనే లేవు. వినోదం పేరుతో 'పెద్దల కోసమే' చిత్రీకరిస్తున్న సినిమాలే ఈ తరం పిల్లలకూ అనివార్యమయ్యాయి. టీవీల్లో దెయ్యాల సినిమాలు వస్తుంటే పిల్లలు చాలా ఆసక్తిగా చూస్తున్నారు. చాలామంది ఇళ్లల్లో ఇదే జరుగుతోంది. అర్థాలే తెలియని ద్వంద్వార్థాల పాటల లిరిక్స్‌కు తెగ ఊగిపోతూ డ్యాన్సులు వేసే చిన్నారులు చాలా చోట్ల కనిపిస్తున్నారు.

గన్నులు పట్టుకుని 'డిష్యూం డిష్యూం' అంటూ తుపాకీ ఆటలు ఆడే గడుగ్గాయలకు కొదవే లేదు. కార్లు, జీపుల బొమ్మలతో రేసింగ్ గేమ్స్ పెట్టుకుంటున్న బాల మేధావులూ ఉన్నారు. ఇప్పుడు పిల్లలకు ఇదే వినోదమైపోయింది. కానీ ఒకప్పుడు ఇలా లేదు. పిల్లల వినోదానికి పెద్ద పీట వేశారు. సినిమా రంగం ఆ బాధ్యత తన భుజాలపై మోసింది.

పిల్లలే నడిపించిన కథలు..

1972లో వచ్చిన 'బాలమిత్రుల కథ'లో ధనిక, పేద తారతమ్యాల చుట్టూ చిగురించిన స్వచ్ఛమైన పిల్లల స్నేహాన్ని చూపించారు. అంతకుముందే 1966లో 'లేత మనసులు' చిత్రం విడుదలైంది. 'కోడి ఒక కోనలో.. పుంజు ఒక కోనలో.. పిల్లలేమో తల్లడిల్లే ప్రేమలేని కోనలో..' అంటూ పిల్లల పాత్రలు ఆలపించిన పాటలో తల్లిదండ్రులు విడిపోతే పిల్లలు ఎంతలా తల్లడిల్లుతారో చూపిస్తారు. 1992లో వచ్చిన 'భద్రం కొడుకో' చిత్రంలో వీధి బాలల కష్టాలను ఎత్తిచూపారు. అమ్మానాన్నతో కలసి తమ చిట్టిచేతుల్తో రాళ్లు కొడుతున్న చిన్నారులు, ప్రమాదకర పరిస్థితుల్లో ప్రాణాలను పణంగా పెట్టి పనులు చేస్తున్న బాలల ఇతివృత్తంతో ఆ సినిమా కథ నడుస్తుంది.

చాలా కాలం క్రితం రోజారమణి 'భక్త ప్రహ్లాద' సినిమా చేస్తే పిల్లలు, పెద్దలూ ఆసక్తిగా చూశారు. 'లవకుశ'లో లవుడు కుశుడు పాత్రల్లో మెప్పించిన చిన్నారులు మన మస్తిష్కాల్లో చెరగని ముద్ర వేశారు. సినిమా అంతా బాలలే నడిపించిన 'బాల భారతం' వచ్చింది. 'బాల రామాయణమూ' వచ్చింది. అప్పటి బాలల సినిమాలకు ప్రభుత్వాలు రాయితీలు ఇచ్చేవి. అవన్నీ ఇప్పుడు లేవు. పిల్లల భావోద్వేగాలను చెప్పే సినిమాలు మాట అటుంచితే, పిల్లలకు ఆరోగ్యకరమైన వినోదం అందించే సినిమాలు ఇప్పుడు మచ్చుకు ఒక్కటి కూడా లేదు.

హిట్ సాంగ్స్..

'ఐయామ్ వెరీ గుడ్ గాళ్.. టెల్ మీ ఓల్డ్ టీచర్..' అంటూ అన్నయ్యని ఏడిపించే అల్లరి చెల్లెలు కేంద్రంగా నడిచిన కథలు, 'పిల్లలూ, దేవుడూ చల్లని వారే..' అంటూ దూరమైన అమ్మానాన్నని ఒక్కటి చేయాలని తపించే చిన్నారులు నడిపించిన కథలు, 'అన్ని దారులూ ఒకటేనా.. బాల్యం ఇక్కడ నిజమేనా..' అంటూ వీధి బాలల స్థితిగతులు కళ్లకు కట్టినట్లు చెప్పిన సినిమాలు, 'గున్న మామిడి కొమ్మ మీద గూళ్లు రెండు ఉన్నాయి..' అంటూ స్నేహానికి ధనిక, పేద తారతమ్యాలు లేవని చెప్పిన బాలలు.. ఇలా బాలలు కేంద్రంగా నడిపించిన అలనాటి సినిమాలు ఎన్నో. మరి ఇప్పుడు.. సినిమాల్లో పిల్లలు కనిపించరు. కనిపించినా 'తూనీగా.. తూనీగ..' అంటూ ఆరేళ్లకే ప్రేమ గీతాలు పాడిస్తారు. 'చిట్టి నాయుడు' పాత్రతో పెద్దలను ముప్పుతిప్పలు పెట్టే వెకిలిచేష్టలు చూపిస్తారు.

సమాజంలో పిల్లలూ భాగస్వాములే..

ఆస్కార్ బరిలో చివరివరకు పోరాడిన బాలీవుడ్ చిత్రం 'లగాన్' గుర్తుంది కదా! అందులో క్రికెట్ ఆడే బృందాన్ని గమనిస్తే.. వృద్ధుడు, ముస్లిం వ్యక్తి, వెనుకబడిన కులానికి చెందినవారు, చేతివృత్తుల వారితో పాటు ఓ పిల్లవాడు కూడా ఉంటాడు. మ్యాచ్ కీలక సమయంలో ఆ పిల్లవాడు బరిలో దిగి ఆటని గెలిపిస్తాడు. అంటే ఈ సినిమా కథలో అంతర్లీనంగా సమాజంలో పిల్లల పాత్ర గొప్పదనాన్ని చూపించారు. ఆ తరువాత వచ్చిన 'తారే జమీన్ పర్' చిత్రంలో మానసిక పరిపక్వత లేని చిన్నారి అపరమేథస్సుకు పెద్దపీట వేశారు.

పెద్ద నటులు, రచయితలు, కవులు..

ఎన్.టి.ఆర్ 'రాము', 'లవకుశ', ఏ.ఎన్.ఆర్ 'సుడిగుండాలు', శోభన్‌బాబు 'సిసింద్రీ చిట్టిబాబు', హరనాథ్ 'లేత మనసులు' వంటి సినిమాల్లో నటించారు. ఆ రోజుల్లో మాస్టర్ రాము నటించిన 'పాపం పసివాడు' సినిమా సూపర్ హిట్. 'బాల భారతం' సినిమాకి 'మానవుడే మహనీయుడు' వంటి హిట్ సాంగ్‌ను శ్రీశ్రీ రాశారు. ఆ తర్వాత భానుమతి రామకృష్ణ దర్శకత్వంలో పిల్లలే అన్ని పాత్రలు పోషించిన 'భక్తధృవ మార్కండేయ' చిత్రం తెరకెక్కింది. సావిత్రి పిల్లల కోసమే 'చిన్నారి పాపలు' సినిమాను నిర్మించారు. కె.ఎస్.ప్రకాశరావు స్వీయదర్శకత్వంలో 'బాలానందం', బి.ఆర్.పంతులు దర్శకత్వంలో 'పిల్లలు తెచ్చిన చల్లనిరాజ్యం' సినిమాలు తెరకెక్కాయి. 1992లో వచ్చిన 'భద్రం కొడుకో' సినిమా బాలల చిత్రాలకు బలమైన దారి చూపించింది. వీధి బాలల సమస్యలను చర్చించిన ఈ సినిమాకు ఓల్గా రచన చేశారు. అక్కినేని కుటుంబరావు దర్శకత్వం వహించారు. ఈ సినిమాలన్నీ పిల్లలూ సినిమా కథను నడిపించగలరని నిరూపించాయి.

కొంతకాలం క్రితం..

గుణశేఖర్ దర్శకత్వంలో 'బాల రామాయణం' వచ్చింది. జూనియర్ ఎన్టీఆర్ ఈ సినిమాలో రాముడిగా నటించారు. అంతకు ముందు బేబీ షాలినీతో 'బంధం' సినిమా వచ్చింది. తరుణ్ 'మనసు మమత', 'తేజ' వంటి సినిమాలతో అలరించాడు. బేబి సుజిత 'పసివాడి ప్రాణం' సినిమాతో మెప్పించింది. మణిరత్నం తమిళ సినిమా, తెలుగులో డబ్ అయిన 'అంజలి' చిత్రంలో పిల్లలు తమకు ఎదురయ్యే అవరోధాలను ఎలా అధిగమించాలో చూపించారు. గుణ్ణం గంగరాజు 'లిటిల్ సోల్జర్స్' చిత్రంలో చూపించిన పిల్లల అల్లరిని ఎవ్వరూ మరిచిపోరు. రామానాయుడు నిర్మాత గా బి.నరసింగరావు దర్శకత్వంలో 'హరివిల్లు' చిత్రం వచ్చింది.

ఈమధ్యకాలం..

మలయాళం, తమిళం, కన్నడ చిత్రసీమల్లో అప్పుడప్పుడైనా బాలల చిత్రాలు వస్తున్నాయి. ఆ చొరవ తెలుగులోనే తక్కువైంది. ఇటీవల తెలుగులో వచ్చిన '35.. చిన్న కథ కాదు' చిత్రం ఇప్పటి ట్రెండ్‌కి అనుగుణంగా తీశారు. మార్కుల ఊబిలో కొట్టుకుపోతున్న చిన్నా,పెద్దలకు ఈ చిత్రం గొప్ప కనువిప్పు కలిగించింది. అందులో నటించిన బాలుడి నటనకి ప్రతి ఒక్కరూ ఫిదా అయ్యారు. సమాజం, సినిమా పిల్లల వినోదం కోసం ఆలోచించాలి. ఆరోగ్యకరమైన వినోదం పిల్లలని విజ్ఞానం దిశగా నడిపిస్తుంది.

అమ్మ

ఊరికే తిరిగితే తిట్టింది అమ్మ
దండనగ మమ్మల్ని కొట్టింది అమ్మ

చెడు మనకు తగదంటు చిన్న
శిక్షలు వేసి
క్రమశిక్షణను గూర్చి చెప్పింది అమ్మ

చందమామను చూపి వీధి అంతా తిప్పి
చిరు గోరుముద్దలను పెట్టింది అమ్మ

భోజనం సమయాన పొలమారితేను
నీళ్లిచ్చి తల పైన తట్టింది అమ్మ

జోలపాటలు పాడి జోకొట్టి మమ్మల్ని
నీతికథతో నిద్ర పుచ్చింది అమ్మ

మంచిగా పెంచింది విద్య నేర్పించింది
మా కొరకు ఎంతో శ్రమ పడింది అమ్మ

అమ్మ ప్రేమ ఈ విశ్వమంత
నా మీద ప్రేమ తీరక
మళ్లీ పుట్టింది మా అమ్మ

– గొట్టాపు శ్రీనివాసరావు, సాలూరు,
95420 19064.

నేను చేసిన బొమ్మ

పి. వెన్నెల,
8వ తరగతి,
గుడ్ న్యూస్ స్కూలు, ఏలూరు.

జవాబులు రాయండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన పదాలకు సమాన అర్థం వచ్చే మరో పదం రాయాలి. ట్రై చేయండి చూద్దాం.

చంద్రుడు -----	నింగి---
రేయి ----	అడవి---
తటాకం----	ఎద్దు---
పువ్వు--	ఫలం---

నేను గీసిన బొమ్మ

రామేశ్వరపు హాసిని,
6వ తరగతి,
ఎంపిపియుపి స్కూలు,
నడవపల్లి,
డా.బి.ఆర్. అంబేద్కర్
కోనసీమ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

హాకీలో సెమీస్‌కు అమ్మాయిలు

- చైనాపై 3-0తో గెలుపు
- ఆసియాకప్ మహిళల హాకీ

రాజ్‌గిర్(బీహార్): ఆసియాకప్ మహిళల హాకీ సెమీఫైనల్లోకి భారత్ దూసుకెళ్లింది. శనివారం జరిగిన నాల్గో లీగ్ మ్యాచ్‌లో భారత్ 3-0గోల్స్‌తో పటిష్ట చైనాపై విజయం సాధించింది. తొలి అర్ధభాగం ముగిసేసరికి 0-0తో సమంగా నిలిచినా. రెండో అర్ధభాగంలో భారత్ మూడు గోల్స్ కొట్టింది. రెండో అర్ధభాగం 32వ ని.లో సంగీత, 36వ ని.లో కెప్టెన్ సలీమా ఒక్కో గోల్ కొట్టారు. దీంతో మూడో క్వార్టర్ ముగిసేసరికి భారత్ 2-0గోల్స్ ఆధిక్యతలో నిలిచింది. నాల్గో క్వార్టర్‌లో భాగంగా మ్యాచ్ మరో నిమిషంలో ముగుస్తుందనగా దీపిక సెహ్రావత్ ఒక గోల్ కొట్టింది. దీంతో ఆరుజట్లు పోటీపడుతున్న ఆసియాకప్ టోర్నమెంట్‌లో భారత్ వరుసగా నాలుగో విజయాన్ని సొంతం చేసుకొని 12పాయింట్లతో అగ్రస్థానంలోకి దూసుకెళ్లింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు కెప్టెన్ సలీమాకు దక్కింది. నేడు జరిగిన ఇతర పోటీల్లో కొరియా 4-0తో థాయ్‌లాండ్‌ను, జపాన్ 2-1తో మలేషియాను ఓడించాయి. ఆదివారం జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో ఇండియా జట్టు జపాన్‌తో తలపడనుంది. 19న సెమీఫైనల్స్, 20న ఫైనల్ మ్యాచ్ జరగనుంది.

పాయింట్ల పట్టిక

దేశం	ఆ	గె	డ్రా	ఓ	చే.గో	ఇ.గో.	గో.అ.	పా
భారత్	4	4	0	0	23	2	21	12
చైనా	4	3	0	1	22	4	18	9
జపాన్	4	1	2	1	6	6	0	5
కొరియా	4	1	1	2	9	7	2	4
మలేషియా	4	1	0	3	3	12	-9	3
థాయ్‌లాండ్	4	0	1	3	1	33	-32	1

పన్ను చెల్లింపుదారులు శ్రద్ధ వహించగలరు!

విదేశీ ఆస్తులను కలిగి ఉండటం / విదేశీ ఆదాయాన్ని సంపాదించడం

దయచేసి పూరించండి

విదేశీ ఆస్తి / విదేశీ మూల ఆదాయ షెడ్యూల్

మీ ఐటీఆర్ లో

దాఖలు చేయడానికి చివరి తేదీ మరియు ఏ.ఆర్ 2024-25 కోసం సవరించిన తేది: 31 డిసెంబర్, 2024

మీరు అయితే

గత సంవత్సరంలో భారతదేశంలోని పన్ను నివాసి, మరియు / స్వంత విదేశీ ఆస్తులు (ఎఫ్ఏ) లేదా / గత సంవత్సరంలో విదేశీ ఆదాయాన్ని సంపాదించారు

విదేశీ ఆస్తులు (ఎఫ్ఏ) ఉన్నాయి

- విదేశీ బ్యాంకు ఖాతాలు
- విదేశీ నగదు విలువ బీమా ఒప్పందం లేదా వార్షిక ఒప్పందం
- ఏదైనా సంస్థ/వ్యాపారంపై ఆర్థిక ఆసక్తి
- స్థిరాస్తి
- విదేశీ కస్టడీయల్ ఖాతా
- విదేశీ ఈక్విటీ మరియు రుణ వడ్డీ
- భారతదేశం వెలుపల ఉన్న ట్రస్ట్‌లు, ఇందులో మీరు ట్రస్టీ, లబ్ధిదారు లేదా సెటిలర్
- మీకు సంతకం చేసే అధికారం ఉన్న ఖాతా(లు).
- ఏదైనా ఇతర మూలధన ఆస్తి
- షెడ్యూల్ ఎఫ్ఏ లో ఉంచబడిన మరియు సూచించిన ఏవైనా ఇతర విదేశీ ఆస్తులు

శ్రద్ధ వహించండి

క్యాలెండర్ ఇయర్ 2023లో ఏ సమయంలోనైనా విదేశీ ఆస్తులు / ఆదాయం కోసం భారతదేశంలో నివాసి తప్పనిసరిగా FA/FSI షెడ్యూల్‌ని పూరించాలి

ఆదాయం పన్ను విధించదగిన పరిమితి కంటే తక్కువగా ఉన్నప్పటికీ

ఒకవేళ, విదేశీ ఆస్తులను బహిర్గత మూలాల నుండి సంపాదించినప్పటికీ

దయచేసి సరైన ఐటీఆర్ ఫారమ్‌ను ఎంచుకోండి (ITR-1 & ITR-4 కాకుండా)

CBS 15401/13/0008/2425

దయచేసి గమనించండి: ఐటీఆర్‌లో విదేశీ ఆస్తి / ఆదాయాన్ని వెల్లడించడంలో విఫలమైతే నల్లధనం (బహిర్గతంకాని విదేశీ ఆదాయం మరియు ఆస్తులు) మరియు పన్ను చట్టం, 2015 విధింపు కింద రూ. 10 లక్షలు జరిమానా విధించవచ్చు.

మరింత సహాయం కోసం, www.incometax.gov.in ని సందర్శించండి

మరింత సమాచారం కోసం క్యూఆర్‌కోడ్ స్కాన్ చేయండి

ఆదాయపు పన్ను శాఖ
సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్

@IncomeTaxIndia @IncomeTaxIndia.Official @IncomeTaxIndiaOfficial @IncomeTaxIndiaOfficial IncomeTaxIndia.gov.in

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68